RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక


Website: prajabalam.in



12 జనవరి 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:191

# మహానగరం ఖాళీ

## హైదరాబాద్ - విజయవాడ రహదారిపై నిమిషానికి కొన్ని వందల వాహనాలు



హైదరాబాద్, జనవరి 11 ౦ండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగను బంధుమిత్రులతో కలిసి జరుపుకొనేందుకు నగరవాసులు సొంత ఊళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్?-విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. అబ్దుల్లాపూర్?మెట్? ఔటర్? రింగ్? రోడ్డు నుంచి కొత్తగూడెం వరకు వాహనాలు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు పెద్ద అంబర్?పేట్? ఔటర్? రింగ్? రోడ్డుపై భారీగా ట్రాఫిక్? జామ్? ఏర్పడింది. ఔటర్?పై వాహనాలు బారులు తీరాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పల్లెబాట పట్టిన జనం - హైదరాబాద్? - విజయవాడ రహదారిపై భారీగా ట్రాఫిక్? జామ్ 10 టోల్?బూత్?లను విజయవాడవైపు తెరిచిన అధికారులు : విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై గత రాత్రి నుంచి కొనసాగుతున్న వాహనాల రద్దీ కారణంగా యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ భారీగా కొనసాగుతుంది. రద్దీని నియంత్రించేందుకు టోల్ ప్లాజా సిబ్బంది, పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాహనాల రద్దీ దృష్ట్యా 10 టోల్ బూత్?లను విజయవాడ వైపు తెరిచారు.

4 సెకండ్లకు ఒక వాహనం చొప్పున : సాధారణ రోజుల్లో 35,000 నుంచి 45,000 వాహనాలు వెళ్తాయని, సంక్రాంతి పండుగ సందర్భంగా మాత్రం శుక్రవారం ఒక్క రోజే 55 వేల వాహనాలు వెళ్లినట్లు ఇక్కడి అధికారులు చెబుతున్నారు. ఈరోజు జాతీయ రహదారిపై వాహనాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగానే ఇక్కడ వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నాలుగు సెకండ్లలో ఒక వాహనం చొప్పున టోల్ ప్లాజా నుంచి వెళ్తుంది. నిమిషానికి 330 వాహనాలు విజయవాడ వైపు వెళ్తున్నట్లు సమాచారం.ప్రైవేటు ట్రావెల్స్? బస్సులకు తనిఖీలు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ అధికారి సదానందం ఆదేశాల మేరకు తెల్లవారుజామునుంచి రాజేంద్రనగర్ ఆరాంఘర్ చౌరస్తా వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులుతనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని వాటిపై చర్యలు చేపట్టారు.చెన్నై,తిరువంతపురం,పాండిచ్చేరి,మంగళూరు, మైసూరు,కన్యాకుమారి నుండి హైదరాబాద్ వస్తున్న బస్సులను తనిఖీలు చేశారు. నిబంధనలను అతిక్రమించిన 11 ట్రావెల్స్ బస్సులను సిజ్ చేసి కేసులు నమోదు చేశారు.

# కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు శంకుస్థాపన చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:హైదరాబాద్ నగరంలో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్తగా నిర్మించబోయే ఉస్మానియా ఆసుపత్రికి సంబంధించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి గారు తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్యఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.



అధికారులు వివరించిన మ్యాప్‌లలో ముఖ్యమంత్రి గారు పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని చెప్పారు.

ముఖ్యంగా రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు.

అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులో శంకుస్థాపన చేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు రైతుబంధు ఉండదు

## స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




హైదరాబాద్ జనవరి 11 రైతుభరోసా, ఇళ్లు ఇవ్వడంలేదని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. అలాంటివి నమ్మొద్దు అని, వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నవారందరికీ రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసాకు ఎకరాకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వబోతున్నామన్నారు. తెలంగాణలో జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు అర్హులందరికీ అందిస్తామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి ఇళ్ల పటాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు మాత్రమే రైతుబంధు ఉండదని స్పష్టం చేశారు. ఎవరూ అభద్రతకు లోనుకావద్దని, అన్ని ప్రభుత్వ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ఈ నెల 26న మరో నాలుగు పథకాలు అమలు చేస్తామని, సంక్రాంతి పండుగ కానుకగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని, గత ప్రభుత్వంలో కట్టకుండా వదిలేసిన ఇళ్లను కూడా నిర్మించి ఇస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయిస్తామని, నాలుగు విడతల్లో రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తామని, ఈ నెల నుంచే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని పొంగులేటి పేర్కొన్నారు.

# అల్లు అర్జున్‌కు భారీ ఊరట



హైదరాబాద్ జనవరి 11 నాంపల్లి కోర్టులో హీరో అల్లు అర్జున్‌కు భారీ ఊరట లభించింది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ లో హాజరుకావాలన్న నిబంధననుంచి అర్జున్ కు కోర్టు మినహాయింపు ఇచ్చింది. భద్రతా కారణాల దృష్ట్యా అల్లు మినహాయింపు కోరారు. మరోవైపు అల్లు అర్జున్‌కు విదేశాలకు వెళ్లేందుకు నాంపల్లి కోర్టు అనుమతించింది. పుష్ప2 ప్రీమియర్ సందర్భంగా సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరగడంతో రేవతి అనే మహిళ చనిపోయింది. ఈ ఘటన తర్వాత చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను ఎ11గా చేర్చుతూ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.



# ప్రజాబలం

12 జనవరి 2025 ఆదివారం


## నైపుణ్య యువతే రేపటి భవిత!

దేశ ఘన చరిత్రను మార్చి రాయగలిగేది విద్యావేత్తలు మాత్రమే. దేశ, ప్రపంచ దశ దిశలకు మార్చగలిగే సామర్థ్యం విద్యావేత్తలతో ఉంటుంది. రేపటి సమాజ స్థితిగతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యాప్తి కాదు, మేధో వ్యవస్థ. సమాజ గతిని మార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు పెద్దలు. కత్తి కన్న కలం గొప్పది దిగని కూజా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి అయ్యింది. వ్యక్తి, కుటుంబ, దేశ ప్రగతికి బాటలు వేయగలిగేది విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం. స్వతంత్ర భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఏఐసిటిఈ, ఐఐఎస్‌సి యూజిసి, వయోజన విద్య లాంటివి నెలకొల్పి దేశ యువతను అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి చక్కటి మార్గాన్ని వేశారు. ఒక బాలిక లేదా యువతి ఒక తరగతి ఎక్కువగా చదివితే ఆవిడ భవిష్యత్తు ఆదాయం 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొనబడింది. మహిళ/బాలికల నిర్భంధ ఉచిత విద్యకు పెద్ద పీట వేసిన నాయకుల దార్శనికత కొనియాడదగింది. చదువు, నైపుణ్యాల ద్వారానే దేశ సంస్కృతి వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మిన మేధావులు మనదేశంలో అనేకులు ఉన్నారు. విద్య ప్రయోజనాలలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ ఉద్యోగం, సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాణి తరిమేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోవడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాలను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటివి అనేకం ఉన్నాయి.

విద్యార్థి కేంద్రిత విద్య లేదా స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్

ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం, విలక్షణ ఆలోచనలకు ఊతం ఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకు పట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటి విద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి ప్రతిభ దేశానికి దోహదపడుతుంది. నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వులాంటిదే అని గమనించి నేటి యువత విద్య, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. జాతీయ విద్యా దినోత్సవ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడించ్ హాబిట్‌ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్య అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో భారత ప్రభుత్వం విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించి సర్వశిక్షా అభియాన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, నూతన విద్యా విధానం-2000 లాంటి పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత్‌లో అక్షరాస్యత రేడు 77.7 శాతం మాత్రమే ఉన్నది. మన దేశంలో అక్షరాస్యత రేటు కేరళలో అత్యధికంగా 96.9 శాతం, అత్యల్పంగా బీహార్‌లో 61.8 శాతం నమోదు అవుతున్నది. తెలంగాణలో 72.8 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 66.8 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. గ్రామీణ భారతంలో 73.5 శాతం, పట్టణ ప్రాంతాల్లో 87.7 శాతం అక్షరాస్యత నమోదు అవుతుండగా, పురుషుల్లో 84.7 శాతం, మహిళల్లో 70.3 శాతం నమోదు అవుతున్నది. ప్రపంచంలో 3వ అతి పెద్ద విద్యా వ్యవస్థ కలిగిన భారతంలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 459 రాష్ట్ర యూనివర్సిటీలు, 126 డీమ్డ్ యూనివర్సిటీలు, 430 ప్రైవేట్ యూనివర్సిటీలు, 1.5 మిలియన్ల పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల విద్యను 260 మిలియన్లు అభ్యసిస్తున్నారు. భారత ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతంగా నమోదు అవుతున్నది. ప్రతి లక్ష జనాభాకు బీహార్‌లో 7 కళాశాలలు, తెలంగాణలో 59 కళాశాలలు ఉండగా దేశంలో సగటున 28 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి అమెరికాలో 13:1, చైనాలో 20:1 ఉండగా భారత్‌లో మాత్రం 30:1గా ఉన్నది. దేశంలో 30 శాతం కళాశాలలు మాత్రమే గుర్తింపు పొందగా, 45 శాతం యూనివర్సిటీలు మాత్రమే గ్రేడ్స్ పొందాయి. ప్రపంచ అత్యుత్తమ 1000 యూనివర్సిటీల్లో భారత్‌కు చెందిన 91 యూనివర్సిటీలు మాత్రమే ఉండడం విచారకరం. భారత్‌లో విద్యా వ్యవస్థ కొంత వరకు గాడి తప్పినట్లు, నాణ్యతలకు తిలోదకాలిస్తూ, నైపుణ్య విద్యను గంగలో కలుపుతూ యువభారతం నిరుద్యోగంతో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నది. గుణాత్మక విద్యను త్యాగం చేస్తూ పరిమాణాత్మక మెరుపులకే మురిసి పోతున్న భారతీయ విద్యా వ్యవస్థను పట్టాలపైకి తీసుకురావలసిన సమయం ఆసన్నమైంది. యువ భారతానికి డిజిటల్ మెరుగులు దిద్ది, నైపుణ్య బుద్దులు నేర్పి అంతర్జాతీయ స్థాయి టెక్నోక్రేట్స్, సైంటిస్టులు, అధ్యాపకులు, పలురంగాల్లో శాసించగల మేధావులను తయారు చేసే నూతన గుణాత్మక విద్య విధానం కావాలని, ప్రభుత్వాలు ఆ దిశలో పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. అందరికీ జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



## 10 సేల్ ఫోన్ లు రికవరీ, ఫోన్ యజమానులకు అప్పగించిన పోలీసులు.

తూప్రాన్, జనవరి,11ప్రాజబలం ప్రతినిధి:- మెదక్ జిల్ల తూప్రాన్ మండలంలో వివిధ ప్రదేశాల్లో పోగొట్టుకున్న సెల్ ఫోన్ లను సి ఈ అనే నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 10 సేల్ ఫోన్ లను ట్రెస్ చేసిన అనంతరం తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, తూప్రాన్ సిఐ రంగ కృష్ణ చేతుల మీదుగా పదిమందికి వారు పోగొట్టుకున్న సెల్ ఫోన్లు తిరిగి ఎవరివి వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సై శివానందం తదితరులు పాల్గొన్నారు.ఖ

## మిడియేషన్ లో శిక్షణ పోందిన కొత్తగూడెం జిల్లా కోర్టు న్యాయవాదుల కు సర్టిఫికెట్లు అందించిన తెలంగాణ హై కోర్టు జడ్జిలు..

## ట్రైని మిడియేటర్స్ గా అడపాల పార్వతి, మహమ్మద్ సాదిక్ పాషా..



భారత సుప్రీంకోర్టు ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మిడియేషన్ ఌ ఆర్బిటేషన్ సెంటర్ వారి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని తెలంగాణ జూడిషియల్ అకాడమీ లో జరిగిన ఐదు రోజుల ట్రైనింగ్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు నుండి ప్రాతినిధ్యం వహించి మిడియేషన్ లో శిక్షణ పోందిన న్యాయవాదులు అడపాల పార్వతి, మహమ్మద్ సాదిక్ పాషా, లకు ట్రైనింగ్ అనంతరం జూడిషియల్ అకాడమీ లో జరిగిన కార్యక్రమంలో ట్రైని మిడియేటర్స్ గా సర్టిఫికెట్లు అందించిన తెలంగాణ జూడిషియల్ అకాడమీ ప్రసిడెంట్, హై కోర్టు జస్టిస్ పి.సామ్ కొశి, తెలంగాణ మిడియేషన్ మరియు ఆర్బిటేషన్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షులు హైకోర్టు జస్టిస్ కే.లక్ష్మణ్ , తెలంగాణ మిడియేషన్ మరియు ఆర్బిటేషన్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యులు హైకోర్టు జస్టిస్ జే. శ్రీనివాస్ రావు పాల్గొని సర్టిఫికెట్స్ అందజేశారు

## ముగ్గులు భారత స్త్రీల హస్తకళకు ప్రతిబింబాలు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్




వనపర్తి జనవరి-11: ముగ్గులు భారతీయ మహిళల హస్తకళా నైపుణ్యానికి ప్రతిబింబాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్× అన్నారు.సంక్రాంతి సంబరాలలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జనమైత్రి క్రీడలలో భాగంగా జిల్లాలో మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీని ఎస్పీ కార్యాలయం క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. భారతీయుల సంస్కృతి సాంప్రదాయంలో ముగ్గులది ప్రధానమైన పాత్ర అని ఆయన వివరించారు.ఎలాంటి సాధనాలు ఉపయోగించకుండా మన మహిళలు మునివేళ్లతో వేసే ముగ్గులను ప్రపంచంలోని స్త్రీలంతా ఆశ్చర్యంగా చూస్తారని ఎస్పీ వివరించారు.అనాదిగా వస్తున్న ఈ కళలను ప్రోత్సహిస్తూ కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఎస్పీసతీమణి శ్రీమతి అపర్ణ కుటుంబ సభ్యులతోపాటు పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇతర ప్రాంతాలవారు ఉత్సాహంగా పాల్గొన్నారు.విజేతలకు ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పి సతీమణి శ్రీమతి, అపర్ణ , డిసిఆర్బి డిఎస్పి, ఉమామహేశ్వర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పలనాయుడు, మహిళ ఎస్సైలు, మహిళ, కానిస్టేబుల్, మరియు కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దుమ్ములపేటలో సంక్రాంతి వేడుకలు

కాకినాడ గత వైకాపా ప్రభుత్వం మత్స్యకారులను అనేక ఇబ్బందులను గురి చేయడమే కాకుండా వారి సంక్షేమాన్ని విస్మరించిందని కాకినాడ సిటి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ కార్పోరేషన్లోని 10వ డివిజన్ దుమ్ములపేటలో స్థానిక నాయకులు మూగ రాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముఖ్యఅతిధిగా పాల్గొని మహిళలు వేసిన రంగురంగుల రంగోళిలను పరిశీలించారు. అలాగే భోగి మంటలను వేసి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మూగ రాజు అధ్యక్షతన జరిగిన సభలో సిటి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొందన్నారు. మత్స్యకార సంక్షేమాన్ని, వేట నిషేధ సమయంలో ఇవ్వలసిన పరిహారం కూడా అరకొరగా ఇవ్వడం జరిగిందన్నారు. కాని కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఏదైతో మాట ఇచ్చిందో. ఆ మాట ప్రకారం మత్స్యకార సంక్షేమం కోసం పాటుపడుతోందని, మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ తుమ్మల సునీత, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

## చెన్నంపల్లి గ్రామంలో గోకులం షెడ్డు ప్రారంభం

తుగ్గలి మండలం పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో పత్తికొండ శాసన సభ్యులు కె.యి శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు చెన్నంపల్లి గ్రామ టిడిపి నాయకులు మా బాషా,రాజేంద్ర గౌడ్,కోటేష్ గౌడ్,అక్బర్ బాషా ఆద్వర్యంలో ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు,మండల టిడిపి కన్వీనర్ ఆర్ తిరుపాలు నాయుడు, తిమ్మయ్య చౌదరి,మనోహర్ చౌదరి, రాతన మైరాముడు,తుగ్గలి మండల ఎపీఓ హేమ సుందర్ లు చెన్నంపల్లి గ్రామ రైతు ఎద్దులదొడ్డి మల్లికార్జున ఉపాధి హామీ గ్రామీణ పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు.అదేవిధంగా ఎర్రగుడి గ్రామం నందు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట రాముడు,టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర,మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్, టిడిపి నాయకులు వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్,ఏపీఓ హేమ సుందర్ లు గోకులం షెడ్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చెన్నంపల్లి గ్రామ టిడిపి సీనియర్ నాయకులు మా బాషా,అక్బర్, హనుమంతు రెడ్డి,జయ రాముడు, మండల టిడిపి ఉపాధ్యక్షులు వెంకట రాముడు చౌదరి,ఫీల్డ్ అసిస్టెంట్ దేవేంద్ర, రంగ స్వామి,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి కానుకల పంపిణీలో పాల్గోన్న ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ అందరూ ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాల ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. :-కాకినాడ వార్ఫురోడ్డులో గల ది. కాకినాడ మిని గూడ్స్ లారీ అండ్ వ్యాన్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షులు చొక్కా నానాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిటి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు.

ముందుగా సంఘం కార్యాలయం సమీపంలో గల వినాయకుని ఆలయంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంఘం కార్యాలయంకు చేరుకుని కార్యాలయంను పరిశీలించారు. అనంతరం సంఘం అధ్యక్షులు చొక్కా నానాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిటి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో పండుగ జరుపుకొవాలని, సంఘం కార్యవర్గ సభ్యులు మంచి అలోచనతో పండుగ కానుకను ఇవ్వడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షులు చొక్కా నానాజీ మట్లాడుతూ సంఘం పేరుతో ఎవరి వద్దకు వెళ్ళి సోమ్ములను వసూలు చేయలేదని, సంఘం సభ్యులు వారి సంక్షేమం నిధి ద్వారానే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని వివరించారు. అనంతరం సంఘం సభ్యులకు పండుగ కానుకను పంపిణి చేసారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే వనమాడిని సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.టి.యు.సి. కాకినాడ జిల్లా అధ్యక్షులు గదుల సాయిబాబు, ది.కాకినాడ మిని గూడ్స్ లారీ అండ్ వ్యాన్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పిల్లి రాముడు, కోశాధికారి గరగ వీరకుమార్, వైస్ ప్రెసిడెంట్ పరిమి రామారావు, జాయింట్ సెక్రటరీ బంధం బాబుతో పాటు సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం రితేష్ రెడ్డి

బద్వేలు పేద బడుగు బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బద్వేల్ నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త రితేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సావిశెట్టిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.. ప్రజా సమస్యలు పార్టీలకు అతీతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చెరువుకు నీటి సరఫరా అందించాలని ప్రజలు విన్నవించుకోవడంతో చెరువులకు సంబంధించి ప్రత్యేక సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన అన్నారు. అతి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పమన్నారు. సావిశెట్టిపల్లె,అక్కెంగుండ్ల గ్రామ పొలాల్లో వందల ఎకరాల భూములను ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఆక్రమణకు గురి చేశారని ఆయన దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా ఈ భూ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాలలో సిమెంటు రోడ్లు స్ట్రీట్ లైట్లు మొదలైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చారు.గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నాయని విషయంపై సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గురివిరెడ్డి, మండల నాయకులు రాజా రెడ్డి,బసిరెడ్డి రవీంద్ర రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి,విజయ్ కుమార్ రెడ్డి, డి.వి.సుబ్బారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి,గోపావరపు కేశవరెడ్డి,జగదీశ్వర్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సాహితీ సూరీడు అలిశెట్టి ప్రభాకరుడు

అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక' అన్న మహాకవి కాళోజి మాటలు, శ్రీశ్రీ తరువాత అంత ఎక్కువగా 'కోట్' అయిన కవిత్వాన్ని సొంతం చేసుకున్న అలిశెట్టి ప్రభాకర్ కలం నుండి జాలువారి,హృదయాలను కదిలించే కవితాక్షరాలకు సరిగ్గా సరిపోతాయి. అలిశెట్టి ప్రభాకర్ అనేది నిజానికి వ్యక్తి పేరు కాదు. అగ్ని జ్వాలా మయమైన కవితా శక్తి పేరు. ...ఉప్పొంగే భావావేశానికి మామూలుగా కవులు అక్షరాలను అద్దితే, అలిశెట్టి కవితకు తన చెమటను, ఆపై రక్తాన్ని అద్దాడు.

ఊపిరిని ఫణంగా పెట్టి అక్షరానికి ప్రాణ ప్రతిష్ట చేశాడు. సామాజిక సమస్యలపై కలంతో పోరాడి, తన పోరాట మాధ్యమం కవిత్వమే అని భావించి, కెమెరా కన్ను...కుంచె గన్ను...కవాతు పెన్నుల ఏకీకరణతో, కవిత కోసమే బతికాడు. కవిత కోసమే ప్రాణాలిచ్చాడు. కుటుంబ పోషణార్ధం ఫోటోగ్రఫీ వృత్తిని ఎంచుకున్నప్పటికీ, తాను జీవించ డానికి కవిత్వాన్నే ఆహారంగా తీసుకుని, మరణానికి భయపడక, పరిస్థితులలో రాజీ పడలేక, ఆశయాల కోసం దేహాన్నే ఫణంగా పెట్టి అమారుడైనాడు అలిశెట్టి. అలిశెట్టి కవిత్వం ఒక్కసారి చదివితే చాలు, నిద్రాణంగా ఉన్నవాణ్ని సైతం నినాదమై మేల్కొల్పుతుంది. అలిశెట్టి ప్రభాకర్ నేటి జిల్లా కేంద్రమైన జగిత్యాలలో 1956 జనవరి 12 న పుట్టాడు. అలిశెట్టికి ఏడుగురు అక్కా చెల్లెళ్ళు, ఇద్దరు అన్నదమ్ముళ్ళు గల పెద్ద కుటుంబంలో జన్మించగా, తండ్రి ఆకస్మికంగా మరణంతో 11 ఏళ్ల వయసులో ప్రభాకర్ కుటుంబ పోషణ బాధ్యతలు స్వీకరించాడు. ఆదర్శాలకు అనుగుణంగా పేదరాలయిన 'భాగ్యం' ను పెళ్ళి చేసుకొన్నారు. జీవిక కోసమే తప్పా, ఏనాడు సంపాదన కొరకు ఆరాటపడని మనిషి. తన కళ ప్రజల కోసమే అని చివరి వరకు నమ్మాడు. చిత్రకారుడిగా, ఫోటో గ్రాఫర్‌గా వృత్తి జీవితాన్ని కొనసాగిస్తూనే, కవిగా ఎదిగాడు. జగిత్యాల, కరీంనగర్, ఆపై1982 లో హైదరాబాదుకు మకాం మార్చాడు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళ పాటు సీరియల్‌గా, సిటీ లైఫ్ పేరుతో హైదరాబాద్ నగరం కవితా వస్తువు గా, మినీ కవిత్వం రాశాడు. తన కవిత్వంతో పాఠకుల్లో ఆలోచనాదృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన అతి కొద్ది మంది కవుల్లో అలిశెట్టి ఒకడు. క్షయ బారిన పడి 1993 జనవరి 12న మరణించాడు.

ఆయన మొదట చిత్రకారుడిగా జీవితాన్ని ప్రారంభించాడు. ప్రారంభంలో పత్రికలకు పండుగలు, ప్రకృతి, సినీనటుల బొమ్మలు వేసేవాడు. సిరిసిల్లలో రాం ఫోటో స్టూడియోలో ఫోటోగ్రఫీ నేర్చుకొని, 1975 లో జగిత్యాలలోని సొంత ఇంట్లో "పూర్ణిమ" స్టూడియో ప్రారంభించాడు. కరీంనగర్‌లో స్టూడియో "శిల్పి" (1979), హైదరాబాద్లో స్టూడియో "చిత్రలేఖ" (1983) పేర్లతోనూ స్టూడియోలు నడిపి ఫోటో గ్రాఫర్‌గా జీవితాన్ని గడిపాడు. జగిత్యాలలో "సాహితీ మిత్ర దీప్తి సంస్థ" పరిచయంతో కవిత్వ రంగంలో ప్రవేశించాడు. పేదరికం, ఆకలితో సహవాసం చేయడాన్ని అలవాటు చేసుకున్నాడు. నిరుద్యోగం, నగర జీవితం గురించి కవితలు అల్లాడు. మెజారిటీ ప్రజల బాధలూ, గాథలే తన కవిత్వానికి ముడి సరుకని చెప్పుకున్నాడు. 'గొర్రె మందతో నడిచేకంటే.. చీమల బారులో చేరితే మేలు' అనే భావించాడు. 1974లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వచ్చిన పరిష్కారం అచ్చులో కనిపించిన అలిశెట్టి మొదటి కవిత. ఎర్ర పావురాలు (1978) అచ్చైన ఆయన మొదటి కవితా సంకలనం. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళ పాటు సీరియల్‌గా "సిటీ లైఫ్" పేరుతో హైదరాబాద్ నగరంపై రాసిన "మినీ కవితల"తో ప్రఖ్యాతి పొందాడు.

సామాజిక చైతన్యమే ధ్యేయంగా కవిత్వం రాశాడు. ఎర్ర పావురాలు (1978), మంటల జెండాలు (1979), చురకలు (1981), రక్త రేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (1990), సిటీ లైఫ్ (1992), తదితర ప్రసిద్ధ కవితలు అచ్చులో వచ్చాయి. తను

శవమై../ఒకరికి వశమై.../తనువు

పుండై.../ఒకడికి పండై../ఎప్పుడూ

ఎడారై.../ఎందరికో ఒయాసిస్సై..'లో ఉన్నవి

మొత్తం పన్నెండు పదాలే. సెక్స్ వర్కర్ల దయనీయ స్థితి గురించి రాసిన అలిశెట్టి కవిత అల్ప పదాలలో అనల్ప భావాలను అద్దుకుని, సుప్రసిద్ధమైనది. వేశ్యల గురించి ప్రస్తావన వచ్చిన అనేక సందర్భాలలో అనేక మందిచే ఉదహరింపబడిన కవిత. హృదయ త్రాసు కవిత ఆయనకు కవిగా మంచి పేరు తెచ్చినదే. ఉదహరింపు కవితలో ... ప్రతిభలేకపోతే జీవితం వ్యర్థం అని, సాధన చేస్తేనే బండ శిల్పంగా మారుతుందని, కాలానికి వదిలేయకుండా ప్రయత్నం చేయాలని, చిన్న కవితలో ఎంతో అందంగా చెప్పాడు ప్రభాకర్. జీవితం అనే మినీ కవితలో మనిషి ప్రకృతిని చూసి ఎంతో నేర్చుకోవలసినది ఉందంటాడు. చిన్న విత్తనం నుంచి బయటకు వచ్చిన మొక్క, మానుగా మారి కొమ్మలు, రెమ్మలతో శాఖోపశాఖలుగా విస్తరిస్తుంది.

ఆకాశం అంత ఎత్తును చూస్తుంది. అంతేకాదు, తాను సమాజానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆశ్రయించినవారికి నీడ ఇస్తుంది. సమాజంలో పుట్టిన వ్యక్తి కూడా స్వార్థ చింతన మానుకుని వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుని తనకు, తన కుటుంబానికే కాక సమాజానికి ఉపయోగపడాలి అనే సందేశాన్ని ఎంతో తేలికైన మాటలతో, . జీవితంలో నిరాశావాదానికి చోటులేదని,వృక్షం స్వయంకృషికి ప్రతీక అని వివరించాడు.

అలిశెట్టి కవిత 'రక్తరేఖ'లో ...

"నువ్వు ఉరిమి చూసినప్పుడు
ఊరంతా పాలేర్లే
వాళ్ళే
ఊరినించి తరిమికొడితే
నీ బ్రతుకంతా పల్లేర్లే"

అంటూ భూస్వాములను హెచ్చరించడం, అలాగే.."పుస్తకం లోంచి దులిపేసిన అక్షరాల్లా లక్షకి లక్షలు దేశమంతా నిరుద్యోగుల్కె నిండుకున్నారు" అంటూ నిరుద్యోగం గురించి, తన కవిత్వంలో ముక్కు సూటిగా, పదునుగా, ఘాటుగా, విమర్శించిన భావావేశపు తీరు తెలుగులో%-%కవిత్వంలో బహు అరుదు.

"'జలగాలు' 'బ్రహ్మ'జెముళ్ళు
అవకాశవాది 'రూలుకర్రా'
'ఆరణాల కూలీ'
'పునాది'లేని 'భవనం' నాచారం 'సన్యాసులూ '

అంతర్గత కలహాలు, తరుచూ సీఎంల మార్పులు...

ముఖ్యమంత్రులు ఎవరైనా, అక్షరాలా అరాచకంలో మార్పుండదు" అని చెపుతూ, కాసు, జలగం, అంజయ్య, భవనం, చెన్నారెడ్డి, ఎన్టీఆర్, నాదెండ్ల ఇలా ఆనాటి ముఖ్యమంత్రుల తీరు పైనా పెన్నును గురి పెట్టాడు. జగిత్యాలో ఉన్న సమయంలో అలిశెట్టి కవితలు రాయడం, పోస్టు చెయ్యడమే ప్రధాన కార్యక్రమంగా చేసుకున్నాడు. తాను అనుభవించిన పేదరికం, దగ్గర నుండి చూసిన అణగారిన వర్గాల బ్రతుకు వెతలకు కల్పించిన అక్షర రూపాలు సమ కాలీన కవులపై తీవ్ర ప్రభావం చూపాయి. మార్గ నిర్దేశనం చేశాయి. తన కవిత్వంలో మహిళల పట్ల ప్రేమ, ఆర్తిని కలగలిపడంతో పాటు, దళిత, ముస్లిం, చేనేత, గౌడ బతుకుల వెతలను, రైతు, కార్మికుడు, విద్యార్థి, ఇలా అందరి సమస్యలను కవితా అంశాలుగా చేసుకున్నాడు. గాడి తప్పుతున్న సమాజాన్ని, అడుగంటుతున్న మానవీయ విలువల్ని హృదయంతో చూసి, రక్తం రంగరించి రాశాడు. కవిత్వమంటే ఏమిటో తాను 1978లో ప్రకటించిన తొలి కవితా సంకనం 'ఎర్రపావురాలు'లో

"నా గుప్పిట్లో
మండుతున్న
ఎన్నో గుండెలు
ఒక్కొక్కదాన్లో
దూరి, వాటిని చీరి,
రక్తాశ్రువులు ఏరి
పరిశీలిస్తాను నేను" అన్నాడు.

కుంచెని, కెమెరా లెన్సుని, కలాన్ని ఏకం చేసి తెలుగు కవితకు పుష్టి చేకూర్చాడు. రెండున్నర దశాబ్దాల కింద శరీరాన్ని త్యజించినా, ఆయన కవిత్వం మాత్రం గోడలపై నినాదాలై, వ్యాసాలకు మొదలు తుదలై, ప్రజల నోటి నుడికారమై నిరంతరం స్ఫురణకు వస్తూనే ఉంది. సమాజ మార్పుని ఆకాంక్షిస్తూ పేదరికానికి బలైన కవి. 'మరణం నా చివరి చరణం' కాదని, సమరమే తన అంతిమ చిరునామా అని ప్రకటించాడు. అందుకేనేమో ఈ అరుదైన కవి అలిశెట్టి పుట్టిన, గిట్టిన తేదీలు ఒకటే అయి, మళ్లీ మళ్లీ పుడుతూ సమాజ పరిస్థితులపై తాను రాసిన కవితల ద్వారా సమరం సాగిస్తూనే ఉన్నాడు. ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా కొనసాగుతూనే ఉన్నాడు.

# జాతి ఘనతను చాటిన మహోన్నతుడు

భారత దేశం ఔన్నత్యాన్ని విదేశాలకు చాటిచెప్పిన హిందూ సన్యాసి స్వామి వివేకానంద. తన భావాలను సమాజానికి పంచి, మేల్కొలిపిన మహామనిషి ఆయన. స్వదేశంలోనే కాక విదేశాలలోనూ తమ ఉపన్యాసాలతో జీవిత పరమార్థాన్ని బోధించి, ప్రజలను జాగృతం చేసిన ప్రాసం గి కుడు. వివేకానందుడు. పాశ్చాత్య దేశాలలో అడుగిడి, హిందూమత ప్రాశస్త్యాన్ని చాటి చెప్పిన మొట్ట మొదటి హిందూ సన్యాసి వివేకానందుడు. 1863 జనవరి 12న బ్రిటిష్ బెంగాలు ప్రెసిడెన్సీ లోని, పశ్చిమ బెంగాల్ నందలి నేటి కోల్కతాలో జన్మించాడు. నరేంద్ర నాథునిగా నామాంకితుడైన వివేకానందుడు, బాల్యం నుండి రోజూ ధ్యానం చేసేవాడు. సన్యాసుల పట్ల యోగుల పట్ల అమితమైన ప్రేమను చూపేవాడు. వారు ఏది అడిగినా ఇచ్చేవాడు. పువ్వు పుట్టగానే పరిమళం ఇస్తుందన్నట్లుగా చిన్ననాటినుండే, నిస్వార్థ గుణం ఆధ్యాత్మిక చింతనత అలవడ్డాయి. నరేంద్రుడు ఆట పాటలలో, చదువులో ముందుంటూ ఏకసంతాగ్రహిగా ఉండేవాడు. ఆయన జ్ఞాపక శక్తి అమోఘం. 1880 వరకు మెట్రిక్యులేషన్ పూర్తి చేసి కళాశాలలో చేరాడు. చరిత్ర, సైన్సు తోపాటు పాశ్చాత్య తత్వశాస్త్రాన్ని ఆపోసన పట్టి, రోజురోజుకు జ్ఞాన తృష్ణ పెరుగుతూ, దైవం గురించి తెలుసు కోవాలని ఆసక్తి కనబరిచే వాడు. మూఢ నమ్మకాలను విడిచి పెట్టినా, సత్యాన్ని కనుగొనలేక పోయాడు. తన సందేహాలకు పండితులతో వాదనలు సంతృప్తిని ఇవ్వలేక పోయాయి. రామకృష్ణ పరమహంస తాను భగవంతుని కనుగొని ఉన్నానని చెప్పగా నరేంద్రుడు విన్నాడు. ఒకసారి మిత్రులతో కలిసి ఆయనను కలవడానికి దక్షిణేశ్వర్ వెళ్ళాడు. రామకృష్ణుడు భగవంతుని సంభాషణలో శిష్యులతో సంభాషిస్తూ ఉన్నాడు. నరేంద్రుని దృష్టి ఆయనపై పడి, కొద్దిపాటి మానసిక కల్లోలానికి లోనై, పాత జ్ఞాపకాలు ఏవో తట్టి లేపుతున్న అనుభూతికి గురయ్యాడు. నరేంద్రుని ఆకర్షణీయమైన రూపాన్ని చూసిన రామకృష్ణుడు, ఆశ్చర్యచకితుడై నీవు పాడగలవా? అని ప్రశ్నించి, నరేంద్ర నోట రెండు బెంగాలీ ఈ పాటలు విని, తాదాత్మ్యం చెంది, నరేంద్రుని తన గదికి తీసుకెళ్లి భుజం తట్టి ఇంత ఆలస్యమైనది ఏమిటి? ఇన్ని రోజులుగా నీ కోసం చూసి చూసి అలసి పోతున్నా. నా అనుభవాలన్ని సరైన వ్యక్తితో పంచుకోవాలనుకున్నా. నీవు సామాన్యుడు కావు. సాక్షాత్తూ దివి నుండి భువికి దిగి వచ్చిన దైవ స్వరూపుడవు. అని కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు రామకృష్ణుడు. తర్వాత మీరు భగవంతుని చూశారా అని నరేంద్రుడు ప్రశ్నించాడు. అవును చూసాను. అవసరమైతే నీకు చూపించగలను అన్నాడు రామకృష్ణుడు. నెల దాటాక ఒకరోజు రామకృష్ణుడు మంచంపై విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, పక్కన కూర్చోమన్నాడు. అలాగే ధ్యానం లోకి వెళ్లి, నరేంద్రుడి ఒడిలో తన కాలును ఉంచాడు. అంతే... నరేంద్రుడికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నన్ను ఏమి చేస్తున్నారు? నా తల్లిదండ్రుల వద్దకు వెళ్లాలి, అన్న నరేంద్రుని చూసి ఈ రోజుకి ఇది చాలు. అని కాలును తీశాడు. రోజులు గడిచేకొద్దీ వారి మధ్య ఆకర్షణ అధికమై, విడిచి ఉండలేని స్థితికి చేరుకున్నారు. నరేంద్రుడు రామకృష్ణుని ముఖ్య శిష్యుడైనాడు. ఆయన చెప్పిన అన్నింటితో ఏకీభవించే వాడు కాదు. ఎప్పటికప్పుడు నరేంద్రుని రామకృష్ణుడు దారికి తెచ్చేవాడు. నెమ్మదిగా ప్రాపంచిక సుఖాలపై వ్యామోహం తగ్గి, సన్యాసత్వం వైపు మొగ్గు చూపాడు. తండ్రి మరణించగా విద్యాసాగర్ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో చేరాడు. గురువుకు గొంతు క్యాన్సర్ సోకి ఆరోగ్యం క్షీణించింది. ఉద్యోగం మాని, గురువు శుశ్రూషలో నిమగ్నమయ్యాడు. మరణించ బోయే రోజున నరేంద్రుని పిలిచి, మృదువుగా తాకాడు. ఆధ్యాత్మిక శక్తులన్నీ శిష్యునికి ధారపోశాడు. రామకృష్ణుని మరణానంతరం, గంగా నది తీరాన రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు నరేంద్రుడు. మిగిలిన శిష్యులతో కలసి సన్యాసిగా మారి, ఆ మఠానికి నాయకుడయ్యాడు, అలా "వివేకానందుడు" అయినాడు. భారతదేశం గృహంగా, ప్రజలను సోదరులుగా భావించాడు. ఆస్తి అంతా ఒక కాషాయ వస్త్రం, కమండలం, శిష్యులు కలిగి, దేశమంతా పర్యటించాడు. పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. నేలమీద నిద్రించాడు. ఆధ్యాత్మిక చర్చలతో కాలం గడిపాడు. మైసూరు మహారాజుతో పరిచయం కలిగి, పండితుల సభలో ఆయన చేసిన సంస్కృత ప్రసంగం మంత్ర ముగ్ధులను చేసింది. అమెరికా వెళ్లి వేదాంతాన్ని ప్రచారం చేసేందుకు, మహారాజు ఖర్చులు భరిస్తానన్నాడు. భాస్కర సేతుపతి పాలిత రామనాడును సందర్శించాడు. రామేశ్వరానికి వెళ్లి చివరకు కన్యాకుమారి చేరాడు. పాశ్చాత్య దేశాలకు వెళ్ళి, అక్కడ భారతదేశపు ఆధ్యాత్మిక విలువలను వారికి వివరించడం ప్రథమ కర్తవ్యంగా భావించాడు. దేశం నలుమూలల నుండి విరాళాలు సేకరించి, ప్రయాణానికి అవసరమైనవి తీసుకొని, 1893 మే 31 న బొంబాయి తీరం నుండి నౌకాయానం చేసి జూలైలో చికాగో చేరుకున్నాడు. ఒక మహిళ పరిచయం కాగా ఆమె ఇంట బస చేశాడు. హిందూ ధర్మం భారతీయ సంస్కృతిపై చిన్న సభలలో ప్రసంగాలు చేశాడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయ గ్రీకు విభాగంలో ఆచార్యుడు జాన్ హెన్రీ రైట్ పరిచయ మయ్యాడు. 1893 సెప్టెంబర్ 11న, చికాగో సదస్సు ప్రారంభమైంది. అక్కడ చేరిన ప్రతినిధులలో ఆయన ఆయన చిన్నవాడు. ఉపన్యాసానికి ముందు సరస్వతి దేవిని, గురువును ప్రార్థించాడు. "అమెరికా దేశపు సోదరులారా" అని మధుర కంఠస్వరంతో అనగానే, సభ మూడు నిమిషాలు చప్పట్లతో మార్మోగింది. సమావేశానికి హాజరైన ప్రతివారు. ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు. వార్తా పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. అక్కడి ప్రజలకు ఆరాధ్యుడయ్యాడు. అనతి కాలంలోనే స్వామీజీకి ప్రపంచ ప్రఖ్యాతి లభించింది. వాదనలో ఆయన్ను గెలిచే వారే లేకుండెను. హిందూ మతాన్ని వివరించ గల నైపుణ్యం, వికాస వంతమైన వ్యక్తిత్వంతో, హృదయాలను గెలవ గలిగాడు. స్వామీజీ వల్ల అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలో, భారత దేశ గౌరవం పెరిగింది. ఎందరో శిష్యులైనా, ముఖ్యంగా మార్గరెట్ నోబుల్ అనే "సిస్టర్ నివేదిత" భారత దేశానికి వచ్చి ఉండి పోయింది. 1897 జనవరి 15 న మద్రాసు చేరాక రథం మీద ఊరేగించారు. "వ్యక్తి మోక్షమునకు, ప్రపంచ హితమునకు" అనే నినాదంతో, 1897 లో రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. భవనాలను నిర్మించాడు. ఆయన నేర్పిన ముఖ్యాంశాలలో "జీవుడే దేవుడు" అనేది మంత్రంగా మారింది. పేదవారికి సేవను "దరిద్ర నారాయణ సేవ" గా ప్రతిపాదించాడు. రాను రాను అంతర్ముఖుడైనాడు. 1902 జూలై 4న యథా విధిగా శిష్యులకు బోధనలు చేశాడు. ఉల్లాసంగా గడిపి, రాత్రి తొమ్మిది గంటల సమయాన చిన్నగా అరిచి, లేచి కూర్చొని, దీర్ఘంగా శ్వాస పీల్చి, నెమ్మదిగా శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. "అందరూ అనుకుంటే నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది". అనే వేదాంత తత్వానికి చెందిన మహ మనీషి వివేకానందుడు. సిద్ధాంతాలు, పిడి వివాదాలు, సంప్రదాయాలు, దేవాలయాలు, మొదలైన వాటి గురించి ఆలోచించకు. మనిషి హృదయాలలో దేదీప్య మానమైన ఆత్మతో పోలిస్తే ఎందుకూ అవి కొరగావు. ఆ వస్తువే "ఆధ్యాత్మిక శక్తి". దాన్ని మొదట సముపార్జించాలి. ప్రతి మతంలో సిద్ధాంతాల్లో ఎంతో కొంత మంచి ఉంటుంది. వాస్తవానికి అన్ని మతాలు ఒకే సనాతన ధర్మం యొక్క అంశాలు. మందలో ఉండకు. వందలో ఉండేందుకు ప్రయత్నించు ప్రయత్నం చేసి ఓడిపో, కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఉండిపోకు. మీ సహచరులకు నాయకత్వం వహించే తలంపు వద్దు. వారికి మీ సేవలు అందించాలి. ఇలా ఎన్నెన్నో హితవచనాలు బోధించాడు. భారత ప్రభుత్వం వివేకానందుని జన్మదినాన్ని, "జాతీయ యువజన దినోత్సవం"గా 1994 లో ప్రకటించింది. అటువంటి మనీషి యుగానికి ఒకరే పుడతారు. ఆయనను సజీవంగా చూస్తూ, బోధనలు వినడం, మనం చేసుకున్న పుణ్యం... అంటూ ఒక ఆంగ్ల పత్రిక వ్యాఖ్యానం స్వామీజీ వైశిష్ట్యాన్ని గుర్తు చేస్తుంది.

# కార్చిచ్చు మానవ తప్పిదమా?

నూతన సంవత్సర వేడుకలతో పాటు క్రిస్మస్ పర్వదినాలను ఘనంగా జరుపుకొని సేదదీరుతున్న వేళ జనవరి 07, 2025 రోజున ప్రారంభమైన 'అణుబాంబు విస్పోటనం' లాంటి కార్చిచ్చు లేదా వైల్డ్‌ఫైర్ ఇప్పటికే ఐదు ప్రాంతాలను ఆక్రమించడం, 1.8 లక్షలకు పైగా ప్రజలను సురక్షిత స్థానాలకు లేదా శిబిరాలకు తరలించడం, మరో 2 లక్షల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి హెచ్చరికలు జారీ చేయడం, ఇప్పటికే కనీసం ఆరుగురు అగ్నికి ఆహుతి కావడం, లెక్కకు మించి గాయాలపాలు కావడం, వేల ఇండ్లు కాలి బూడిద కావడం, అనేక లక్షల ఇండ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం, అత్యంత సంపన్నుల అద్దాల మేడలు సహితం మంటల్లో కుప్పకూలడం, వేగంగా విస్తరిస్తున్న కార్చిచ్చు నేటికీ అదుపులోకి రాకపోవడంతో అమెరికాతో పాటు ప్రపంచ మానవాళి తమ సంతాపాలను, సహానుభూతులను ప్రకటించడం జరుగుతోంది. తొలుత 'పాలిసేడ్స్' ప్రాంతంలో మొదలైన చిన్న కార్చిచ్చు నేడు దాదాపు 18,000 ఎకరాలకు విస్తరించడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా నమోదు అవుతున్నాయి. 'ఈటన్' ప్రాంత కార్చిచ్చులు 13,000 ఎకరాలకు, 'హర్స్ట్' ప్రాంత కార్చిచ్చులు 700 ఎకరాలకు, 'లిడియా' ప్రాంత కార్చిచ్చులు దాదాపు 500 ఎకరాలకు, 'కెన్నెత్' ప్రాంత కార్చిచ్చులు 800 ఎకరాలకు, 'సన్‌సెట్' ప్రాంత కార్చిచ్చులు 60 ఎకరాలకు విస్తరించి అదుపు చేయలేని నిస్సహాయ స్థితికి అమెరికన్ యంత్రాంగం చేరింది. కాలిఫోర్నియా ప్రాంతంలో కార్చిచ్చులు తరుచుగా ఎగిసిపడడానికి సహజ ప్రకృతి ప్రకోపంతో పాటు మానవ తప్పిదాలు కూడా కారణం అవుతున్నాయి. ప్రతికూల వాతావరణ మార్పులతో సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, భూ ఉపరితలం పూర్తిగా ఎండలకు ఎండుతూ పొడిబారడం జరుగుతోంది. 2023-24 ఏడాది అత్యంత వేడి కలిగిన వడ గాలులను చవిచూసాయి. అటు తీవ్రమైన వడగాలులు, ఇటు పచ్చదనం ఎండిపోయి పొడిబారడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లు కార్చిచ్చు వేగంగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నాలకు సహితం లొంగడం లేదు. ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా కార్చిచ్చులు గంటకు 70 మైళ్ల వేగంతో వీస్తున్న వడగాలులు తోడవడం, అడవుల్లో ఎండిపోయిన వృక్ష సంపదకు మంటలు సులభంగా వ్యాప్తి చెందడానికి ఊతం ఇవ్వడం, కరువుకాటకాలు వెంటాడడం, గాలిలో తేమ తగ్గడం, వర్షపాతం సగటు కన్న చాలా తక్కువగా నమోదు కావడం, ఉష్ణోగ్రతలు అతిగా రికార్డు కావడం, అటవీ ప్రాంతాలకు దగ్గరగా అర్బన్ కాలనీలు నిర్మింపబడడం (వైల్డ్‌ల్యాండ్-అర్బన్ ఇంచర్‌ఫేజ్) లాంటి పలు కారణాలతో నేటి కార్చిచ్చు ప్రభావంతో తీవ్రమైన నష్టం వాటిల్లుతున్నది. సాధారణంగా మే-అక్టోబర్ వరకు కనిపించే కార్చిచ్చులు నేడు ఏడాది కాలం పాటు కనిపించడం రాబోయే ప్రమాదానికి హెచ్చరికగా తీసుకోవాలి. ఈ సీజన్లో తక్కువగా కనిపించే కార్చిచ్చులు నేడు తీవ్ర స్థాయిలో ఎగిసి పడడంతో అమెరికన్లు సహితం ఆశ్చర్యపోతూ, నిస్సహాయంగా చూస్తూ నిలబడవలసి వస్తున్నది. 2020-21లో నమోదైన కార్చిచ్చుల ఫలితంగా ఇప్పటికే దాదాపు 7 లక్షల హెక్టార్ల ప్రాంతం కాలి బూడిదగా మారిపోతూ బిలియన్ డాలర్ల ఆస్తి నష్టమై కాకుండా ప్రాణ నష్టం కూడా చవి చూడడం గమనించారు. కార్చిచ్చుల ప్రభావం కాలిఫోర్నియా ప్రాంతానికే పరిమితం కాలేదని గమనించాలి. ప్రపంచవ్యాప్తంగా పలు సందర్భాల్లో అనేక దట్టమైన కారడవులు అడవులు అగ్నికి ఆహుతి కావడం చూసాం. వాతావరణ మార్పులతో ప్రతి ఏడాది సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, వర్షపాతం తగ్గడం, వడగాలులు వీచడం, గాలిలో తేమలు తగ్గడం లాంటి పలు కారణాలతో రోజు రోజుకు ప్రపంచ దేశాలు కార్చిచ్చుల రూపంలో అగ్ని ప్రమాదాలకు దగ్గర అవుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాతావరణ ఉష్ణోగ్రతలు పెరిగిన కొద్దీ కార్చిచ్చుల ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. నేడు అభివృద్ధి పేరుతో అభివృద్ధి చెందిన దేశాలు విడుదల చేస్తున్న విచక్షణారహిత కార్బన్ ఉద్గారాలతో వాతావరణ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, కార్చిచ్చులను ఉసిగొల్పడం కొనసాగుతున్నది. ఎవరు తీసిన గోతిలో వారే పడుతున్నారు.

## నేషనల్ హైవేలు, రాష్ట్ర రహదారులపై ఫోకస్

కడప, జనవరి 11,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేషనల్ హైవేలు, రాష్ట్ర రహదారులపై ఫోకస్ పెట్టింది. కొత్త ప్రాజెక్టులతో పాటుగా గతంలో అనుమతులు వచ్చిన వాటి పనుల్ని వేగవంతం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి కీలకమైన బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు స్పీడ్ అందుకున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనుల్ని 2026నాటికి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.. ఈ మేరకు పనులు కొనసాగుతున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో అమరావతి నుంచి బెంగళూరుకు కనెక్టివిటీ ఉంటుంది. విజయవాడ నుంచి వెళ్లాలంటే గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, కడప మీదుగా వెళ్లొచ్చు. అలాగే గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదుగా బెంగళూరకు వెళ్లొచ్చు.కేంద్రం నేషనల్ హైవేల నిర్మాణంలో భాగంగా బెంగళూరు-కడప-విజయవాడకు కొత్తగా హైవే కనెక్టివిటీ ఉండాలని భావించింది. అందుకే రెండేళ్ల క్రితం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు రూ.1930 కోట్ల అంచనాతో గ్రీన్ సిగ్నల్ రావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ హైవేకు సంబంధించి.. విజయవాడ నుంచి బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం ముప్పవరం వరకు 113 కి.మీ జాతీయ రహదారులతో ఈ గ్రీన్ ఫీల్డ్ వేను కనెక్ట్ చేయనున్నారు. అలాగే బెంగళూరు నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా కొడికొండ వరకు ఉన్న 73 కి.మీ కూడా జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తారు. మొత్తం 529 కిలో మీటర్ల దూరం మార్గంలో ఇప్పటికే రెండు వైపులా ఉన్న రెండు నేషనల్ హైవేల 186 కి.మీ. మినహా మరో 343 కిలోమీటర్లు పనులు చేపట్టాల్సి ఉంది.బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను 14 భాగాలుగా చేశారు. బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం ముప్పవరం నుంచి తాళ్లూరు మండలం తూర్పు గంగవరం వరకు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 10 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 18.5 కిలోమీటర్లు ఈ పనులు జరుగుతున్నాయి. ఈ హైవే పొడవునా ఎక్కడా కట్టడాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే ఈ గ్రీన్‌ఫీల్డ్ వేకు సంబంధించి భూములు కోల్పోయిన వారికి పరిహారం కూడా చెల్లించారు. ఈ వే వెంట ఉన్న ప్రతి ఊరికి బ్రిడ్జి ఏర్పాటు చేస్తు?నారు. అలాగే గుండ్లకమ్మ నదిపై బాపట్ల జిల్లా అద్దంకి మండలం వేలమూరిపాడు-మణికేశ్వరం మధ్యలో 360 మీటర్ల పొడవున భారీ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

# సొంత క్యాడర్ నుంచి చికాకులు

విజయవాడ,జనవరి 11, తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఆర్నెల్లుగా ప్రధాన ప్రతిపక్షం వైసీపీ నుంచి పెద్దగా చికాకులు ఎదురు కాలేదు. ఒకటి రెండు సందర్భాలు వచ్చినా వాటిని సులువుగానే టీడీపీ అధినేత అధిగమించగలిగారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ అధ్యక్షుడు ప్రభుత్వం మీద దూకుడుగా వెళ్లాలని ప్రయత్నించినా ఆ పార్టీ క్యాడర్ పెద్దగా స్పందించలేదు. అధికార పార్టీతో ఎందుకొచ్చిన గొడవ అనుకుని నేతలు కూడా సైలెంట్ అయిపోయారు.

సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చాలా మంది అజ్ఞాతంలోకి జారుకున్నారు.వైసీపీ నుంచి సోషల్ మీడియాలో తప్ప బయట పెద్దగా ప్రతిఘటన లేకపోవడం, ఆ తర్వాత సోషల్ మీడియా దుష్ప్రచారాలను కట్టడి చేయడానికి పెద్ద ఎత్తున పోలీస్ కేసులు నమోదు కావడంతో ప్రత్యర్థుల నుంచి ఆ దూకుడు కూడా తగ్గిపోయింది. ఈ క్రమంలో హుషారుగా ఉండాల్సిన టీడీపీ అధినేతకు సొంత క్యాడర్ నుంచి చికాకులు ఎక్కువయ్యాయి. సోషల్ మీడియాలో ప్రత్యర్థుల కంటే సొంత పార్టీ నాయకులు, పార్టీ అభిమానులు, ప్రతిపక్షంలో ఉండగా టీడీపీని భుజాన మోసిన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికలపై చెలరేగిపోతున్నారు.టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల్లో చాలామంది తాము అధికారంలో ఉన్నామనే సంగతి మరిచి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, సంకీర్ణ ధర్మంలో భాగంగా తీసుకున్న విధానపరమైన అంశాలను కూడా తప్పు పడుతున్నారు. ఐదేళ్ల పాటు టీడీపీ నినాదాల్ని, వాదనల్ని సమర్థవంతంగా వినిపించిన క్యాడర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాక ముందే అసంతృప్తి గళాలను వినిపిస్తున్నారు. కొద్ది మంది వైసీపీని నిందించే క్రమంలో టీడీపీనే తప్పు పడుతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్న సంగతి మరిచి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.కొద్ది నెలలుగా టీడీపీ క్యాడర్‌లో ఈ తరహా అసంతృప్తి పెరిగిపోతోంది. పార్టీ అధి నాయకత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందనే భావన కార్యకర్తలు, దిగువ శ్రేణి నాయకుల్లో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన వారు బదులు తీర్చుకోవాలని తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో అలాంటి చర్యలు వద్దని ముఖ్యమంత్రి పదేపదే వారించడం వారికి రుచించడం లేదు. వైసీపీ పంథాలో సాగితే తే?డా ఏముంటుందని, రాష్ట్ర ప్రయోజనాలు అభివృద్ధిపై దృష్టి సారించాలని నచ్చచెప్పే ప్రయత్నాలు వారికి రుచించడం లేదు.ఇక టీడీపీ అనుకూల మీడియాలో సైతం ప్రభుత్వాన్ని ఇరుకున పడేసే కథనాలతో చంద్రబాబు సతమతం అవుతున్నారు. తమ వారనుకునే వారి నుంచి ఎదురవుతున్న విమర్శలు, కథనాలతో చంద్రబాబు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం ఏపీలో బీజేపీ–జనసేనలతో కలిసి టీడీపీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. విధానపరమైన నిర్ణయాలను మూడు పార్టీలు కలిసి తీసుకోవాల్సి వస్తోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, డిప్యూటీ సీఎం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఏపీ ప్రభుత్వంలో ముఖ్య నాయకుడిగా నారా లోకేష్ వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో చాలా వరకు ఆయన భాగస్వామ్యం ఉంటోంది. చంద్రబాబు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకునే క్రమంలో లోకేష్ క్రియాశీలకంగా ఉన్నారు. ప్రభుత్వ శాఖలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ క్రమంలోనే చంద్రబాబు తర్వాత టీడీపీ పగ్గాలు ఏదొ? ఒక సమయంలో లోకేష్ అందిపుచ్చుకోవాల్సి ఉంటుందనే అంచనా అందరిలో ఉంది. అదే సమయంలో టీడీపీ తీరుపై ఆ పార్టీ క్యాడర్ చేస్తోన్నవిమర్శలు, లోపాలను ఎత్తి చూపే క్రమంలో ప్రభుత్వాన్ని నిందిస్తున్న తీరు టీడీపీకి మేలు కంటే చేటు ఎక్కువగా చేస్తున్నాయి.ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేందుకు సోషల్ మీడియాను వాడుకోవడం మొదలైన తర్వాత అన్ని రాజకీయ పార్టీలు గత పదేళ్లుగా సోషల్ మీడియాను విస్తృతంగా వాడుతున్నాయి. సోషల్ మీడియా వినియోగంలో సీబీఎన్ ఆర్మీ పేరిట ఐటీ ప్రొఫెషనల్స్ 2014 ముందు నుంచి విస్తృతంగా పనిచేస్తున్నారు. స్వచ్ఛందంగా చాలామంది చంద్రబాబు కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలపై కాంపెయిన్ చేస్తున్నారు.2019లో టీడీపీ ఓటమి పాలై తిరిగి పుంజుకోడానికి కూడా సోషల్ మీడియా బలంగా పనిచేసింది. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష పాత్ర నుంచి ప్రభుత్వంలో ఉన్నామనే స్పృహలోకి రావడంలో టీడీపీ అనుకూల సోషల్ మీడియా కన్ఫ్యూజ్ అయినట్టు కనిపిస్తోంది. ఇప్పటికీ విధానపరమైన అంశాల్లో లోపాలకు ఆర్నెల్ల క్రితం అధికారం పోగొట్టుకున్న వైసీపీని నిందించే పనిలోనే ఉన్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తప్పు పట్టడంలో వారే ముందు ఉంటున్నారు.మద్యం విక్రయాలు, ఇసుక, బ్యూరోక్రసీ, ప్రభుత్వ సేవలు, విద్యా వైద్యం వంటి అంశాల్లో సొంత పార్టీ వారి నుంచి పలు సందర్భాల్లో విమర్శలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం తమకు నచ్చని ఏ పని చేసినా విమర్శించడానికి వెనుకాడటం లేదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధికారుల నియామకాలు, పోస్టింగుల నుంచి ప్రమోషన్లు, బదిలీల వరకు ప్రతి అంశాన్ని తప్పు పట్టడం మొదలైంది. ప్రతి ఒక్కరు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో చంద్రబాబు నిర్ణయాలను నేరుగా విమర్శించడం సాధారణమై పోయింది. ఈ క్రమంలో వారికి తెలియకుండానే చంద్రబాబును కార్నర్ చేస్తున్నామనే సంగతి మరిచి పోతున్నారు.ఐఏఎస్ అధికారుల పోస్టింగులు, గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన వారిని తిరిగి ప్రభుత్వంలో చేర్చుకోవడం, ఆరోపణలు ఉన్న వారికి పోస్టింగులు ఇవ్వడం, తమను వేధించిన పోలీసులకు కీలక స్థానాల్లో బాధ్యతలు అప్పగించడం వంటి నిర్ణయాలను సోషల్ మీడియా వేదికలపై తూర్పారబడుతున్నారు.గత ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగుళూరులోనే గడుపుతున్నారు. తాడేపల్లి నివాసంలో అడపాదడపా సమీక్షలు చేస్తున్నారు. జనవరి చివరి నుంచి జిల్లా పర్యటనలు చేపట్టనున్నారు. టీడీపీలో జరుగుతున్న పరిణామాలు ఖచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి సంతోషం కలిగిస్తుందవచ్చు. ఆర్నెల్లలో జగన్ పెద్దగా బయటకు రాకపోయిన ప్రభుత్వం పై ఎంతో కొంత వ్యతిరేకత రావడానికి టీడీపీ వర్గీయులే ఎంతో కొంత కారకులు కావడం జగన్‌కు కలిసి వస్తుంది. ఈ క్లారిటీ టీడీపీ వర్గీయులకు రాకపోతే మున్ముందు సమస్య తీవ్రం కావొచ్చు.

# విద్యారంగంలో కీలక మార్పులు

గుంటూరు, జనవరి 11,పాఠశాల విద్యా సంస్కరణలు అమలు చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 117ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. అయితే జీవో 117ను రద్దు చేసినప్పటికీ ఇంచుమించు అదే విధానాలతో మళ్లీ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులను విడుదల చేశారు. గత జీవో నెంబర్ 117లో కంటే కొన్ని మార్పులు చేశారు.గతంలో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు ఐదు రకాల పాఠశాలల విధానాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్రవేశపెట్టిన శాటిలైట్ ఫౌండేషనల్ స్కూళ్ల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. ఫౌండేషనల్ స్కూళ్లను అలానే కొనసాగించింది. అయితే ఫౌండేషనల్ స్కూల్ ప్లస్ పేరును బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మర్చింది.ప్రీ హైస్కూల్ విధానాన్ని రద్దు చేసి మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ముందుకు తీసుకొచ్చింది. 3, 4, 5 తరగతుల విలీనాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే హై స్కూల్ ప్లస్ విధానాన్ని ఏం చేస్తారో అనేది స్పష్టం ఇవ్వలేదు. ఫౌండేషనల్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్న విద్యా వేత్తల డిమాండ్‌ను పట్టించుకోలేదు. గత ప్రభుత్వం వలే ఇప్పుడు కూడా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని నిర్ణయించింది.

పెరగనున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు?

ఫౌండేషనల్ స్కూల్‌లో 1:30 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించింది. విద్యార్థులు సంఖ్య 30 దాటితే మరో ఎస్‌జీటీని కేటాయిస్తామని పేర్కొంది. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో 1:20 నిష్పత్తి ప్రకారం అమలుచేస్తామని 60 దాటితేనే మరోపోస్టు ఉంటుందని తెలిపింది. దీనివల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 60 కంటే తక్కు ఉంటే ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురిని కేటాయిస్తారు.ఎన్‌రోల్‌మెంట్ 120 కంటే ఎక్కువ ఉంటే ప్రధానోపాధ్యాయ పోస్టు ఉంటుంది. 150 దాటితే ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్‌జీటీ ఉంటారు. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య 45–60 మధ్య ఉన్నా మోడల్ ప్రైమరీ స్కూల్ ఉంటుంది. అయితే సామాజిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల ఆధారంగా పాఠశాల యాజమాన్య కమిటీ మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటును ప్రతిపాదించే అవకాశం ఉంటుంది. అయితే దీంతో మళ్లీ పాత పద్ధతికే పాఠశాల విద్య వస్తుంది. ప్రైవేట్ పాఠశాలల్లో చేరికలు పెరుగుటంతో పాటు?. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్‌అవుట్ రేటు పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విద్యార్థులు సంఖ్య 30 కంటే తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్, బేసిక్ ప్రైమరీగా మార్చుతారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులను దగ్గరలో ఉన్న పాఠశాలలకు తరలిస్తారు. 6, 7, 8 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువగా ఉంటే, దానిని హైస్కూల్‌గా మార్చుతారు.హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 76 కంటే ఎక్కువగా ఉంటేనే ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ పోస్టులు ఉంటాయి. విద్యార్థుల సంఖ్య 400 దాటితే ఆయా స్కూల్స్‌కు రెండో పీఈటీని కేటాయిస్తారు. విద్యార్థుల సంఖ్య 751 ఉంటే మూడో పీఈటీ పోస్టు ఉంటుంది. పోస్టులు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా మ్యూజిక్, ఆర్ట్, డ్రాయింగ్, క్రాఫ్ట్ పోస్టులు ఉంటాయి.గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులలో మోడల్ ప్రైమరీ స్కూల్ గుర్తించేందుకు కమిటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ఉండే కమిటీలో కన్వీనర్‌గా ఎంఈవో–1, కో కన్వీనర్‌గా ఎంఈవో–2 ఉంటారు. సభ్యులుగా ఐసీడీఎస్ సీడీపీవో, ఎంఆర్‌వోతో పాటు ఎంపీడీవోగానీ మున్సిపల్ కమిషనర్‌గానీ సభ్యులుగా ఉంటారు. క్లస్టర్ స్థాయి కమిటీల్లో కన్వీనర్‌గా క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, సభ్యులుగా ఎంఈవో 1, 2, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఉంటారు. ఈ రెండు కమిటీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలతో సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలల ఏర్పాటు గురించి చర్చిస్తారు.

పాత విధానం ప్రకారం...

1. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ (పీపీ 1, పీపీ 2)
2. ఫౌండేషన్ స్కూల్ (పీపీ 1, పీపీ 2, 1, 2 తరగతులు)
3. ఫౌండేషన్ ప్లస్ స్కూల్ (పీపీ 1, పీపీ 2, 1 నుంచి 5 తరగతులు)
4. ప్రి హైస్కూల్ (3 నుంచి 8 తరగతులు)
5. హై స్కూల్ (3 నుంచి 12 తరగతులు)

కొత్త విధానం ప్రకారం...

1. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ (పీపీ 1, పీపీ 2)
2. ఫౌండేషన్ స్కూల్ (పీపీ 1, పీపీ 2, 1, 2 తరగతులు)
3. బేసిక్ ప్రైమరీ స్కూల్ (పీపీ 1, పీపీ 2, 1 నుంచి 5 తరగతులు)
4. మోడల్ ప్రైమరీ స్కూల్ (పీపీ 1, పీపీ 2, 1 నుంచి 5 తరగతులు)
5. హై స్కూల్ (6 నుంచి 10 తరగతులు)

మోడల్ ప్రైమరీ స్కూల్స్ నియమాలు:

1. 60+ విద్యార్థులున్న చోట ఏర్పాటు చేస్తారు.
2. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారు.
3. 120+ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు
4. 150+ విద్యార్థులకు అదనపు ఎస్‌జీటీ

అప్పర్ ప్రైమరీ స్కూళ్ల మార్పులు:

1. ఎ30 విద్యార్థులు – ప్రాథమిక పాఠశాలగా మార్పు
2. 60+ విద్యార్థులు – హైస్కూల్ గా అప్‌గ్రేడ్ చేస్తారు.
3. 31–59 విద్యార్థులు – కేస్ బై కేస్ పరిశీలన

హైస్కూల్స్ నియమాలు:

1. 75+ విద్యార్థులకు ఊఓ మరియు ఖఖ పోస్టులు
2. 54+ విద్యార్థులకు రెండవ సెక్షన్
3. ప్రతి 40 మందికి కొత్త సెక్షన్ ఉంటుంది.

అమలు ప్రక్రియ:

1. మండల ఒ క్లస్టర్ కమిటీల ఏర్పాటు
2. ఎస్ఎంసీ సంప్రదింపులు
3. తల్లిదండ్రుల అంగీకారం

ప్రత్యేక నిబంధనలు:

1. అవరోధాలున్న ప్రాంతాల్లో బేసిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు.
2. 3 కిలో మీటర్ల లోపల హైస్కూల్ లేనిచోట ప్రత్యేక ఏర్పాట్లు
3. అవసరమైన చోట రవాణా భత్యం అందజేస్తారు.

ఉపాధ్యాయుల పునర్వ్యవస్థీకరణ:

1. యూడీఐఎస్ఈ డేటా ప్రకారం పోస్టుల కేటాయింపు ఉంటుంది.
2. అన్ని రకాల పాఠశాలల మధ్య సర్దుబాటు చేస్తారు.

# భవన నిర్మాణ అనుమతులు మరింత సరళం

విజయవాడ,జనవరి 11, ఏపీలో భవన నిర్మాణాలు,లే ఔట్ల అనుమతుల జారీలో నిబంధన లు సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ –2017, ఏపీ ల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ – 2017 లో సవరణలు చేస్తూ వేరు వేరుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని, సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనలు మార్పులు జీవోలు జారీ చేసినట్టు చెప్పారు.లే అవుట్లలో వేసే రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశారు. 500 చ.మీ.పైబడిన స్థలాల్లో చేపట్టే నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ ల ప్రమేయాన్ని తొలగిస్తున్నట్టు ప్రకటించారు.రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల మేరకు సర్వీస్ రోడ్డు విడిచిపెట్టాలనే నిబంధన తొలగిస్తున్నట్టు ప్రకటించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సరళతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా చేసేందుకు సంస్కరణలు చేపట్టి.. ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో లే అవుట్లలో రోడ్లకు గతంలో 12 మీటర్లు ఉండగా.. ఇప్పుడు దానిని 9 మీటర్లకు తగ్గించారు. అలాగే 500 చదరపు మీటర్లు పైన స్థలాల్లో నిర్మాణాన్ని సెల్లారుకు అనుమతించారు. నేషనల్ హైవే, స్టేట్ హైవేలను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధనను కూడా తొలగించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేసింది ప్రభుత్వం. టీడీఆర్ బాండ్ల జారీ చేసే కమిటీ నుంచి రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లను తొలగించారు.ప్రజలకు, బిల్డర్లు, డెవలపర్లకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ వేర్వేరు జీవోలు జారీ చేసినట్లు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నిబంధనల్ని సులభతరం చేశామని.. అందరితో చర్చించి ఈ నిబంధనలు జారీ చేశామన్నారు. సంక్రాంతి కానుకగా ఈ జీవోలను తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు, బిల్డర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు మంత్రి నారాయణ. కూటమి ప్రభుత్వం ఆ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అపార్ట్‌మెంట్లు, లే అవుట్‌లలో కొనుగోలుకు సంబంధించి వినియోగదారులు మోసపోకుండా రెరా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు మంత్రి నారాయణరియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేసినట్టు మంత్రి నారాయణ వివరించారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని దానిని తిరిగి గాడిన పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. భవన నిర్మాణాలు, లే అవుట్లు అనుమతులను సులభతరం చేస్తూ జీవో లు జారీ చేసినట్టు వివరించారు.రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నట్టు తెలిపారు. మార్చి నాటికి సింగల్ విండో విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో సమావేశం అవుతానని మంత్రి నారాయణ చెప్పారు. నిర్మాణ రంగానికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# ఆత్రేయపురంలో బోట్ ఫైట్

కాకినాడ, జనవరి 11, పొగ మంచుల్లో.. భోగి మంటల్లో.. చుట్టాల పిలుపుల్లో.. మనసారా మాటల్ని కలిపేస్తూ.. అందరినీ ఒక్కటి చేసేదే సంక్రాంతి. ప్రేమానురాగాలతో, ఆప్యాయతలతో గడిపే సంతోష సమయమిది. పండక్కి నవ్వులతో స్వాగతం పలికే ఊళ్లు.. హృదయాల్ని కదిలించే పలకరింపులు, తెలుగు సంప్రదాయాన్ని, తెలుగు వాళ్లందరినీ ఏకం చేసే గొప్ప సంస్కృతి సంక్రాంతి. అందుకోసమే.. ఎక్కడున్నా పండక్కి మనసు ఊరు మీదకు లాగుతుంది. ల్యాగ్ లేకుండా బ్యాగు సర్దుకొని పల్లెకు వెళ్లిపోయేలా చేస్తుంది.ఈ సంక్రాంతి పండుగలో.. కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడపడమే కాదు.. కిక్కిచ్చే ఎలిమెంట్స్ ఇంకా చాలానే ఉన్నాయ్. కోళ్ల పందాల్లో.. పందెం పుంజులు చూపే పౌరుషాలు.. తిరునాళ్లు, సంబరాలు.. ఇలా చాలానే ఉంటాయి. ఇవన్నీ.. ఏడాది పాటు మనం పడే కష్టాన్ని మర్చిపోయేలా చేస్తాయి. కొన్ని నెలలకు కావాల్సినన్ని మధుర స్మృతుల్ని మిగులుస్తాయి. 3 రోజులు.. ఆనందోత్సాహాలతో చేసుకునే సంక్రాంతి పండుగ.. ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది. మన తెలుగింటి బంధాల్ని బలపరుస్తుంది. సంక్రాంతి.. మన సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దం. ఆత్మీయతలూ, అనురాగాలకు నిలువెత్తు నిదర్శనం. మొత్తంగా.. సంక్రాంతి పండుగంటే పల్లెలదే.. నూతన సంవత్సరంలో పెద్ద పండుగని.. ఆస్వాదించాలంటే.. అమ్మలాంటి పల్లెకు పోవాల్సిందేఆంధ్రాలో ఇప్పటికే సంక్రాంతి సందడి మొదలైంది. ఆత్రేయపురం అంటే పూతరేకులే గుర్తొస్తాయి. బట్ ఫర్ ఏ ఛేంజ్.. ఈ సంక్రాంతి నుంచి.. కేరళ మాదిరి పడవ పోటీలు కూడా గుర్తొస్తాయి. కోనసీమలో లక్షల ఎకరాలకు నీరందించే ప్రధాన కాలువలో నిర్వహించబోయే పడవ పందాలు.. ఈసారి స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలవబోతున్నాయి. కోనసీమ తిరుమలగా పిలవబడే.. వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో.. ఈ పడవ పోటీలు జరగబోతున్నాయి. ఇకపై.. ప్రతి సంక్రాంతికి కోడి పందాలతో పాటు పడవ పందాలు కూడా నిర్వహిస్తామంటున్నారు నిర్వాహకులు.ఆత్రేయపురంలో జరగబోయే పడవ పోటీలకు.. రాష్ట్రం నలుమూలల నుంచి స్విమ్మర్స్, బోర్డర్స్ వస్తున్నారు. మొత్తం.. ఐదు విభాగాల్లో ఈ పడవ పోటీలు నిర్వహించనున్నారు. సుమారుగా.. ఫోర్ మెన్ డ్రాగన్ బోటింగ్ పోటీల్లో 150 మంది వరకు పాల్గొననున్నారు. అలాగే.. డ్రాగన్ బోట్, కెనోస్ లాలం, కెనోస్ స్ప్రింట్, కెనో పోలో, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా కెనో పారా బోట్స్ విభాగాల్లో.. పడవ పోటీలు జరగనున్నాయి. కృష్ణా జిల్లాలోని మారుమూల పల్లెటూరులోని.. మత్స్యకార కుటుంబం నుంచి వచ్చిన గాయత్రి.. భారత్ తరఫున కెనోస్ లాలం విభాగంలో పోటీ పడి.. ఏడు మెడల్స్ సాధించింది. ఇంతటి ప్రతిభ కలిగిన గాయత్రి.. ఈసారి ఆత్రేయపురం పడవ పోటీల్లో పాల్గొనబోతోంది. పందెం ఎక్కడైనా.. ప్రాక్టీస్ ఒకేలా ఉంటుందని గాయత్రి చెబుతోంది. ఆ అమ్మాయి చేస్తున్న విన్యాసాలు.. అందరినీ కట్టిపడేస్తున్నాయ్.ఇటీవల జరిగిన నేషనల్ ఫోర్ మెన్ డ్రాగన్ బోట్ పందాల్లో.. ఆంధ్రాకు కాంస్య పతకం సాధించిన గిరిబాబు, భాస్కర్ కూడా ఆత్రేయపురం పడవ పోటీల్లో పాల్గొననున్నారు. సాధారణ స్విమ్మర్లుగా ఉండే తమను.. బోట్స్‌మెన్‌గా మార్చిన కోచ్ శివారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నారు. కొండల మధ్య నుంచి వచ్చే వాటర్ ఫోర్స్ మధ్యలో చేసే కేనోసాలం బోటింగ్ ప్రాక్టీస్‌కి అనువైన ప్రదేశం.. ఆత్రేయపురం లొల్లలాకుల దగ్గర ఉందంటున్నారు. పోటీలు ముగిసిన తర్వాత.. 15 రోజుల పాటు క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు కోచ్ శివారెడ్డి తెలిపారు.

# ఐదు జిల్లాల్లో కరువు పరిస్థితులు

కర్నూలు, జనవరి 11 ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది నెలకొన్న ఖరీఫ్ కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర నుంచి సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని ఏపీ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్, ఆర్పీ సిసోడియా కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను రెవిన్యూ కార్యదర్శి సిసోడియా కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాల్లో గత ఏడాది కరువు పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో – 19మండలాలు, చిత్తూరులో – 16 మండలాలు, శ్రీ సత్య సాయిలో – 10 మండలాలు, అనంతపురంలో – 7 మండలాలు, కర్నూలులో – 2 మండలాలను ఇప్పటికే ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించారు. వాటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలుగా సిసోడియా పేర్కొన్నారు.కేంద్ర కరువు మాన్యువల్ ప్రకారం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని వివరించారు.కరువు ప్రభావంతో పత్తి, జొన్న, వేరుశెనగ, ఎర్ర శనగలు, మొక్కజొన్న మొదలైన 14 రకాల పంటలు దెబ్బతిని ఐదు జిల్లాల్లోని 1.06లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 1 లక్ష మంది రైతులకు రూ.16.67 కోట్ల వ్యయంతో సుమారు 1 లక్ష మంది రైతులకు 80% సబ్సిడీపై విత్తనాలు, రూ.55.47 కోట్ల వ్యయంతో పశుగ్రాసం, పశుగ్రాస విత్తనాల సరఫరా, 60% సబ్సిడీపై , 40% సబ్సిడీపై చాఫ్ కట్టర్లు, మందుల సరఫరా వంటి ఉపశమన చర్యలు చేపట్టినట్లు కేంద్ర బృందానికి సిసోడియా వివరించారు.వ్యవసాయ శాఖ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ. 90.62కోట్లు, రూరల్ వాటర్ సప్లై రూ. 0.78 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై రూ. 4.89 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.55.47 కోట్లు ఆర్థిక సహాయం అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు.అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని కరువు మండలాల్లో రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను గమనించామని తమ నివేదికలో కేంద్రానికి అన్ని విషయాలను సమగ్రంగా తెలుపుతామని అన్నారు.

# బీజేపీ ఎమ్మెల్యే ఇంట్లో కట్టల కట్టల డబ్బులు

భోపాల్, జనవరి 11, సినిమాల్లో చూపించినట్టుగానే గత కొంతకాలంగా మన దేశంలో కొంత మంది ప్రజాప్రతినిధుల ఇంట్లో భారీగా డబ్బు, నగదు, బాండ్లు లభ్యమవుతున్నాయి. ఆ మధ్య జార్ఖండ్ రాష్ట్రంలో హోం మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఇంట్లో ఆదాయపు పన్ను శాఖ( సోదాలు ( చేసింది.. ఆ సమయంలో అతని వద్ద భారీగా నగదు, బంగారం లభ్యమయింది.. దీంతో అధికారులకు దిమ్మతిరిగినంత పని అయింది.తాజాగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీ కి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే హరి వంశ్ సింగ్ రాథోడ్ ఇంట్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు జరిపారు. అలా సోదాలకు వెళ్లిన అధికారులకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. అక్కడి దృశ్యాలు చూసి వారికి ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. అక్కడ బంగారం చూస్తే కేజీఎఫ్ గోల్డ్ మైన్ కనిపించింది. నగదును చూస్తే.. ఆర్బీఐ మింట్ కాంపౌండ్ దర్శనమిచ్చింది. ఎందుకంటే అక్కడ ఆ స్థాయిలో నిలువలు ఉన్నాయి కాబట్టి.. బంగారం, కట్టల కొద్ది నగదు, వాహనాలు మాత్రమే కాదు అక్కడ ఉన్న మూడు మొసళ్ళను చూసి అధికారులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.గత ఆదివారం నుంచి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఇంట్లో సోదాలు జరుగుతున్నాయి. ఇతడితో పాటు మాజీ కౌన్సిలర్ రాజేష్ కేసర్వాణి ఇంట్లోనూ ఐటీ అధికారులు సోదాలు జరుపుతున్నారు. జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం సుమారు 155 కోట్ల రూపాయల పన్నును బిజెపి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఎగవేసినట్టు సమాచారం. మాజీ ఎమ్మెల్యే ఇంట్లో మూడు కోట్ల నదులతో పాటు బంగారం, వెండిని అధికారులు స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. బంగారం, వెండి విలువ కోట్లలో ఉంటుందట.మాజీ ఎమ్మెల్యే రాథోడ్, కేశర్వాణి ఇద్దరూ బీడీల వ్యాపారం చేసేవారు. ఇందులో కేశర్వాణి 140 కోట్ల వరకు పన్ను ఎగవేశారట. అయితే దానికి సంబంధించిన దస్త్రాలను సోదాల సమయంలో ఐటీ అధికారులు గుర్తించారు. మరోవైపు కేశర్వాణి స్థిరాస్తి వ్యాపారంలో కూడా ఉన్నాడు.. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఇంటికి వెళ్ళినప్పుడు ఐటి శాఖ అధికారులకు ఒక చిన్న కుంటలో మొసళ్ళుకనిపించడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.

# కోట్లలో కోళ్ల పందేలు

ఏలూరు, జనవరి 11, సంక్రాంతి వచ్చిందంటే చాలు.. ఆంధ్రాలో కోడి పందాల హడావుడి మొదలైపోతుంది. ముఖ్యంగా.. కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో ఈ హంగామా పీక్స్‌లో ఉంటుంది. బరిలోని పందెం కోళ్లది గెలుపు కోసం పోరాటమైతే.. పందెం రాయుళ్లది పరువు కోసం ఆరాటం. వేలాది మంది కవ్వింపులు, కేరింతల మధ్య భీకర యుద్ధమే జరుగుతుంది. ఇదంతా.. పరువు ప్రతిష్టలకు, పౌరుష రోషాలకు సంబంధించిన రణం. అంత హీట్ ఉంటుంది కాబట్టే.. ఈ పందెం పుంజుల పందాల ముందు.. గుర్రపు పందాలు కూడా బలాదూర్ అంటారు.అయితే.. కోడి పందాలంటే.. బరిలో రెండు పుంజులు పోట్లాడటం కాదు. వేల కోట్లు చేతులు మారడం కూడా! ఎస్.. కొబ్బరి తోటల్లో జరిగే ఈ కోళ్ల యుద్ధాన్ని చూసి.. జబ్బలు, తొడలు చరుచుకునే పందెంరాయుళ్లు ఎందరో ఉన్నారు. గల్లా పెట్టెల్లోని.. నోట్ల కట్టలు.. కట్టలు తెంచుకొని బరుల్లోకి వచ్చేస్తాయి. కత్తి కట్టిన కోడి.. అవతలి పుంజును పడగొట్టిన ప్రతిసారీ.. పందెంరాయుళ్ల చేతులు మీసాల్ని మెలేస్తాయి. ప్రతి పందెం రౌండ్‌కి.. నోట్లు వర్షంలా కురుస్తాయి.సంక్రాంతి కోడి పందాలంటే.. పుంజుల పౌరుషాలే కాదు.. చేతులు మారే కోట్ల కట్టలు కూడా! ఓ పందెం దెబ్బకు ఒకరు గరీబుగా మారిపోతే.. మరో పందెంలో.. గరీబే గద్దెనెక్కుతాడు. బరిలో దిగాక కోడి తేడా కొడితే.. జీవితాలే తారుమారైపోతాయి. దెబ్బకు అదృష్ట రేఖ.. దురదృష్టరేఖగా మారిపోతుంది. ఇవన్నీ తెలిసే.. పందెంరాయుళ్లు తొడగట్టి మరీ కొబ్బరితోటల్లోకి వెళ్తారు. తమ పుంజుని బరిలోకి దించుతారు. కొందరైతే.. ఆస్తుల్ని అమ్ముకొని మరీ పందాలు కాస్తారు. మెడలో పులి గోరు చైన్లు, వేళ్ల నిండా ఉంగరాలు, చేతులకు బ్రాస్‌లెట్లతో వచ్చినోళ్లు కూడా.. చివరికి ఒట్టి చేతులతో వెనుదిరుగుతారు. అయినాసరే.. సంక్రాంతి కోడి పందాలకు ఉండే క్రేజే వేరు. ఆంధ్రాలో అదో సంప్రదాయం. అంతకుమించిన సంబరం. అందుకే.. సంక్రాంతి సమయానికి.. అంతా ఊళ్లలో వాలిపోతారు. పందెం బరుల్లో దిగిపోతారు.ఆంధ్రాలో సంక్రాంతి కోడి పందాల్లో పాల్గొనడం.. అంత చిన్న విషయం ఏమీ కాదు. జేబులో వందో వెయ్యో పెట్టుకొని వెళితే.. అక్కడ పందెం కోడి కాదు కదా.. పందాలు చూస్తూ తినేందుకు చికెన్ పకోడీ కూడా రాదు. పందెంలో పుంజుని దించాలంటే.. ఏకంగా డబ్బు సంచులే తీసుకెళ్లాలి. బరుల్ని ఏర్పాటు చేసే చోటుని బట్టి.. పందెం బీటు మారుతుంటుంది. ఒక్కో కోడి పందెం 5 వేల నుంచి మొదలై.. 5 లక్షలు, 10 లక్షల దాకా ఉంటుంది. కేవలం.. ఆంధ్రా వాళ్లే కాదు.. హైదరాబాద్, చెన్నై నుంచి కూడా పందెం రాయుళ్లు డబ్బు సంచులతో వచ్చి మరీ బరుల్లో తొడగొడతారు. వాళ్లకు తగ్గట్లుగా.. అదృష్టం కలిసొచ్చి.. వాళ్ల పుంజు కూడా బరిలో తొడగొడితే.. మరో 2, 3 డబ్బు సంచులతో ఊరెళ్తారు. లేకపోతే.. తెచ్చింది కూడా పోగొట్టుకొని.. వట్టి చేతులతో వెనుదిరుగుతారు.కొన్నాళ్ల క్రితం వరకు.. ఏపీలో కోడి పందాలంటే.. వేలు, లక్షల్లోనే జరిగేవి. కానీ.. ఇప్పుడు లక్షల్లో పందెం కాయడం కామనైపోయింది. కొన్ని చోట్ల.. అరుదైన పుంజులపై కోటి రూపాయల పందెం కూడా నడుస్తోంది. ఈ స్థాయిలో పందాలు నిర్వహిస్తున్నారు కాబట్టే.. వేల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయ్. ఇదంతా.. జస్ట్ వారం గ్యాప్‌లోనే. సాధారణంగానే.. గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడి పందాలపై దాదాపు 3 వేల కోట్లకు పైనే చేతులు మారతాయనే లెక్కలున్నాయ్. ఈసారి.. ఆ బెట్టింగ్‌లు 6 వేల కోట్ల దాకా వెళ్లొచ్చనే అంచనాలున్నాయి.కొన్ని క్షణాల్లోనే తేలిపోయే కోడి పందాల కోసం.. కోట్లు తగలేయడమేంటి? వేల కోట్ల పందాలు కాయడమేంటనే వాదనలు వినిపిస్తుండొచ్చు. కానీ.. అక్కడ సీన్ మరోలా ఉంటుంది. కోడి పందాల్లో పాల్గొనడం దగ్గర్నుంచి.. పందెంలో పుంజుని గెలిపించుకోవడం దాకా.. ప్రతి సీన్ ప్రతిష్ఠాత్మకమే. అందుకే.. లక్షలు, కోట్లలోకి వెళ్లిపోతాయ్ పందాలు. చివరికి.. విదేశాల్లో సెటిలైనోళ్లు కూడా సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి పందాలు కాస్తుంటారంటే.. పరిస్థితులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కేవలం కొన్ని నిమిషాల్లోనే.. లక్షలు ఆవిరైపోతున్నా అస్సలు తగ్గరు. బ్యాంక్ బ్యాలెన్స్ ఖాళీ అయ్యే దాకా.. బరి నుంచి కదలరు.ఇప్పటికే.. ఏపీలో కోళ్ల పందాల కోసం భారీ స్థాయిలో బరులు సిద్ధమైపోయాయి. పందెం కోళ్లు కూడా సంక్రాంతి సమరానికి సై అంటే సై అంటున్నాయి. వేల కోట్ల రూపాయలు.. చేతులు మారేందుకు రెడీగా ఉన్నాయి. ఈసారి ఒక్కో జిల్లాలో కనీసం 600 కోట్లకు పైనే పందాలు జరుగుతాయనే అంచనాలున్నాయి. ఇంతకుముందుతో పోలిస్తే.. ఈసారి కోడి పందాలు జోరుగా సాగే అవకాశం ఉందంటున్నారు.సంక్రాంతికి వారం ముందు నుంచే.. కోడి పందాల హడావుడి మొదలైపోతుంది. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో కోడి పందాల హీట్ పీక్‌కు చేరుతుంది. వందల కోట్ల రూపాయలు చేతులు మారేది కూడా ఈ 3 రోజుల్లోనే. పండగ రోజుల్లో.. ఒక్కో బరి దగ్గర ఏర్పాట్లకే దాదాపుగా 30 లక్షల దాకా ఖర్చవుతుంది. అంటే.. అక్కడ ఏ స్థాయిలో పందాలు నిర్వహిస్తారో లెక్కేసుకోవచ్చు. ఈ ఖర్చుని కూడా పందెం రాయుళ్ల నుంచే వసూలు చేస్తారు నిర్వాహకులు. ఒక్కో పందెం నుంచి పది పర్సెంట్ కమిషన్ తీసుకుంటారు.అంటే.. 10 లక్షల పందెం కాస్తే.. లక్ష రూపాయలు బరి నిర్వాహకులకు ఇచ్చేయాల్సిందే. కేవలం.. కోడి పందాలు మాత్రమే కాదు.. ఈ బరుల చుట్టూ గుండాట, పేకాట, మట్కా లాంటి జూదాలు కూడా నడుస్తుంటాయి. అక్కడే.. పందెం రాయుళ్లకు కావాల్సిన ఫుడ్, ఆల్కహాల్‌తో పాటు కావాల్సినవన్నీ దొరికేస్తాయి. ఇవన్నీ నిర్వహించుకునేందుకు.. మొత్తంగా 20 లక్షల నుంచి కోటి దాకా వసూలు చేస్తారనే టాక్ ఉంది. ఇక్కడ.. బరి నిర్వాహకుల్ని కాదని.. ఎవరూ ఏమీ చేయలేరు. అందుకే.. వేరే ఆప్షన్ లేకుండా వారు అడిగినంత ఇచ్చేస్తారు.పందెంరాయుళ్లలో వీఐపీలు, సెలబ్రిటీలు కూడా ఉంటారు. కోడి పందాలు జోరుగా నడిచే జిల్లాల్లో వాళ్లు మకాం వేస్తారు. వీరి కోసం.. ప్రత్యేకంగా పెద్ద బరులు నిర్వహిస్తారు. అక్కడ ఫుడ్, అకామిడేషన్ అంతా వేరే లెవెల్లో ఉంటుంది. అందులోకి.. ఎవరిని పడితే వాళ్లకు ఎంట్రీ ఉండదు. కేవలం వీఐపీలు, వీవీఐపీలకు మాత్రమే అక్కడకు వెళ్లేందుకు.. కోడి పందాలు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ కోళ్ల పందాల క్రేజ్.. తెలంగాణకు కూడా పాకింది. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లి.. బరుల్లోకి దిగుతున్నారు.

కొందరు.. హైదరాబాద్ చుట్టుపక్కల పందెం కోళ్లని పెంచి.. వాటిని కోనసీమకు తీసుకెళ్లి.. పందాలు వేస్తున్నారు. అక్కడ స్థానికంగా ఉండే వారి పేర్ల మీద.. తమ పుంజుల్ని దించుతున్నారు కొందరు బడా బాబులు.బరిలోకి దిగగానే పందెం రాయుళ్లంతా ఓ ట్రాన్స్‌లోకి వెళ్లిపోతారు. ఆ సమయంలో.. ఆస్తులు పోతున్నా లెక్కలు చేయరు. ఈ పందాలు కూడా వేల నుంచి మొదలై.. లక్షల దాకా వెళ్లిపోతుంది. పందెంలో ఓడితే పోయేది కోడి మాత్రమే కాదు.. పరువు కూడా! అందుకోసమే.. పుంజుని బరిలో దించాక పందెంరాయుళ్లు వెనకా ముందు ఏమీ చూసుకోరు. డబ్బులు తీస్తూనే ఉంటారు. అవసరమైతే ఆస్తి పత్రాలు కూడా పందెంలో పెట్టేస్తారు. అందుకోసమే.. ఇన్ని వేల కోట్లు చేతులు మారతాయి. ఇదంతా.. భారీ మొత్తాల్లో ఉండే వ్యవహారం కావడంతో.. ఆన్ లైన్ పేమెంట్లు కూడా అదే స్థాయిలో జరుగుతాయి. పండగ అయిపోయిన తర్వాత కానీ తెలియదు.. ఎంత వచ్చింది? ఎంత పోయింది? అనేది! సంక్రాంతి అయిపోయిన 3 రోజుల తర్వాత దిగుతుంది కోళ్ల పందాల మత్తు.ఇప్పుడంటే.. డబ్బులు పెట్టి కోళ్లపై పందాలు కాస్తున్నారు గానీ.. వందల ఏళ్ల క్రితం ఇదంతా కేవలం వినోదానికి మాత్రమే అన్నట్లుగా ఉండేది. అయితే.. చరిత్రలో కోళ్ల పందాలనే యుద్ధాలుగా భావించేవారు. పల్నాడు, బొబ్బిలి, విజయనగర రాజుల మధ్య కూడా కోడి పందాలు ప్రతిష్ఠాత్మకంగా సాగాయి. అప్పట్లో.. పందెం కోడి ఓడితే.. పరువు పోయినట్లు ఫీలయ్యేవాళ్లు. బరిలో పుంజు మెడ తెగి పడితే.. తమ తల కొట్టేసినట్లు భావించేవాళ్లు.. అలా.. ఈ కోడి పందాలు.. ఏపీలో సంప్రదాయంగా మారిపోయాయి. అయితే.. వాళ్లు వినోదం కోసం, మనుషులతో చేసే యుద్ధాలను నివారించేందుకు మొదలుపెట్టిన ట్రెండ్.. ఇప్పుడు జూదంగా మారిపోయింది.నిజానికి.. ఏపీలో కోడి పందాల వెనుక పెద్ద ఆర్థిక వ్యవస్థే నడుస్తుంది. కోళ్ల పెంపకం నుంచి మొదలుకొని వాటికి ట్రైనింగ్, ఫుడ్, బరుల ఏర్పాటు.. ఇలా ఈ పందాల చుట్టూ జరిగే వ్యాపారం అంతా కలిపి.. వేల కోట్లు దాటుతోంది. కేవలం.. ఆంధ్రా ప్రజలే కాదు.. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వాళ్లతో పందెం బరులన్నీ సందడి సందడిగా మారతాయి. హోటల్ రూమ్స్ కూడా కొన్ని నెలల ముందు నుంచే బుక్ అయిపోతాయి. కోడి పందాల బరుల చుట్టూ.. జాతర వాతావరణం ఉంటుంది. ఈ ప్రదేశాల్లో ఫుడ్ బిజినెస్‌కు కూడా ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఇలా.. ఆంధ్రాలో ఒక్క సంక్రాంతి సీజన్‌లోనే.. కోళ్ల పందాల రూపంలో వేల కోట్ల రూపాయలు చేతులు మారిపోతాయి.

# నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద

## -నేడు స్వామి వివేకానంద జయంతి

## -భారతీయులకు జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు



మతానికి కొత్త అర్థాన్ని, సేవకు పరమార్థాన్ని నిర్వచించి నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద దేశ యువతకు సదా స్ఫూర్తిదాతగా నిలువాలని 1985లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజైన జనవరి 12ను జాతీయ యువజన దినోత్సవంగా నిర్ణయించింది.బలమే జీవనం...బలహీనతే మరణం..నువ్వు దేనినైతే ఆలోచిస్తావో ఆవిధంగానే తయారవుతావు. నిన్ను బలహీనుడిగా భావించుకుంటే చివరకు బలహీనుడివే అవుతావు..శక్తిమంతుడిగా భావించుకుంటే శక్తిమంతుడివే అవుతావు. సమస్త శక్తి నీలోనే ఉంది. దానినే విశ్వసించు, నీవు బలహీనుడవని ఎప్పుడూ తలపోయకు..ధీరుడవై నిలిచి నీలోని దివ్యత్వాన్ని ప్రకటించు...అంటూ సమస్త మానవాళిని భయం వదలి సమాజ సేవకు నడుంకట్టాలన్నారు స్వామి వివేకానంద. ఉక్కునరాలు, ఇనుపకండరాలు, వజ్రతుల్యమైన ధృడసంకల్పం, మొక్కవోని విశ్వాసం గల వందమంది యువకులు చాలు...ఈదేశాన్ని ప్రపంచంలో అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపడానికి అంటూ ఎలాంటి యువత నేడు అవసరమో వివరించారు ఆమహనీయుడు. స్వామి సంక్షిప్త జీవిత చరిత్రకలకత్తాకు చెందిన ప్రసిద్ధ న్యాయవాది విశ్వనాథ దత్తా, ఆయన సతీమణి భువనేశ్వరీదేవి దంపతులకు నలుగురు కుమార్తెలు. ఒక మగబిడ్డ కావాలని భువనేశ్వరీ దేవి శివుణ్ని ప్రార్థించింది.1863 జనవరి 12తేదీ మకర సంక్రాంతి పర్వదినాన నరేంద్రనాథ్ జన్మించారు. ఆ శిశువే అనంతరం స్వామి వివేకానందుడిగా ప్రపంచ ప్రసిద్ధి చెందారు. చిన్నప్పుడు కొంటె పనులు చేసినా, పెంపుడు జంతువులతో ఆటలాడుతూ తల్లి చెప్పే భారత, రామాయణ ఇతిహాసాలను శ్రద్ధగా వినేవాడు.పాఠశాలలో చేరింది మొదలు కళాశాల స్థాయి వరకు ఆ బాలుడిలో అసాధారణ మేధాశక్తి, అద్భుత జ్ఞాపకశక్తిని చూసి సహవిద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపడేవారు. వివిధ క్రీడల్లో ప్రావీణ్యం చూపడంతోపాటు మూఢనమ్మకాలను నమ్మకుండా ధైర్యసాహసాలు ప్రదర్శించేవాడు. చిన్నప్పటినుంచే ధ్యానంపై దృష్టి నిలిపిన నరేన్ త్రాచుపాము సమీపించినా ధ్యానముద్ర వీడేవాడుకాదు. గదిలో బంధించినా నిరుపేదలను చూసి చలించి ఇంట్లో ఉన్నవన్నీ కిటికీలగుండా దానం చేసేవాడు. దేవుడంటే ఎవరు, ఎలా ఉంటాడో కనుక్కోవాలన్న తపనతో ఎంతమందిని అడిగి చూసినా ఫలితం లేకపోవడంతో దక్షిణేశ్వర కాళికాలయానికి వెళ్లి శ్రీరామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. కోరుకుంటున్న శిష్యుడు, గురువు దొరికేసరికి రామకృష్ణులవారి సంతోషానికి, శిష్యుడి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. దైవసాక్షాత్కారం కోసం నిరంతర ధ్యానం చేశారు. పరివ్రాజకునిగా దేశసంచారం చేశారు. ఎన్నో క్షేత్రాలు తిరిగి భారతదేశంపై పూర్తి అవగాహనకు వచ్చారు. పేద ధనిక తేడాలకు కలత చెందేవారు. కన్యాకుమారి చేరుకుని ఆమె దివ్య సమక్షాన్ని అనుభూతి చెందిన స్వామిలో ఆధ్యాత్మికతతోపాటు దేశభక్తి మిళితమైంది. స్వామి ప్రసంగాలకు ముగ్ధులైన మద్రాసు ప్రజలు విరాళాలు సేకరించగా 30 ఏళ్ల వయసులో త్యాగభూమి నుంచి భోగభూమి అయిన అమెరికాకు వెళ్లారు. అక్కడ ఎన్నో కష్టాలు ఎదురైనా లెక్కచేయకుండా 1893 సెప్టెంబర్ 11న చికాగోలో ప్రారంభమైన సర్వమత మహాసభలో వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు, దాదాపు 7వేల మంది శ్రోతలు ఉన్నసభలో స్వామి ప్రవేశించారు. అమెరికా సోదర సోదరీమణులారా నామతం గొప్పదంటే..కాదు కాదు నామతం గొప్పది అంటూ కొట్లాడుకుంటున్న కాలంలో కాషాయం కట్టిన ఓ సాధారణ సన్యాసిగా చికాగోలోని సర్వమత సమ్మేళనంలోకి అడుగుపెట్టి ఓ నా అమెరికా సోదర సోదరీమణులారా అంటూ ఆత్మీయ సంబోధనతో ప్రపంచదేశాలకు భారతీయ సోదరభావాన్ని, ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. ఆయన ఆత్మీయ సంబోధన విని వేలాదిమంది లేచి రెండు నిమిషాలపాటు చప్పట్లతో ఆనందానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన అనర్గళంగా చేసిన విశ్వజనీన ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు. అంతవరకు ఎవరికీ తెలియని స్వామి అసాధారణ ధార్మిక ప్రబోధకుడిగా కీర్తిగాంచారు. చికాగో వీధుల్లో వెలసిన ఆయన చిత్రపటాలకు వందనం చేయనివారు లేరంటే అతిశయోక్తికాదు. డిసెంబర్ 16న ఆయన మాతృభూమికి ప్రయాణమవుతుండగా ఆయనను వీడలేకనే అఖండ జనం ఆయనకు వీడ్కోలు పలికారు. మాతృదేశంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది.అనంతరం 1899 జూన్ 20న కూడా మరోమారు పాశ్చాత్య దేశాలలో పర్యటనకు వెళ్లివచ్చారు. తన నలభయ్యవ పుట్టిన రోజును చూడబోనని స్వామీజీ సూచించినట్లుగానే 1902 జూలై 4వ తేదీన రాత్రి 9:10గంటలకు స్వామీజీ మహాసమాధి పొందారు.

# కత్తిపూడి వద్ద రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి



కాకినాడ కత్తిపూడి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు.చెన్నై- కోల్ కొత్త జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. భీమవరం నుండి అన్నవరం సత్యదేవుని దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

# సీలింగ్ విధిస్తారా..? లేదా..?

ఖమ్మం, జనవరి 11, తెలంగాణలో రైతు భరోసా స్కీమ్ పట్టాలెక్కనుంది. ఈ మేరకు తెలంగాణ సర్కార్ ఇటీవలనే కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. స్కీమ్ అమలుకు సంబంధించి మంత్రివర్గం కూడా ఆమోదముద్ర వేసింది. జనవరి 26వ తేదీ నుంచి ఈ స్కీమ్ ను అమలు చేయాలని నిర్ణయించింది. ఏటా రూ. 12 వేల పంట పెట్టుబడి సాయం అందించబోతుంది.రైతు భరోసా స్కీమ్ ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. అయితే పథకం అమలులో సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుందనేది ఆసక్తికరంగా మారింది. గతంలో ఉన్న రైతుబంధు పథకం అమలులో అనేక లోపాలు ఉన్నాయని.. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతూ వస్తోంది. గతంలో మాదిరిగా స్కీమ్ అమలు ఉండదని? సాగు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా ఇస్తామని కూడా క్లారిటీ ఇచ్చింది.స్కీమ్ అమలుపై ప్రాథమికంగా కొన్ని సందేహాలు తెరపైకి వస్తున్నాయి. ఇందులో సీలింగ్ అంశం కూడా ఒకటిగా ఉంది. గతంలో అమలు చేసిన రైతుబంధు పథకం కింద ఒక రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నా.. పంట పెట్టుబడి సాయం అందించారు. ఎలాంటి సీలింగ్ ను కూడా నిర్ణయించలేదు. దీంతో రైతుకు ఎంత విస్తీర్ణంలో భూమి ఉందో.. అంతమేరకు పంట సాయం అందింది. అయితే దీనిపై అనేక వర్గాల నుంచి పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం అమలు చేయబోతే రైతు భరోసా పథకంలో సీలింగ్ ఉంటుందా..? ఉండదా..? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. నిజానికి కేబినెట్ సబ్ కమిటీ.. జిల్లా వారీగా రైతుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించింది. అసెంబ్లీలో నిర్వహించిన చర్చలో కూడా పలు సూచనలు, సలహాలు వచ్చాయి. దీనిపై కేబినెట్ భేటీలో కూడా చర్చ జరిగింది. అయితే ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది.కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను వెల్లడించారు. సాగు యోగ్యత ఉన్న భూములకు ఎలాంటి షరతు లేకుండా పంట పెట్టుబడి సాయం అందిస్తామని స్పష్టంగా చెప్పారు. అంటే? సీలింగ్ లేకుండానే ఈ స్కీమ్ ను అమలు చేస్తారా..? అన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది.ఇక తాజాగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం వనపర్తి జిల్లాలో పర్యటించిన ఆయన? రైతు భరోసా పథకం గురించి మాట్లాడారు. జనవరి 26 నుంచి అన్నదాతల అకౌంట్లలో ఎకరానికి 12 వేల రూపాయల డబ్బులను జమ చేస్తామని చెప్పారు. సాగు చేసే ప్రతీ ఎకరానికి రైతు భరోసా ఇస్తామంటూ క్లారిటీ ఇచ్చారు. “ఐదు ఎకరాలో, పది ఎకరాలో కాదు ఎలాంటి షరతులు లేకుండా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికి కూడా రైతు భరోసా అందుతుంది. జనవరి 26 నుంచి స్కీమ్ అమలు చేయబోతున్నాం. రూ. 8400 కోట్లు రైతుల అకౌంట్ల లోకి వెయ్యబోతున్నాం. ఇదే విషయాన్ని రైతులకు ధైర్యంగా చెప్పండి” అంటూ భట్టి ప్రకటన చేశారు. డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన చూస్తే? సీలింగ్ విధానం ఉండదేమోనన్న చర్చ మొదలైంది. అయితే రేపోమాపో రైతు భరోసా స్కీమ్ అమలు కోసం మార్గదర్శకాలు విడుదలయ్యే అవకాశం ఉంది. దీంట్లో సీలింగ్ విధించే అంశంపై ప్రస్తావించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా?. మరికొన్ని అంశాలపై కూడా స్పష్టత వస్తుంది.

# మినీ ఎయిర్ పోర్టుగా మల్కాజ్ గిరి

హైదరాబాద్, జనవరి 11, పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేలా జంట నగరాల పరిధిలోని రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. ఇప్పటికే చర్లపల్లి టెర్మినల్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి.. ప్రారంభించారు. ప్రస్తుతం సంక్రాంతి ప్రత్యేక రైళ్లు నడిపిస్తుండగా.. మార్చి నుంచి రెగ్యులర్ రైళ్లు ఈ స్టేషన్ నుంచే బయలుదేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా, సికింద్రాబాద్‌కు సమీపంలో ఉన్న మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం (ఏబీఎస్ఎస్) కింద అభివృద్ధి చేస్తున్నారు. సకల వసతులతో దీని రూపురేఖలు మార్చేస్తున్నారు. సికింద్రాబాద్ స్కీంలో భాగంగా ఈ స్టేషన్‌ను ఎంపిక చేశారు. అభివృద్ధి పనుల చకచక జరుగుతున్నాయి.ఇప్పటికే 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడు లిఫ్టులు, మూడు ఎస్కలేటర్లు పనులు చేపట్టారు. ఇండ్వేల్ కాంట్రాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. స్టేషన్‌లో హై-లెవల్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. వీఐపీ లాంజ్, ఏసీ వేయిటింగ్ హాల్, విశాలమైన పార్కింగ్ వసతి, రైల్వేస్టేషన్ రాకపోకలు సాగించేందుకు కొత్తగా అప్రోచ్‌రోడ్డు, స్టేషన్‌కు ఇరువైపులా ఆకర్షనీయంగా పోర్టికోల నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయిగ్రీనరీతో కూడిన గార్డెన్లతో పాటు ‘ఐ లవ్ యూ మల్కాజిగిరి’ అనే సెల్ఫీ పాయింట్‌ను సైతం స్టేషన్ ముందు నిర్మాణం జరుగుతోంది. గత అక్టోబరు మొదలైన పనులు పూర్తయిన తర్వాత మల్కాజిగిరి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ స్టేషన్ మినీ ఏయిర్‌పోర్టుగా ప్రయాణికుల మన్ననలు పొందనుంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వంటి కొన్ని రైళ్లకు అక్కడ స్టాప్ ఉంది. వీటితో పాటు మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం స్టాప్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.మల్కాజిగిరి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల కోసం కేంద్రం బడ్జెట్‌లో రూ.27 కోట్లు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రెండు ఫ్లాట్‌పామ్‌ల మాత్రమే ఉండగా.. ప్రయాణికుల రద్దీని బట్టి మరొకటి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు. రోజూ ఈ మార్గంలో 62 రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా... స్టేషన్‌లో 600 సాధారణ టిక్కెటుదారులు, 500 వరకు రిజర్వేషన్ ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి ప్రయాణిస్తున్నారు

# ప్రభుత్వ భూమి కలిసింది... సరెండర్ చేస్తున్న సిరిసిల్ల జనాలు

కరీంనగర్, జనవరి 11, ఎక్కడైనా ఈ భూములు మాకొద్దు అంటూ కలెక్టర్ ను కలిసి వాపస్ చేసిన సీన్లు చూశారా?ఇప్పుడు చూపిస్తాం చూడండి..సుంచుల కుమారస్వామి. బీఆర్ఎస్ లోకల్ లీడర్. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి పరిధిలోని సర్వే నంబర్ 464లోని 3 ఎకరాల ప్రభుత్వ భూమి ఈయన సొంతమైంది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు సిరిసిల్ల జిల్లాలో ఇలా కబ్జాలు చేసిన వారంతా అరెస్టై జైలుకు వెళ్లారు. దీంతో కేసుల భయం ఎందుకని చెప్పి ఇదిగో ఇలా జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసి ఈ భూమి నాకొద్దు మహా ప్రభో అని సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు. చాలా మంది చేసుకున్నట్లే నేను చేసుకున్నా.. ఇప్పుడు వద్దని ఇచ్చేస్తున్నా.. ఇదీ డైలాగ్.ఇదొక్క ఎగ్జాంపులే కాదు.. ఈ నెల 2న తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ కూడా 2 ఎకరాల భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు సరెండర్ చేశారు. కేసులు నమోదవుతుండడంతో కబ్జా, అక్రమ పట్టాదారుల్లో భయాలు మొదలయ్యాయి. దీంతో ఎందుకొచ్చిన తంటా అని చెప్పి భూముల్ని వాపస్ చేస్తున్నారు. అదీ మ్యాటర్. ఒకవైపు సిరిసిల్లలో అసైన్డ్ ల్యాండ్స్ ను కబ్జాలు చేసి ధరణి వచ్చాక తమపేర్లపై మార్చుకుని గులాబీ లీడర్లు చేసిన దందాలు బయటికొస్తున్నాయి. చెరువు, అటవీ, అసైన్డ్ ఇలా దేన్నీ వదల్లేదు. ధరణి వచ్చాక ఇంకింత రెచ్చిపోయారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన జీవోలను ఆసరాగా చేసుకుని చక్రం తిప్పుకున్నారు. ఇప్పుడు కటకటాలు లెక్కపెడుతున్నారు. నాడు కేటీఆర్ మంత్రిగా ఉండడంతో అధికారులు కూడా చూస్తూ ఉండిపోయారు. ఏమీ చేయలేకపోయారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారింది. కథ మారింది. అందుకే అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. సిరిసిల్ల లాండ్ ఫైల్స్ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.ఇక్కడ అన్నిటికంటే హైలెట్ ఏంటంటే.. కొట్టేసిన భూముల్ని వరుసగా ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు ముందుకొస్తున్నారు. అంటే అక్కడ ఏం జరిగిందో ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్, ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టా చేసుకున్న బీఆర్ఎస్ లీడర్ల అరెస్ట్ లు కంటిన్యూ అవుతున్నాయి. బీఆర్ఎస్ సీనియర్ లీడర్ బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, జిందం దేవదాస్, సురభి నవీన్ రావుపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు ఈనెల 7న తంగళ్లపల్లి మండలం నేరేళ్ల బీఆర్ఎస్ నేత పూడూరి భాస్కర్ ను రిమాండ్ కు తరలించారు. భాస్కర్ మండేపల్లిలో 20 గుంటల అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని రెవెన్యూ అధికారులు తేల్చడంతో కటకటాలు లెక్కిస్తున్న పరిస్థితి. అంతే కాదు తంగళ్లపల్లి మండలానికి చెందిన మరో నలుగురు లీడర్లు పరారీలో ఉన్నారని కూడా చెబుతున్నారు.తంగళ్ళపల్లి మండలం తాడూరులోని సర్వే నంబర్ 1148లో సురభి నవీన్ రావు 3 ఎకరాలు, సురభి దేవేందర్ రావు పేరిట 3 ఎకరాలు మొత్తం 11 ఎకరాలు కబ్జా అయ్యాయని నిర్ధారించారు. కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. 11 ఎకరాలను తిరిగి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో మార్చారు కలెక్టర్. ఇక బొల్లి రామ్మోహన్ ఈయన సిరిసిల్ల జిల్లాలో సీనియర్ బీఆర్ఎస్ లీడర్. సర్దాపూర్, బద్నేపల్లిలో ఏడు ఎకరాలను మాయ చేసి పట్టా పొందారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు.ధరణి వచ్చే టైంలో నాటి బీఆర్ఎస్ సర్కార్ ఓ ఉత్తర్వు ఇచ్చింది. దాని ప్రకారం 2017 డిసెంబర్ 31 కంటే ముందు ఎవరైనా భూమిలేని పేదవారు అసైన్డ్ భూమి కొనుగోలు చేస్తే, వారిని ఆ భూమి నుంచి తొలగించకుండా వారికే అసైన్మెంట్ పట్టా జారీ చేయొచ్చని భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అదే మంచి సమయం అనుకున్న చాలా మంది బీఆర్ఎస్ లీడర్లు.. అసైన్డ్ భూములను చాలా తక్కువ ధరకు పేదల నుంచి రాయించుకుని.. పాస్ బుక్స్ పొందారు. ఇదే జీవోను అడ్డం పెట్టుకుని సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తమ్ముడు జిందం దేవదాసు లాండ్ పొందారు.తంగళ్లపల్లి మండలం సారంపెల్లి శివారులోని 164/3లో 3 ఎకరాలు కొన్నాడు. ప్రభుత్వ రూల్స్ ప్రకారం.. అసైన్డ్ ల్యాండ్ కొనాలంటే ఆ వ్యక్తి స్థానికుడై ఉండాలి. భూమి లేని పేద రైతు అయి ఉండాలి. అదే భూమిపై ఆధారపడితేనే రీఅసైన్ చేయాలి. కానీ జిందం దేవదాసు ఐటీ రిటర్న్స్ ఫైల్ చేస్తున్న బడా కాంట్రాక్టర్. అప్పట్లోనే అతడికి నోటీసులు ఇచ్చి కేసు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ అప్పటి తహసీల్దార్ పట్టించుకోకుండా పాస్‌బుక్ జారీ చేశారు. ఎందుకంటే నాటి ప్రభుత్వంలో బలమైన లీడర్లుగా చెలామణి అవడమే. అంతే కాదు నాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లకు వచ్చినప్పుడల్లా వెంట ఉండే వారు కావడంతో అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారు.ప్రభుత్వ భూములను పట్టా చేయించుకున్నవారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధాన అనుచరుడు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేరు కూడా ఉంది. ఆయన భార్య పేరిట ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురంలోని 119/4 సర్వే నంబర్ లో 3.20 ఎకరాల భూమికి లావుణీ పట్టా జారీ అయింది. వెంకటాపురంలో సర్కార్ భూమిని అసైన్డ్ చేయడానికి అర్హులైన పేదలు, కూలీలు ఎంతో మంది ఉన్నా.. ఎల్లారెడ్డిపేటలో ఉండే బీఆర్ఎస్ లీడర్, ఆర్థికంగా బలంగా ఉన్న ఆగయ్య కుటుంబానికి లావుణీ పట్టా మంజూరు చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో గత నెలలో ఈ భూమిని ప్రభుత్వ భూమిగా ధరణి రికార్డుల్లో మార్చేశారు. అదీ మ్యాటర్. సో ఇవన్నీ దొరికినవే. ఇంకా దొరకనివి, దొరకాల్సినవి ఎన్నో ఉన్నాయి.సిరిసిల్ల జిల్లాలో జరిగిన భూ భాగోతాలపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎంక్వైరీ చేస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇదే జిల్లాలో దాదాపు 300 నుంచి 500 ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా పట్టాలు చేయించుకున్నారంటున్నారు. ఇంకా తవ్వి తీస్తే మొత్తం 2 వేల ఎకరాల దాకా బయటపడుతుందంటున్నారు. ఇప్పటికే సిరిసిల్ల జిల్లా పెద్దూర్, సర్ధాపూర్, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె, అంకుషాపూర్, తాడూర్, లక్ష్మీపూర్, పాపయ్యపల్లె, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామాల్లో భూముల హాంఫట్ కథలు బయటికొచ్చాయి.ఇదే మ్యాటర్ పై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా రియాక్ట్ అయ్యారు. సిరిసిల్ల జిల్లాలో పేదల పేరుతో బీఆర్ఎస్ లీడర్లు 2 వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేశారన్నారు. ఈ భూములను ఉద్దేశపూర్వకంగానే వందల మంది పేర్లపై అసైన్డ్ భూమిగా నమోదు చేశారని చెప్పారు. సీసీఎల్ఏ ఆఫీస్ నుంచి ప్రత్యేక టీములను సిరిసిల్ల లాండ్ స్కామ్స్ పై ఎంక్వైరీకి పంపిస్తున్నారు.సిద్దిపేటలో దళితులు, పేదలు ఉన్న 484 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిషేధిత జాబితాలో చేర్చిందన్నారు మంత్రి పొంగులేటి. 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో జరిగిన భూ అక్రమాలు, లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి సర్కారు భూములు స్వాధీనం చేసుకుంటామని మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఇందుకోసం మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన సంస్థల్ని ఎంపిక చేయబోతున్నారు.గత ప్రభుత్వ హయాంలో పలు భూములకు సంబంధించి కోర్టుల నుంచి ఆదేశాలు లేకున్నా ఉన్నట్లు సృష్టించి భూములు స్వాధీనం చేసుకున్న వాటిపైనా నజర్ పెడుతున్నారు. మాజీ సైనికుల పేరుతోనూ నకిలీ ఎన్ఓసీలతో స్థలాలు మాయం చేశారన్నారు. సో ఈ భూమి మాకొద్దు అని వాపస్ ఇస్తున్నారంటే గత ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో అంతా అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారుసిరిసిల్ల నియోజకవర్గంలో కేటీఆర్ మంత్రిగా ఉన్న టైంలోనే వేల ఎకరాల్లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను ఈనెల 4న పరిశీలించారు. బీఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థను నాశనం చేశారన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి అనుచరులకు వేల ఎకరాల అసైన్డ్ భూములను పట్టాలు చేశారని ఆరోపించారు. కేటీఆర్ హయాంలో పదేళ్లలో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు సిట్ ఏర్పాటు చేయాలన్నారు.

# పతంగుల ఫెస్టివల్ కు సిద్ధం

హైదరాబాద్, జనవరి 11,సంప్రదాయం, ఆనందాల సమ్మేళనమే సంక్రాంతి పండుగ. బిజీ షెడ్యూల్ ను పక్కనబెట్టి సొంతూళ్లకు పయనవుతోన్న హైదరాబాద్ ఇప్పుడు సంక్రాంతి పండుగకు సిద్ధమవుతోంది. అప్పుడే పిండి వంటలు చేయడం మొదలైంది. విద్యాసంస్థలకు ప్రకటించడంతో సంక్రాంతి సెలవుల కోసం విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కొందరేమో ఎప్పుడెప్పుడు తమ సొంతూళ్లకు లేదా అమ్మమ్మ వాళ్లింటికి వెళ్లాలా అని ఆలోచిస్తూ కూర్చున్నారు. నగరాన్ని కనువిందు చేసేలా ఇప్పటికే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆకాశంలో పతంగులను ఎగురవేస్తూ ఆనందిస్తున్నారు. ఇక మార్కెట్లు సైతం ఈ పండక్కి జనంతో కిటకిటలాడుతున్నాయి. అయితే జనరేషన్ కి తగ్గట్టుగా మార్కెట్లో పతంగులు అందుబాటులో ఉంటున్నాయి. సినిమా హీరోలు, యానిమేషన్స్ లాంటివి పిల్లలను ఎంతో ఆకట్టుకుంటాయి. ఈ పండక్కి మరో ప్రత్యేకత ఏంటంటే.. హైదరాబాద్ లో జరిగే కైట్ ఫెస్టివల్. అందుకే హైదరాబాద్ మార్కెట్ ను ను అతిపెద్ద పతంగుల మార్కెట్ అని పిలుస్తూ ఉంటారు.పతంగుల పండుగ అని కూడా పిలుచుకునే ఈ సంక్రాంతి పండక్కి నగరంతో పాటు పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి విభిన్నమైన డిజైన్లలో పతంగులు హైదరాబాద్ కు చేరుకున్నాయి. అందులో ముఖ్యంగా చార్మినార్ వద్ద ఉండే గుల్జార్ హౌజ్ ఈ పతంగుల అమ్మకానికి బెస్ట్ ప్లేస్ అని చెప్పవచ్చు. ఈ ప్రాంతంతో పాటు మూసాబౌలి, బేగంబజార్, దూల్ పేట్, లాల్ దర్వాజా వంటి ప్రముఖ ప్రాంతాల్లోనూ గాలి పటాలు విస్తృతంగా అమ్ముడవుతాయి. ఇక గుడుంబా అమ్మకాలకు కేరాఫ్ అడ్రస్ గా చెప్పుకునే దూల్ పేట్ లో ఇప్పుడు పరిస్థితి కాస్త మారింది. ఇంతకుముందు గుడుంబా అమ్ముకునే వ్యాపారస్తులు ఇప్పుడు పతంగులు తయారు చేసి అమ్ముతున్నారు. ఈ వ్యాపారంలో తమకు అంతగా లాభాలు రాకపోయినప్పటికీ సమాజంలో గౌరవంగా బతుకగలుగుతున్నామని వారు చెబుతున్నారు. మరికొందరేమో ఆశించిన ఆదాయం రాకపోతుండడంతో వేరే పనులు చేసుకుంటున్నారని అంటున్నారు. ఏదైమైనా ముందుతో పోలిస్తే పతంగులు తయారు చేసే కుటుంబాలు బాగా తగ్గిపోయాయనే తెలుస్తోంది.పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం చైనా మాంజాపై నిషేధం విధించింది. దీంతో సంప్రదాయ లోకల్ మాంజాకు డిమాండ్ పెరిగింది. మూసీ నదీ తీర ప్రాంతంలోని మంగళ హాట్ ఏరియాలో చాలా మంది మాంజా తయారుచేస్తుంటారు. లోకల్ మాంజాతో పాటు బరేలీ, కృష్ణ, గన్, సిక్స్ కాట్, 12 కాట్, నైన్ కాట్ అంటూ పలు రకాలు మాంజాలను వారు తయారు చేస్తారు. గ్లాస్ పౌడర్ తో తయారయ్యే మాంజా కోసం వారు దాదాపు రూ.20వేల వరకు ఖర్చు చేసి.. మార్కెట్ లో రూ.25 -38వేలకు అమ్ముతుంటారు. చైనా మాంజాతో తమకు గిరాకీ పెరుగుతోందని అక్కడి వ్యాపారులు చెబుతోన్న మాట.ప్లాస్టికేతర పతంగులకు మార్కెట్లో డిమాండ్ పెరగడంతో.. చాలా మంది దీపావళి నుంచే పతంగులను తయారు చేయడం మొదలుపెట్టారు. స్థానికంగా తయారు చేయడమే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పతంగులను తెచ్చి అమ్ముతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ప్లాస్టిక్ పతంగులపై నిషేధం విధించడంతో వారంతా ఇక్కడే వచ్చి కొనుక్కుంటున్నారని, కానీ ఒక్క కుటుంబంలో కనీసం ముగ్గురు కష్టపడినా ఒక్క రోజులో 200 పతంగులకు మించి తయారు చేయలేకపోతున్నారు. ఒక్కో గాలి పటం తయారీకి దాదాపు రూ.30 -100 ఖర్చు చేస్తున్నప్పటికీ.. అమ్మకం దగ్గరికి వచ్చేసరికి మాత్రం పెట్టుబడికి లోపే ఉండడం తయారీదారులకు దురదృష్టంగా మారింది. ఇక గాలి పటాలతో ఆడే పిల్లలు కూడా చాలా తగ్గిపోయారు. ఏ మాత్రం ఖాళీ దొరికినా చదువు, ఫోన్లు, టీవీ అంటూ ఏదో ఒక ఆలాపనలో మునిగిపోతున్నారు. పతంగులతో ఆడుకునే టైం కూడా చాలా తక్కువైపోయింది.అయితే పతంగులను పేపర్, మెటల్, ప్లాస్టిక్ వంటి ఐటెమ్స్ తో తయారు చేస్తుంటారు. కానీ ఈ సారి మార్కెట్ లోకి గోల్డ్, సిల్వర్ పతంగులు స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తున్నాయి. బంగారం, వెండి పూతలతో తయారు చేసిన ఈ గాలిపటాలు ఒక గ్రామ్ గోల్డ్ కోటెట్ గిఫ్ట్ ప్యాక్ కి రూ.200-500, సిల్వర్ ప్యాక్ ధర రూ.850 వరకు అమ్ముతున్నారు. ఇవే కాకుండా జర్మన్ సిల్వర్, మెటల్ రైట్, సిల్వర్ చక్కి, సీసం ఫుడ్, జైపూర్ మీనా ఆర్ట్ వర్క్ తో కూడిన గిఫ్ట్ ప్యాక్స్ కూడా మార్కెట్ లో సందడి చేస్తున్నాయి. డిజైన్, మన్నికను బట్టి వీటి ధర ఉంటోంది.అందరికీ ఎంతో ఇష్టమైన సంక్రాంతి పండుగకు గాలిపటాలను ఎగురవేయడమనేది సంప్రదాయంగా వస్తోన్న ఆచారం. అందులో భాగంగానే ఏటా హైదరాబాద్ లో అంతర్జాతీయ పతంగుల పండుగను నిర్వహిస్తారు. ఇది ఈ నెల 13,14,15 తేదీల్లో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరగనుంది. తెలంగాణ టూరిజం డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకకు దాదాపు 11 దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారు. ఈ సారి అమ్మాయిల చదువు - ప్రపంచ మార్పుకు నాంది అనే థీమ్ తో ఈ ఫెస్టివల్ ను నిర్వహించనున్నారు. దీంతో పాటు నగరంలో ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ కూడా చెప్పుకోదగిన వేడుక.

# ఆగని ప్రైవేట్ బస్సుల దందా

హైదరాబాద్, జనవరి 11,సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారా.. అయితే మీ జేబు నిండుగా ఉండేలా చూసుకోండి. లేదంటే అంతే.. అవును మరి ప్రస్తుతం పరిస్థితి అలాగే ఉంది. పల్లెబాట పడుతోన్న జనాలను ప్రైవేట్ ట్రావెల్స్ దండుకుంటున్నాయి. సంక్రాంతి పండక్కి సాధారణంగానే ఫుల్ రష్ ఉంటుంది. ఇదే అదనుగా చేసుకున్న ప్రైవేటు ఆపరేటర్లు టిక్కెట్ ధరలను అమాంతం పెంచేశాయి. ఇది చూసిన ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఇలా ఇష్టారీతిన టిక్కెట్ ఛార్జీలు పెంచుతున్నా రవాణా శాఖ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.ఆర్టీసీ బస్సుల కంటే దాదాపు మూడింతలు ఎక్కువగా ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు టిక్కెట్ ధరలను వసూలు చేస్తున్నాయి. గతంలో రూ.1000, 12వందలు ఉన్న టిక్కెట్ ధర ఇప్పుడు రూ.3వేలకు పైమాటే. రాజమండ్రికి వెళ్లే ప్రయాణికులకు రూ.3,500 - 4వేలు, భీమవరం వెళ్లే వారికి రూ.3 -4వేలు వసూలు చేస్తున్నారు. ఇక కుటుంబం మొత్తం వెళ్లాలంటే కేవలం టిక్కెట్ ల కోసమే దాదాపు రూ.20వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు సొంతూళ్లకు వెళ్లేందుకు నానా కష్టాలు పడుతున్నారు. టిక్కెట్ ధరను పదులు, వందలు కాకుండా ఒక్కసారిగా వేలల్లో పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రద్దీ పెరిగినట్టు అయితే ఇంకా బస్సుల సంఖ్య పెంచుతామని, మరిన్ని బస్సులు నడపడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సమయంలోనే ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు అధిక ఛార్జీలు వసూలు చేస్తే ప్రయాణికులు.. అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ ప్రభుత్వం ప్రయాణికుల భద్రత, సంక్షేమనికే ప్రాధాన్యత కల్పిస్తుందని చెప్పారు.మరో పక్క రెండు తెలుగు రాష్ట్రాలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి. తెలంగాణలో 6432 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు టీజీఆర్టీసీ ఇప్పటికే ప్రకటించగా.. ఆంధ్రప్రదేశ్ లో 7,200 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ ప్రకటించింది. అందుకు సంబంధించిన అనేక ఏర్పాట్లను కూడా ఈ రాష్ట్రాలు పూర్తి చేశాయి.మరోపక్క సంక్రాంతి పండుగ వేళ ప్రయాణికులకు రైల్వే శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. విశాఖ - సికింద్రాబాద్ - విశాఖ మధ్య నడుస్తోన్న వందేభారత్ ఎక్స్ ప్రెస్ లో అదనపు కోచ్ లను జోడించింది. ఇప్పటివరకు 16 కోచ్ లు రాకపోకలు సాగిస్తుండగా.. ఇప్పుడు అదనంగా మరో 4 కోచ్ లను అందుబాటులోకి తెచ్చినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. దీని వల్ల 1,128గా ఉన్న సీటింగ్ కెపాసిటీ 1,414కు పెరగడంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండనుంది.

ఆర్టీసీ బస్సుల్లో నిలువు దోపిడీ

సంక్రాంతి స్పెషల్ బస్సుల పేరుతో.. అడ్డగోలుగా టికెట్ రేట్లను పెంచేసి.. ప్రయాణికులను నిలువునా దోచేస్తున్నట్టుగా పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.ఈ మేరకు సోషల్ మీడియాల్లో బస్సు టికెట్లను ప్రయాణికులు షేర్ చేస్తే.. సంక్రాంతి పండగ పూట ఆర్టీసీ బాదుడు అంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలో.. సంక్రాంతికి స్పెషల్ బస్సుల పేరుతో ఆర్టీసీ దోపిడీ చేస్తోందంటూ వనపర్తికి చెందిన ఓ నెటిజన్ పోస్ట్ పెట్టాడు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచితమే కానీ.. పురుషుల దగ్గర మాత్రం కండక్టర్లు ఎక్స్‌ట్రా ఛార్జీలు వసూలు చేస్తూ జేబులు గుల్ల చేస్తున్నారంటూ చెప్పుకొచ్చాడు. వనపర్తి నుంచి మహబూబ్ నగర్‌కు సాధారణంగా ఛార్జీ రూ.100 ఉంటే.. ఇప్పుడు రూ.140 వసూలు చేస్తున్నారని.. అందుకు సాక్ష్యంగా తన టికెట్‌ను ఫొటో తీసి మరీ పోస్ట్ చేశాడు. మహిళల ఛార్జీలు కూడా పురుషుల దగ్గర వసూలు చేస్తున్నారంటూ మండిపడుతూ ట్వీట్ చేశాడు.మరోవైపు.. ఈ దారిదోపిడి సాధారణ ప్రయాణికుల దగ్గరే కాదు.. దివ్యాంగుల దగ్గర కూడా చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజా పాలనలో పండుగ పేరుతో ఆర్టీసీ టికెట్ రేట్లు అంతకంత పెంచి దోపిడీ చేస్తున్నారని దుయ్యబడుతున్నారు. సాధారణ రోజుల్లో వికలాంగులకు హాఫ్ టికెట్ ఉంటే.. పండుగ పేరుతో వారికి కూడా ఫుల్ టికెట్ తీసుకుంటూ దోపిడీ చేస్తున్నారంటూ తెలంగాణ ఆర్టీసీ మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి కడ్తల్‌కు సాధారణ రోజుల్లో రూ.70 ఉంటే పండుగ స్పెషల్ బస్సులు అని రూ.120.. అదే కల్వకుర్తికి సాధారణ రోజుల్లో రూ.140 ఉంటే పండుగ స్పెషల్ బస్సులు అని రూ.220 వసూలు చేస్తున్నారంటూ.. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఎంతో మంది సోషల్ మీడియా వేదికగా గోడు వెల్లబోసుకుంటున్నారు. కొన్ని బస్సుల్లో అయితే.. దాదాపు 50 నుంచి 80 శాతం మేర అధికంగా వసూలు చేస్తుండటం గమనార్హం. అందుకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. అయితే.. గతంలోనూ పలు పండగల విషయంలో ఇలాగే ఆర్టీసీలో అడ్డగోలుగా ఛార్జీలు పెంచేస్తున్నారంటూ ప్రయాణికులు గగ్గోలు పెడితే.. తమకు చట్టప్రకారం పెంచే హక్కు ఉందంటూ ఉన్నతాధికారులు ప్రజలకు ఏమాత్రం అర్థకాని లాజిక్‌లు చెప్తూ తప్పించుకునే ప్రయత్నాలు చేశారు. కాగా.. ఇప్పుడు కూడా అదే రిపీట్ చేస్తారనటంలో ఏలాంటి అనుమానమూ లేదు.

# నోటీసులతో హైడ్రా సరేనా

హైదరాబాద్, జనవరి 11, హైడ్రా అధికారులు తొలుత హడావిడి చేశారు. దానిని చూసి అందరూ నిజమేనని అనుకున్నారు. ఇక హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలన్నీ కూలిపోతాయని భావించారు. కానీ అది భ్రమేనని తేలింది. ఎందుకుంటే అనేకమంది రాజకీయ నాయకులు అక్రమ కట్టడాల జోలికి ఇక హైడ్రా వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. బిల్డర్లు, సాధారణ ప్రజలకు చెందిన ఆస్తులపై మాత్రమే హైడ్రా బుల్ డోజర్లు దూసుకెళుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే కొత్తలో హైడ్రా అధికారులు చూపిన ఉత్సాహం మాత్రం ఇప్పుడు కనిపించడం లేదు. పైగా రాజకీయ నేతల ఆక్రమణలను కూడా వదిలేది లేదని చెప్పిన అధికారుల కనీసం వాటికి నోటీసులు ఇచ్చే ప్రయత్నం కూడా చేయకపోవడంతో వాటి కూల్చివేతలు భ్రమేనని తేలింది.. ఒవైసీకి చెందిన కళాశాల అక్రమ నిర్మాణమని గతంలో హైడ్రా అధికారులు ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ నేత మల్లారెడ్డికి చెందిన కళశాల భవనాలు కూడా ఆక్రమణ చేసినవేనని నిర్ధారించినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. కానీ కళాశాలలకు సెలవుల సమయంలో వాటిని కూల్చివేస్తామని, విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం కూల్చివేయడం లేదని నాలుగైదు నెలల క్రితం ప్రకటించారు. జనం కూడా నిజమేనని అనుకున్నారు. ఇది రాజకీయంగా కూడా విమర్శలు పెద్దయెత్తున విమర్శించాయి. ఒవైసీ బ్రదర్స్ కూడా హైడ్రాపై నిప్పులు చెరిగారు. చెరువులను ఆక్రమించి నిర్మించారనుకుంటే ముందు సచివాలయాన్ని కూల్చివేయాలని కూడా వారు సవాల్ విసిరారుఅయితే ఇటీవల కాలంలో ఒవైసీ సోదరులు అధికార కాంగ్రెస్ కు దగ్గరయ్యారు. రేవంత్, ఒవైసీ సోదరులు కలసి ఈ మధ్య ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలోనే పాతబస్తీకి చెందిన ఎంఐఎం ఎమ్మెల్యేలతో తాను సచివాలయంలో సమావేశమై అక్కడి సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. అంత వరకూ ఓకే కానీ, ఎన్నికల వరకే రాజకీయాలు అని, తర్వాత తామంతా భాయ్.. భాయ్ అని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించడంతో ఇక హైడ్రా బుల్ డోజర్ రాజకీయ నేతల అక్రమ నిర్మణాల వైపు వెళ్లదని చూచాయగా అర్థమయింది. దీంతో పాటు ప్రయివేటు సంస్థలకు చెందిన ఆస్తులపైనే ఎక్కువ దృష్టిపెడుతూ తామేంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు బిల్డప్ ఇస్తుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. హైడ్రాకు కూడా రాజకీయ రంగు పులుముకుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అలాగే మల్లారెడ్డి కళాశాల విషయంలోనూ అదే జరగొచ్చు. అందుకే హడావిడిగా చేసే ఆర్భాటపు ప్రకటనలను నమ్మితే ఇలాగే ఉంటుందని సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. ఎఫ్.టి.ఎల్. బఫర్ జోన్ పరిధిలో ఉన్నవాటిని కూల్చివేస్తామన్న హైడ్రా అధికారులు ఇప్పుడు పీచే ముఢ్ అన్నట్లుగానే కనపడుతుంది.

# ఆగని సైబర్ దాడులు

ముంబై, జనవరి 11, (న్యూస్ పల్స్) మోసగాళ్లు సాంకేతికతను తమకు అనుకూలంగా మలుచుకుని ప్రజలను మోసం చేసి సొమ్ము దోచుకుంటున్నారు. తాజాగా భారత్‌లో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో ముంబైకి చెందిన ఓ వృద్ధురాలు రూ.1.5 కోట్లు పోగొట్టుకుంది. దక్షిణ ముంబైకి చెందిన 78 ఏళ్ల వృద్ధురాలు. ముంబై అత్యంత ప్రసిద్ధ ఆర్కిటెక్ట్ బంధువు. తనపై మనీ ఫ్రాడ్ ఫిర్యాదు అందిందని పేర్కొంటూ మోసానికి పాల్పడ్డాడు. యుఎస్ నుండి తన కుమార్తెకు ఆహారం పంపడానికి ఒక వృద్ధ మహిళ కొరియర్ సర్వీస్‌ను ఉపయోగించడంతో స్కామ్ చేశారు. వృద్ధురాలు కొరియర్ చేయడానికి ప్రయత్నించగా, మరుసటి రోజు ఆమెను సంప్రదించిన వ్యక్తి తాను కొరియర్ కంపెనీ నుండి మాట్లాడుతున్నానని చెప్పాడు.వృద్ధురాలు అక్రమంగా సరుకులు రవాణా చేస్తుందని మోసగాడు భయపెట్టాడు. అలాగే వృద్ధురాలి పేరిట ఉన్న పార్శిల్‌లో వృద్ధురాలి ఆధార్ కార్డు, గడువు ముగిసిన పాస్‌పోర్టు, క్రెడిట్ కార్డు, 2000 అమెరికన్ డాలర్లు, అక్రమ వస్తువులు ఉన్నాయని తెలిపారు. అంతే కాకుండా వృద్ధురాలిపై మరికొన్ని ఆరోపణలు చేశాడుఆ తర్వాత వృద్ధురాలి నుంచి డబ్బులు వసూలు చేయాలనే లక్ష్యంతో మోసగాళ్లు పలు శాఖల ఉన్నతాధికారులను సంప్రదించారు. ఆడియో కాల్‌తో పాటు, ఉన్నతాధికారుల వేషధారణతో వీడియో కాల్ ద్వారా వృద్ధురాలిని సంప్రదించారు. ఆ తర్వాత అరెస్ట్ రిపోర్టుతో సహా పలు పత్రాలను బెదిరించారు. దీంతో భయపడిన వృద్ధురాలు వారి సూచనల మేరకు రూ.1.51 కోట్లను మోసగాళ్లకు పంపించింది. ఇలాంటివి దేశంలో ఎన్నో జరుగుతున్నాయి. మీ బ్యాంకు ఏటీఎం బ్లాక్ అయ్యిందనే, లేక కేవైసీ పేరుతో ఇలా రకరకాల సాకులు చెబుతూ జనాలను నిలువునా దోచుకుంటున్నారు.ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు జరుగుతున్నాయి. అందువల్ల, ఎవరైనా మిమ్మల్ని ఈ విధంగా సంప్రదిస్తే, ఏ కారణం బ్యాంక్ ఖాతా వివరాలు, డబ్బు లావాదేవీలు వంటి వివరాలు చెప్పవద్దు. పోలీసులు, ఆదాయపన్ను అధికారులమంటూ కాల్స్ చేసిన స్పందించవద్దు. ముఖ్యంగా బ్యాంకుల పేరుతో ఎవరు కాల్ చేసి వివరాలు అడిగినా ఎట్టి పరిస్థితుల్లో చెప్పవదని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే కేవైసీకి సంబంధించి వివరాలు, ఓటీపీలు అస్సలు చెప్పకండి. లేకుంటే తీవ్రంగా మోసపోయే ప్రమాదం ఉంది.

# కార్పొరేషన్ గా కొత్త గూడెం

ఖమ్మం, జనవరి 11, లంగాణలో కొత్త కార్పొరేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే.. రాష్ట్రంలో 13 నగరపాలక సంస్థలుండగా.. తాజాగా కొత్తగూడెంను కూడా కార్పొరేషన్‌గా ప్రమోట్ చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే.. ప్రస్తుతం మున్సిపాలిటీలుగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచలతో పాటుగా 4 మండలాల్లోని 35 గ్రామ పంచాయితీలను కొత్తగా ఏర్పాటుచేయబోయే కార్పొరేషన్‌లో విలీనం చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.భారత జనగణన గణాంకాల ప్రకారం కొత్తగూడెం మున్సిపాలిటీ జనాభా మొత్తం 1,88,191 (పురుషులు 93,300, స్త్రీలు 94,891) ఉండగా.. పాల్వంచ పరిధిలోనూ లక్ష మందికిపైగా జనాభా నివసిస్తున్నారు. అయితే.. సుజాతనగర్ మండలంలోని ప్రతిపాదిత 7 పంచాయతీల పరిధిలో 11,124, చుంచుపల్లిలోని 14 పంచాయతీల పరిధిలో 41,860, లక్ష్మీదేవిపల్లి మండలంలోని 10 పంచాయతీల్లో 21,432, పాల్వంచలోని నాలుగు పంచాయతీల్లో 5,903 మంది నివసిస్తున్నారు. రెండు మున్సిపాలిటీలతోపాటు పంచాయతీలు కలిపితే మొత్తం జనాభా సుమారు 4 లక్షల వరకు చేరే అవకాశం ఉంది. కొత్తగూడెంను కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలిస్తోంది. జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను నగర పాలక సంస్థగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికే పలుమార్లు సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి కోరగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నట్లు తెలిసింది.కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తే.. ఆ ప్రాంతానికి మహర్దశ వచ్చే అవకాశాలున్నాయని స్థానికులు భావిస్తున్నారు. తెలంగాణకు సిరులగని అయిన సింగరేణికి కొత్తగూడెం హెడ్ క్వార్టర్స్‌గా ఉండగా.. కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంతో పాటు స్పాంజి ఐరన్ ఇండియా లిమిటెడ్ లాంటి ప్రముఖ కంపెనీలతో పాల్వంచ ప్రాంతం ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఉన్నప్పటికీ.. ఆ ప్రాంతం గత పదేళ్లలో అనుకున్నంత అభివృద్ధికి నోచుకోకపోవటం గమనార్హంభద్రాద్రి జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రేవంత్ రెడ్డి సర్కార్.. రాష్ట్రానికి కొత్త ఎయిర్‌పోర్టులు తీసుకొచ్చే క్రమంలో కొత్తగూడెంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కొత్తగూడెంకు రైల్వే స్టేషన్ ఉండగా.. ఎయిర్ పోర్టు కూడా వస్తే జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగవటమే కాకుండా.. ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ పెరిగి, మరిన్ని కంపెనీలు కూడా వచ్చే అవకాశం ఉందని భావిస్తోంది. ఫలితంగా అభివృద్ధి కూడా అంతే వేగంగా జరుగుతుందని యోచిస్తోంది. ఈ క్రమంలో.. రెండు మున్సిపాలిటీలను కలిపేసి కార్పొరేషన్‌గా ప్రమోట్ చేయటం వల్ల ఆ ప్రాంతానికి మహర్ధశ పట్టనుందని స్థానిక ప్రజలు భావిస్తున్నారుమరోవైపు.. కాంగ్రెస్ పార్టీకి కంచు కోటగా మారిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి కేవలం ఒక్క సీటే వస్తుండటం గమనార్హం. అందులోనూ.. ఈసారి గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ కండువా కప్పుకోవటంతో.. ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ మయంగా మారిపోయింది. దీంతో.. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారింది ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తేనే.. ఖమ్మం జిల్లాపై పట్టు కోల్పోకుండా ఉండొచ్చన్నది కాంగ్రెస్ యోచన. ఇందులో భాగంగానే.. కొత్తగూడెంలో కొత్త ఎయిర్ పోర్టు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే వలస వెళ్లిన పాల్వంచ ప్రాంతంలోని ప్రజలు తిరిగి స్వగ్రామాలకు చేరుకునే అవకాశాలు కూడా ఉన్నాయి.

కార్పొరేషన్‌లో విలీనానికి అవకాశమున్న గ్రామాలుచుంచుపల్లి మండలంలోని 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, బాబు క్యాంప్, చుంచుపల్లి (పిటి), ధన్‌బాద్, గౌతంపూర్, ఎన్‌కే.నగర్ (బదావత్ తండా), నంద తండా, పెనుబల్లి, ప్రశాంతినగర్, రామాంజనేయ కాలనీ, రుద్రంపూర్, వెంకటేశ్వరకాలనీ, విద్యానగర్ కాలనీలక్ష్మీదేవిపల్లి మండలంలోని అశోక్‌నగర్ కాలనీ, చాతకొండ (ఆర్), హమాలీకాలనీ, లక్ష్మీదేవిపల్లి, లోతువాగు, ప్రశాంత్ నగర్, సంజయ్ నగర్, సాతివారిగూడెం, శేషగిరినగర్, శ్రీనగర్ కాలనీపాల్వంచ మండలంలోని బసవతారక కాలనీ, జగన్నాథపురం, కేశవపురం, లక్ష్మీదేవిపల్లి (ఎస్) సుజాతనగర్ మండలంలోని 2ఇంక్లైన్ (హెడ్ క్వార్టర్), కోమటిపల్లి, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకులగూడెం, సుజాతనగర్

# అన్ని పార్టీలు బల్దియాపై గురి...

హైదరాబాద్, జనవరి 11, హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పటి నుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది.ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్ మేయర్ పీఠం కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని సీట్లన్నీ గెలుచుకున్న బీఆర్ఎస్..అదే సత్తా చూపించి ఉఊఓఅ ఎన్నికల్లో కూడా పైచేయి సాధించాలని ప్లాన్ చేస్తోంది. అర్బన్ ఏరియాల్లో పట్టున్న బీజేపీ ఈసారి బల్దియా ఎన్నికలపై పెద్ద కసరత్తే చేస్తోంది. ఇక పాత పట్నంలో బలంగా ఉన్న ఎంఐఎం మేయర్ పీఠం విషయంలో కింగ్ మేకర్‌గా ఉండేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది.అధికారంలోకి వచ్చినప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌పై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి..గ్రేటర్ హైదరాబాద్‌లో పొలిటికల్ వ్యవహారాలను తన కంట్రోల్‌లోకి తెచ్చుకునేందుకు వ్యూహాలు రచిస్తూనే ఉన్నారు. హస్తం పార్టీ హైదరాబాద్‌లో బలహీనంగా ఉండటంతో..గ్రేటర్ పరిధిలోని కొంతమంది నేతల చేరికలతో బలోపేతం చేసే ప్రయత్నం చేశారు. ఉఊఓఅ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే హస్తం గూటికి చేరారు.మేయర్ పీఠాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్. బడ్జెట్‌లో ప్రత్యేకంగా 10 వేల కోట్లు కేటాయించి..మూసీ సుందరీకరణ వంటి అంశాలతో ముందుకు వెళ్తున్నారు. మరోవైపు పొలిటికల్‌గా కూడా..ఆచితూచి వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం సపోర్ట్ లేనిదే వర్కౌట్ అయ్యే పనికాదనే ఆలోచనతో..వారితో సఖ్యతగా ఉంటున్నారు. ఎంఐఎంతో కలుపుకొని వెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.ఇప్పటికే పార్టీ క్యాడర్‌ను కూడా అప్రమత్తం చేసే దిశగా..పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వరుస సమీక్షలు చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 150 డివిజన్లకు గాను..40 డివిజన్లకుపైగా ఓల్డ్ సిటీలోనే ఉంటాయి. ఇవన్నీ కూడా ఎంఐఎంకు కంచుకోటగా ఉంటాయి. మ్యాజిక్ ఫిగర్ 75ను అందుకోవాలంటే కాస్త కష్టమయ్యే పనే. అందుకే అవసరమైతే ఎన్నికల ఫలితాల తర్వాత ఎంఐఎంతో కలిసి అయినా సరే మేయర్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ గట్టి కసరత్తు చేస్తుంది.ఇక రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ కూడా వ్యూహ ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో నగర ఓటర్లు కచ్చితంగా తమవైపే ఉంటారని ఆశలు పెట్టుకుంటుంది.ఒకవేళ మేయర్ పీఠం దక్కకపోయినా..కింగ్ మేకర్‌గా ఉండాలని ఆలోచనలో బీఆర్ఎస్ ఉంది. ఇక మరో ప్రధాన పార్టీ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ పీఠంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. గత ఎన్నికల్లో చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించిన కమలం పార్టీ..ఈసారి మరింత గట్టిగా పనిచేసి..గతంలో కంటే ఎక్కువ సీట్లు సాధించాలని చూస్తోంది.ఉఊఓఅ ఎన్నికల్లో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ సీట్లు రాకపోతే..మేయర్ పీఠం విషయంలో హంగ్ తప్పనిసరి. అప్పుడు కాంగ్రెస్, ఎంఐఎం ఒకటైతే.. అనివార్యమైతే బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపే అవకాశం లేకపోలేదనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జరుగుతోంది. ఎన్నికల తర్వాత వచ్చే సీట్లను బట్టి పొలిటికల్ పార్టీల స్టాండ్ మారే అవకాశం ఉంది.ఇప్పటికైతే కాంగ్రెస్, ఎంఐఎం ఒకే దారిలో నడుస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎడమొహం, పెడమొహంగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు ఉఊఓఅ ఎన్నికల ఫలితాల తర్వాత హంగ్ వస్తే మాత్రం..మేయర్ పీఠం కోసం ఒకటి కాక తప్పదన్న చర్చ జరుగుతోంది. చూడాలి మరి మేయర్ పీఠం దక్కించుకునే విషయంలో ఏ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధిస్తుందనేది.

# వైరా రిజిస్ట్రేషన్ ఆఫీసులో అర్థరాత్రి రిజిస్ట్రేషన్లు

ఖమ్మం, జనవరి 11, కేరోజు 99 రిజిస్ట్రేషన్లు.. అది కూడా రాత్రిపూట.. ఇంతకీ ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది? కోట్ల విలువైన భూమి.. రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్ అయింది. ఇలా ఒకటి కాదు రెండు కాదు 99 దాకా రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. రాత్రిపూట ఈ వ్యవహారం జరగడం అనుమానాలకు తావిస్తోంది. ఇలా రిజిస్ట్రేషన్ అయిన భూమి విలువ దాదాపు వందల కోట్లు ఉంటుంది. ఈ సంఘటన జరిగిన వెంటనే రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిస్పందించారుఉమ్మడి ఖమ్మం జిల్లనుంచి భట్టి విక్రమార్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ఉన్నారు. వీరిలో భట్టి విక్రమార్క సొంత మండలం అయిన వైరాలో 99 రిజిస్ట్రేషన్లు ఒక్కరోజు రాత్రి పూర్తి కావడం అనుమానాలకు తావిస్తోంది.. వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం వేదికగా రాత్రి సమయంలో ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ వ్యవహారం రిజిస్ట్రేషన్లు స్టాంపులు శాఖలో కలకలం రేపుతోంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం లో ఆమోదం పొందని స్థిరాస్తి ప్లాట్లకు 99 రిజిస్ట్రేషన్లు చేయడం విశేషం. వైరా అసెంబ్లీ నియోజకవర్గంగా ఉంది. ఇది ఖమ్మం నగరపాలక సంస్థకు దగ్గర్లోనే ఉంటుంది. వైరా పురపాలక సంఘంగా ఏర్పడింది. వైరా నియోజకవర్గ పరిధిలో కొనిజర్ల మండలం ఉంటుంది. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఈ మండలంలో భూములకు విపరీతమైన ధరలు ఉన్నాయి. ఈ మండలంలో అనేకంగా స్థిరాస్తి వెంచర్లు ఉన్నాయి. కొన్ని వెంచర్ల నిర్వాహకులు ఎల్ ఆర్ ఎస్ పథకానికి దరఖాస్తు చేసుకున్నా అనుమతులు ఇంకా రాలేదు. అయితే క్రమబద్ధీకరణకు అనుమతులు లభించని ప్లాట్లకు వైరా సబ్ రిజిస్ట్రార్ ఏకంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడం సంచలనం కలిగిస్తోంది. కొణిజర్ల మండలంలో తనికెళ్ళ, అమ్మపాలెం గ్రామాల్లో విస్తారంగా వెంచర్లు ఉన్నాయి. ఇక్కడ భూమికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ ఏర్పాటుచేసిన వెంచర్లలో సరైన నిబంధనలు పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి.. గత ప్రభుత్వం అనుమతి పొందని లేఅవుట్లలో స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయకుండా నిబంధనలు విధించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా కొనసాగిస్తోంది..

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. ఇప్పటివరకు 4.50 లక్షల దరఖాస్తులను పూర్తి చేసామని అధికారులు చెబుతున్నారు.. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిటిసిపి, రెరా అనుమతులు పొందిన వెంచర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది..ఎల్ ఆర్ ఎస్ లేకపోయినప్పటికీ గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేయడం అనుమానాలకు తావిస్తోంది. దీని వెనక భారీగానే నగదు చేతులు మారిందని తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రంగంలోకి దిగారు.. రిజిస్ట్రేషన్ లపై ఆరా తీశారు . ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని డిఐజికి ఆదేశాలు జారీ చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే రెవెన్యూ శాఖలో ప్రక్షాళన మొదలుపెట్టారు.. దాదాపు అందరి అధికారులను బదిలీ చేశారు. చాలాకాలం ఒకే చోట పని చేసిన అధికారులను మరో ప్రాంతానికి ట్రాన్స్ఫర్ చేశారు. రెవెన్యూ విభాగంలో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేశారు. ఇంత చేస్తున్నప్పటికీ ఇలా జరగడం రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులకు మింగుడు పడటం లేదు.

# మంచుకొండల్లో పొంచి ఉన్న ముప్పు

టిబెట్ భూభాగంతో ఉన్న టెక్టోనిక్ ప్లేట్లతో సంఘర్షిస్తున్నాయి. ఇప్పటికే, ఏడాదికి 2 మిల్లీ మీటర్ల చొప్పున భారత భూభాగం కూడా తగ్గుతున్నట్లు ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది, రాబోయే కాలంలో మరింత భయానక భూకంపాలకు కారణమవుతుందా..? హిమాలయాలకు భూకంపం టెన్షన్ పట్టుకుంది. చల్లని వాతావరణాన్ని పంచే హిమాలయాల భూగర్భంలో తీవ్రమైన యుద్ధమే జరుగుతుంది. ఖండాలను చీల్చే టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఘర్షణతో.. హిమాలయన్ రీజన్ భయంకరమైన భూకంపాలకు కారణం అవుతోంది. అసలు, ఆ ప్రాంతంలో ఏం జరుగుతోంది..? టెక్టోనిక్ ప్లేట్ల సంఘర్షణతో వచ్చిన టెన్షన్ ఏంటీ..? రీసెంట్‌గా వచ్చిన టిబెట్ భూకంపానికి మించిన డేంజర్ భవిష్యత్తును భయపెడుతోందా..?విశ్వంలోనే అత్యంత అందమైన గ్రహం భూమి అంటారు. భూమిపైన వాతావరణం ఎంత అందంగా ఉంటుందోనని సంబరపడతారు. అయితే, భూమి లోపల ఏం జరుగుతుందో అందరికీ తెలియకపోవచ్చు. ఈ అందం కింద ఎంత విధ్వంస్వం దాగుందో అర్థం కాదు. ఇక, భారతదేశానికి తలమానికైన అద్భుత హిమాలయ ప్రాంతం కింద కూడా ఘోరమైన సంఘర్షణ జరగుతోందని ఎప్పటి నుండో అధ్యయనాలు చెబుతున్నాయి. హిమాలయన్ రీజన్‌లో రెండు భూ ఫలకాల మధ్య భారీ వత్తిడి పెరుగుతోంది. ఇది, భారత్, టిబెట్ దేశాల్లో దేనినైనా చీల్చడానికి అవకాశం ఉంది.ఈ ఏరియాలో రాబోయే తీవ్రమైన భూకంపాలతో ఒక ప్రాంతం సర్వనాశనమయ్యే ప్రమాదమూ ఉందనేది నిపుణుల అభిప్రాయం. ఇదే ఇప్పుడు భారత్‌ను కూడా భయపెడుతోంది. కొన్నేళ్లుగా హిమాలయన్ ప్రాంతంలో టెక్టోనిక్ ప్లేట్ల మధ్య మార్పులు కనిపిస్తున్నాయి. చాప కింద నీరులా.. ఈ ప్రాంత భూభాగం కింద టెక్టోనిక్ ప్లేట్లు జారిపోతూ ఉన్నాయి. టిబెట్, నేపాల్ సరిహద్దుల్లో భారీ భూకంపం సంభవించింది. జనవరి 7న సంభవించిన ఈ భయానక భూకంపంలో 126 మంది ప్రాణాలు కోల్పోగా.. 188 మంది గాయపడ్డారు. 400 వందల కంటే ఎక్కువ మంది భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. ఇప్పటికీ ఇక్కడ సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇది ఎంత తీవ్రంగా వచ్చిందంటే.. 24 గంటల్లో దాదాపు 20 సార్లు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.1గా నమోదైంది. జనవరి 8న సంభవించిన భూకంప తీవ్రంత 6.58గా నమోదయ్యింది.వరుసగా వచ్చిన ప్రకంపనల్లో 10 సార్లు 6 తీవ్రతతో భూకంపం ఏర్పడింది. భూకంపాలకు ప్రసిద్ధి చెందిన టిబెట్ ప్రాంతంలో గత సంవత్సరం 100 భూకంప సంఘటనలు జరగ్గా అవి కనీసం 3.0 తీవ్రతతో వచ్చినట్లు డేటా వెల్లడిస్తోంది. అయితే, 7 తీవ్రతకు మించిన చాలా తక్కువే అయినప్పటికీ.. 20వ శతాబ్దం ప్రారంభం నుండి ఇప్పటి వరకూ 7 తీవ్రత దాటిన భూకంప సంఘటనలు 9 సార్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, ఇప్పుడొచ్చిన భూకంప తీవ్రతకు వెయ్యి కంటే ఎక్కువ ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలో భారీ జనసాంద్రత ఉండటం వల్ల వందల మంది నిరాశ్రయులుగా మారాల్సి వచ్చింది.ఈ భూకంప ప్రభావం ఒక్క టిబెట్‌ను మాత్రమే కాకుండా నేపాల్, భారత్‌లలో కూడా కనిపించింది. టిబెట్‌లోని డింగ్రీ కౌంటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత అధికంగా ఉంది. ఈ భూకంపం ధాటికి భవనాలు నేలమట్టం అయ్యాయి. టిబెట్ సరిహద్దుని ఆనుకుని ఉన్న నేపాల్‌లోని 7 జిల్లాల్లో భూకంపం ప్రభావం కనిపించింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలోని లబుచె ప్రాంతంలో ఉదయం 6.30 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం ఆరుసార్లు భూకంపం వచ్చినట్టు చెప్పారు., టిబెట్‌లో విధ్వంసం సృష్టించిన ఈ భూకంప కేంద్రం.. నేపాల్-భూటాన్ సరిహద్దు వైపు ఉన్న ఎవరెస్టు శిఖరానికి కేవలం 80 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

భూకంపానికి కారణమైన కేంద్ర భాగం.. భూ ఉపరితలం నుంచి 10 కి. మీ. లోతులో ఉన్నట్లు భూకంప పరిశీలకులు వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని లాసా రీజియన్ అని పిలుస్తున్నారు. ఇది హిమాలయన్ ప్రాంతంలో భౌగోళికంగా అత్యంత కీలకమైన ప్రదేశంగా ఉంది. ఈ ప్రాంతానికి ఉత్తరం వైపు.. బ్యాంగాంగ్- నుజియాంగ్ జోన్ ఉండగా.. దక్షిణం వైపు ఇండస్-యార్లింగ్ జాంగ్బో సరిహద్దులు ఉంటాయి.ఇక్కడ భూ ఫలకాల్లో మార్పులు సంభవించినప్పుడల్లా దాని ప్రభావం ఈ ప్రాంతంపై పడుతుంది. అందుకే తరచూ ఇక్కడ భూకంపాలు ఏర్పడుతుంటాయి. గత రికార్డులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసాయి. ఇండియన్, యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య నిత్యం జరుగుతున్న ఘర్షణలు ఈ భూకంపాలకు కారణం అవుతున్నాయి. అయితే, భవిష్యత్‌లో మరింత ప్రమాదకరమైన భూకంపాలు వచ్చే అవకాశమున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.పురాతన ఖండం గోండ్వానాలో ఒక భాగంగా ఉన్న భారత భూభాగం.. 10 కోట్ల సంవత్సరాల క్రితం ఇతర శకలాల నుంచి భారత టెక్టోనిక్ ప్లేట్‌గా విడిపోయింది. ఇది ఉత్తరం వైపు కదులుతూ వచ్చింది. ప్రస్తుతం, భారత ఉపఖండం, దక్షిణ చైనా, పశ్చిమ ఇండోనేషియాలో కొంత భాగం వరకు ఈ ప్లేట్ విస్తరించి ఉంది. ఇది 5 కోట్ల సంవత్సరాల నుంచి యురేషియన్ ప్లేట్‌ను ఢీ కొడుతూ ఉంది. దాని ప్రభావంతోనే హిమాలయ శ్రేణులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం, ఈ టెక్టోనిక్ ప్లేట్.. యురేషియన్ ప్లేట్ వైపు ఏటా 5 సెంటీమీటర్ల మేర కదులుతూ.. దాన్ని ఢీకొంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.గతంలో కూడా హిమాలయాల మధ్య భాగాలైన నేపాల్‌లోని ఖాట్మండు, భారతదేశంలోని డెహ్రా డూన్ మధ్య గతంలో పెద్ద భూకంపం సంభవించిందనీ.. భవిష్యత్తులో అలాంటి మరో భూకంపం వస్తుందని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. అందులోనూ, భారతీయ టెక్టోనిక్ ప్లేట్ హిమాలయాల క్రింద సంవత్సరానికి 1.8 సెంటీమీటర్ల మేర ఒక పెద్ద లోపంతో కదులుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఆసియా వైపు భారతదేశ మొత్తం ప్లేట్ కదలికలో మూడింట ఒక వంతు. అంటే, సంవత్సరానికి 5.4 సెంటీమీటర్లు. ఇక, మిగిలిన ప్లేట్ కదలిక రేటు టిబెట్, మధ్య ఆసియాలోని ఇతర ప్రాంతాల్లో ఉంది.

అయితే, ఈ టెక్టోనిక్ ప్లేట్ల కదలిక ప్రభావంతో భవిష్యత్తులో హిమాలయ ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, నేపాల్ వంటి పలు ప్రాంతాల్లో కూడా తీవ్రమైన భూకంప ప్రభావం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రభావం భారత ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. టెక్టోనిక్ ప్లేట్ల నిరంతరం వస్తున్న ఈ మార్పులు? టిబెట్‌తో పాటు భారత భూభాగాన్ని కూడా విడదీస్తూ చివరికి భూమి మధ్యలో ఉన్న మెన్టెల్‌లో కలిపేస్తాయనే సిద్ధాంతం కూడా గట్టిగానే వినిపిస్తుంది.హిమాలయ ప్రాంతంలో భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ.. భూమి కింద ఉన్న టెక్టోనిక్ ప్లేట్లు మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నాయి. ఏ ఖండాన్ని ఎటు చీల్చుతాయో తెలియకుండా కలవరం పుట్టిస్తున్నాయి. దేని కోసం మనుషులు ఘర్షణ పడుతున్నారో.. అది శాశ్వతం కాదని చెప్పకనే చెబుతున్నాయి.

# ఏపీకి 50 మంది ఎమ్మెల్యేలు

విజయవాడ, జనవరి 11, ఏపీలోనియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కదలిక వచ్చింది. 2026 నాటికి నియోజకవర్గాల పునర్విభజన ఖాయమని తేలింది. వాస్తవానికి 2014 రాష్ట్ర విభజన తోనే నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. ఇప్పుడు ఉన్న సంఖ్య పెరగాలి. కానీ అలా జరగలేదు. దానికి రకరకాల కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా జన గణనతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం తరువాతనే పునర్విభజన అని సంకేతాలు వచ్చాయి. అయితే జన గణనతో పాటు మహిళా బిల్లు ఆమోదం పొందనుండడంతో.. 2026 లో నియోజకవర్గాల పునర్విభజన అని స్పష్టమౌతోంది. అదే జరిగితే ఏపీలో అదనంగా మరో 5 నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో అసెంబ్లీ స్థానాల సంఖ్య 225 కు పెరగనున్నాయి. అదే జరిగితే రాజకీయ ఆశావహులకు కొంతవరకు అవకాశాలు మెరుగుపడినట్టే.2014లో రాష్ట్ర విభజన జరిగింది. 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25 పార్లమెంటు స్థానాలతో నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటయింది. ఇక తెలంగాణకు సంబంధించి 117 అసెంబ్లీ స్థానాలతో పాటు 17 పార్లమెంటు స్థానాలు మిగిలాయి. ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర విభజన జరగడంతో.. పాలనా వికేంద్రీకరణ అవసరమని అప్పటి విభజన బిల్లులో స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన తో నియోజకవర్గాల సంఖ్య పెరగాలని అందులో పొందుపరిచారు. కానీ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు. నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ 2026 నాటికి నియోజకవర్గాల పెంపు అనివార్యమని తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారంఏపీలో 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ప్రతి పార్లమెంటు స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ సీట్లు ఉంటాయి. ఈ లెక్కన 175 స్థానాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో.. ప్రతి లోక్సభ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ఆలోచన ఉంది. 2026 ద్వితీయార్థంలో పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కానుంది. వీలైనంత త్వరగా పునర్విభజన ప్రక్రియ పూర్తి చేసి కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రకటించాలని కేంద్రం భావిస్తోంది. కొద్ది రోజుల్లో జన గణనతో పాటు మహిళా బిల్లు కూడా ఆమోదం పొందనుంది. 2025లో జనగణను పూర్తిచేసి.. వెనువెంటనే మహిళా బిల్లును సైతం ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. అటు తరువాత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కానుంది.ప్రస్తుతం ఏపీలో టిడిపి, వైసిపి, జనసేన, బిజెపి, కాంగ్రెస్, వామపక్షాలు ఉన్నాయి. టిడిపి కూటమిలో బిజెపి, జనసేన ఉంది. ప్రతిపక్ష హోదా దక్కకుండా ప్రధాన ప్రతిపక్ష పార్టీ మాత్రం వైసిపి. అదే సమయంలో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు కూడా ఉన్నాయి. అయితే అన్ని పార్టీల్లో నాయకులు ఆశావహులుగా ఉన్నారు. ప్రధానంగా టిడిపి కూటమి, వైసీపీలో ద్వితీయ శ్రేణి నాయకులు సైతం చట్టసభలకు ఎన్నిక కావాలని భావిస్తున్నారు. ఒకవేళ పునర్విభజనతో 50 అసెంబ్లీ స్థానాలు పెరిగితే.. అన్ని పార్టీల్లో ఉన్న ఆశావహులకు చాన్స్ దక్కే అవకాశం ఉంది. అందుకే ఏపీ నేతలు నియోజకవర్గాల పునర్విభజనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2026 నాటికి ఇది కార్యరూపం దాల్చుతుందని తెలియడంతో సంతోషపడుతున్నారు

## ఢిల్లీ ఎన్నికల్లో ఓబీసీ ఫైట్

న్యూఢిల్లీ, జనవరి 11, (న్యూస్ పల్స్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 26 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కానీ అంతకు ముందే రాజధాని ఢిల్లీలో రాజకీయ గందరగోళం నెలకొంది. జాట్ కమ్యూనిటీని కేంద్రంలోని ఓబీసీ జాబితాలో చేర్చాలని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని నరేంద్ర మోడీని డిమాండ్ చేశారు.ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక లేఖ రాశారు. ఈ లేఖలో జాట్ కమ్యూనిటీని కేంద్రం ాఃఅ జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది మాత్రమే కాదు ప్రధాని మోడీ 'జాట్ సమాజానికి' ద్రోహం చేశారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీలో ఓబీసీ హోదా ఉన్న జాట్లను ఇతర అన్ని కులాలను కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చాలని కేజ్రీవాల్ అన్నారు.ఏ కులాన్ని అయినా ాఃఅ జాబితాలో చేర్చే ప్రక్రియ ఏమిటో తెలుసా.. సమాచారం ప్రకారం, ఏదైనా కులాన్ని ాఃఅ జాబితాలో చేర్చాలంటే లోక్‌సభ , రాజ్యసభలో ఒక బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తరువాత బిల్లు చివరకు రాష్ట్రపతికి వెళుతుంది. అక్కడి నుండి, రాష్ట్రపతి ఆమోదం పొందిన తరువాత ఆ బిల్లును అమలు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయబడుతుంది.దేశంలో కొత్త చట్టం తీసుకురావాలంటే లోక్‌సభ, రాజ్యసభలో బిల్లును ఆమోదించాల్సిన విధానం. అదేవిధంగా, ాఃఅలో కొత్త కులాన్ని చేర్చడానికి, బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా కొత్త చట్టాన్ని తీసుకురావాలి. ప్రభుత్వం ఏదైనా కులాన్ని ాఃఅలో చేర్చడానికి బిల్లు తీసుకురావాల్సి వస్తే, ముందుగా ఆ విషయంపై సాధారణ ప్రజలు, దాని నిపుణులు, తదితరులు అభిప్రాయాన్ని తీసుకుంటారు. అభిప్రాయాలను స్వీకరించిన తర్వాత అందులో వచ్చిన సూచనల ఆధారంగా నిపుణుల బృందం ద్వారా ప్రభుత్వం దానిని రూపొందిస్తుంది. ముసాయిదాను రూపొందించిన తర్వాత, దానిని న్యాయ మంత్రిత్వ శాఖకు పంపుతారు. అక్కడ బిల్లు చెల్లుబాటు, చట్టపరమైన అంశాలను పరిశీలిస్తారు.

# సినిమా



# గేమ్ ఛేంజర్ : రివ్యూ




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ శంకర్ కాంబినేషన్ లో భారీ అంచానలతో తెరకెక్కిన సినిమా గేమ్ ఛేంజర్. సంక్రాంతి కానుకగా నేడు ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా వచ్చింది. దిల్ రాజు భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందించాడు. కియరా అద్వాని, అంజలి ఫిమేల్ లీడ్స్‌గా నటించిన ఈ సినిమా ఎలా ఉందో చూద్దాం. విశాఖపట్నానికి కొత్త కలెక్టర్ గా వస్తాడు రామ్ నందన్ (రామ్ చరణ్). అంతకుముందే ఐపీఎస్ గ పనిచేసినా ఐ.ఏ.ఎస్ అవ్వాలని కలగని ఐ.ఏ.ఎస్ అవుతాడు. కాలేజ్ డేస్ లో దీపిక (కియరా అద్వాని)ని ప్రేమిస్తాడు రామ్ ఐతే మధ్యలో విడిపోయి అతను కలెక్టర్ అయ్యాక దీపిక దగ్గరవుతుంది. కలెక్టర్ అయిన రామ్ అక్కడ జరుగుతున్న అక్రమాలను ఆపాలని ట్రై చేస్తాడు ఈ క్రమంలో మంత్రి మోపిదేవి (ఎస్.జె సూర్య) తో తలపడతాడు. ఈ టైం లో మోపిదేవిపై రామ్ చేసుకోవడంతో సస్పెండ్ అవుతాడు. మరోపక్క బొబ్బిలి సత్యమూర్తి (శ్రీకాంత్)మృతితో మోపిదేవి సీఎం అయ్యే అవకాశం వస్తుంది. కాని రామ్ వల్ల అది పోతుంది. ఇంతకీ రామ్ కు సత్యమూర్తికి ఉన్న రిలేషన్ ఏంటి..? అప్పన్న కథ ఏంటి..? రామ్ నెక్ట్ ఏం చేశాడు అన్నది గేమ్ ఛేంజర్ కథ. శంకర్ సినిమా అంటే కోట్ల కొద్దీ బడ్జెట్ కంపల్సరీ దిల్ రాజు కూడా శంకర్ తో సినిమా అనుకున్నప్పుడే భారీ బడ్జెట్ ఫిక్స్ అయ్యాడు. గేమ్ ఛేంజర్ కథ కార్తీక్ సుబ్బరాజ్ అందించాడు. ఐతే ఈ కథ రెగ్యులర్ కథే. కొత్తగా ఏమి లేదు. కానీ ఈ కథకు శంకర్ దిల్ రాజు చేత దాదాపు 300 కోట్ల పైన బడ్జెట్ పెట్టించాడు. ఇక సినిమాలో కొన్ని మెరుపులు ఉన్నాయి. యాక్షన్ సీన్స్ ఇంకా విజువల్స్ సాంగ్స్ కోసం ఖర్చు పెట్టినదంతా తెర మీద కనిపిస్తుంది. ఐతే అసలు కథలో పెద్దగా మ్యాటర్ లేకపోవడం వల్ల ఇవన్నీ జస్ట్ ఓకే అనిపిస్తాయి. ఫస్ట్ హాఫ్ అంతా జస్ట్ యావరేజ్ గా అనిపిస్తుంది. సెకండ్ హాఫ్ లో అప్పన్న పాత్ర ఇంప్రెస్ చేస్తుంది. ఐతే ఆ పాత్ర నిడివి తక్కువ ఉండటం తో ప్రేక్షకులు నిరుత్సాహపడతారు. ఇక సినిమాలో రామ్ చరణ్ క్యారెక్టరైజేషన్ ముఖ్యంగా రాం నందన్ పాత్ర ఇంకాస్త బాగా రాసుకుంటే బాగుండేదని అనిపిస్తుంది. శంకర్ ఈమధ్య వచ్చిన సినిమాల కన్నా బెటరే కానీ తన మార్క్ గ్రిప్పింగ్ కానీ స్టోరీ టెల్లింగ్ కానీ కొరవడినట్టు అనిపిస్తుంది. కొత్త కథలతో పాన్ ఇండియా లెవెల్‌లో ప్రభంజనాలు సృష్టిస్తున్న ఈ టైం లో రొటీన్ స్టోరీతో అది కూడా రెగ్యులర్ ఫార్మెట్ స్క్రీన్ ప్లేతో రావడం డిజప్పాయింట్ చేస్తుంది. ఐతే మెగా ఫ్యాన్స్ అంతా ఫీస్ట్ గా భావించినా కామన్ ఆడియన్స్ కు గేం ఛేంజర్ కాస్త భారంగానే అనిపిస్తుంది.

# ఓటీటీలోకి వచ్చేసిన మరో మలయాళ బ్లాక్ బస్టర్..



ఎప్పటిలాగే ఈ శుక్రవారం (జనవరి 10) కూడా ఓటీటీల్లో పలు కొత్త సినిమాలు, ఆసక్తికర వెబ్ సిరీస్ లు స్ట్రీమింగ్ కు వచ్చేశాయి. అందులోనూ తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లిష్ సినిమాలు, సిరీస్ ఉన్నాయి. అయితే శనివారం నుంచి (జనవరి 11) మరో మలయాళ బ్లాక్ బస్టర్ మూవీ ఓటీటీలోకి వచ్చేసింది. మలయాళ బ్యూటీ, ఎక్స్ ప్రెషన్ క్వీన్ నజ్రియా నజీమ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం సూక్ష్మ దర్శిని. ఎంసీ జితిన్ తెరకెక్కించిన ఈ మిస్టరీ థ్రిల్లర్ మూవీలో జయ జయ జయ హే ఫేమ్ బాసిల్ జోసెఫ్ మరో కీలక పాత్రలో మెరిశాడు. గతేడాది నవంబర్ 22న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ గా నిలిచింది. థియేటర్ కు వచ్చిన ప్రేక్షకులకు ఫుల్ మీల్స్ అందించింది. ట్రేడ్ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. కేవలం రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ. 60 కోట్ల కలెక్షన్స్ సాధించి రికార్డు సృష్టించింది. మిస్టరీ థ్రిల్లర్ సీన్స్, గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే థియేటర్ లో ఆడియన్స్ ను కట్టి పడేసిన సూక్ష్మ దర్శిని సినిమా ఓటీటీలో రిలీజ్ కోసం చాలామంది ఎదురు చూస్తున్నారు. అందులో తెలుగు ఆడియెన్స్ కూడా ఉన్నారు. ఇప్పుడు వీరి నిరీక్షణకు తెరపడింది. సూక్ష్మ దర్శిని సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను డిస్నీప్లస్ హాట్ స్టార్ సొంతం చేసుకుంది. శనివారం అర్ధరాత్రి నుంచే ఈ మూవీని స్ట్రీమింగ్ కు తీసుకొచ్చింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ భాషల్లోనూ ఈ బ్లాక్ బస్టర్ మూవీ అందుబాటులో ఉంది. సూక్ష్మదర్శిని సినిమాలో నజ్రియా నజీమ్, బాసిల్ జోసెఫ్ అద్భుతంగా నటించారు. వీరితో పాటు అఖిలా భార్గవన్, మెరిన్ ఫిలిప్, పూజ మోహన్ రాజ్, దీపక్ పరంబోల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఏవీఏ ప్రొడక్షన్స్, హ్యాపీ హవర్స్ ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్లపై ఏవీ వినూప్, షైజు, సమీర్ ఈ సినిమాను నిర్మించారు. క్రిష్టో జేవియర్ సంగీతం అందించారు. మరి ఈ వీకెండ్ లో మంచి థ్రిల్లర్ సినిమాను చూడాలనుకుంటున్నారా? అయితే సూక్ష్మ దర్శిని మీకు మంచి ఛాయిస్ అని చెప్పవచ్చు.

# కీళ్ల నొప్పులపై సమంత పోస్ట్ వైరల్



హీరోయిన్ సమంత తన అభిమానులతో నిత్యం టచ్‌లో ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (ఎక్స్) వేదికగా రెగ్యులర్‌గా పోస్టులు పెడుతూ తన జీవితంతో ముడిపడిన కీలక వివరాలను అందరితో పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆమె ఇన్‌స్టాలో ఒక స్టోరీ పెట్టారు. ఇటీవలే తనకు చికెన్ గున్యా వచ్చిందని, దాని వల్ల అలుముకున్న కీళ్ల నొప్పుల నుంచి కోలుకుంటున్నానని సమంత వెల్లడించారు. ఓ వైపు చికెన్ గున్యా బారినపడినా.. జిమ్ చేయడాన్ని ఆమె ఆపలేదు. ఈ పోస్ట్‌లో తాను జిమ్ చేస్తున్న ఒక ఫొటోను సమంత జతపరిచారు. “చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్లనొప్పుల నుంచి కోలుకోవడంలోనూ చాలా ఫన్ ఉందండోయ్” అనే కామెంటుకు బాధతో కూడిన ఎమోజీలను సమంత జతచేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.దీన్ని చూసిన నెటిజన్లు వేగంగా స్పందిస్తున్నారు. సమంత త్వరగా చికెన్ గున్యా నుంచి, కీళ్ల నొప్పుల నుంచి కోలుకోవాలని కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఫిట్‌నెస్, డైట్‌లపై సమంత ఎక్కువ ఫోకస్ పెడుతుంటారు.

# “ఒక పథకం ప్రకారం” ట్రైలర్ విడుదల



143, బంపర్ ఆఫర్ లాంటి చిత్రాలతో ప్రామిసింగ్ హీరో అనిపించుకున్న సాయిరాం శంకర్ నటిస్తున్న మరో విభిన్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'.ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ‘ఓ మంచివాడి లోపల ఒక చెడ్డవాడు ఉంటాడు, ఓ చెడ్డవాడి లోపల చెడ్డవాడు మాత్రమే ఉంటాడు‘ అనే వాయిస్ ఓవర్‌తో మొదలవుతూ క్రైం, మర్డర్ కథనాలను చూపిస్తూ హీరోనే విలనా అనే సందేహంపై ముగించడం ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు వినోద్ కుమార్ విజయన్ ఈ చిత్రాన్ని తన వినోద్ విహాన్ ఫిలిమ్స్ బ్యానర్‌తో పాటు గార్లపాటి రమేష్ విహారి సినిమా హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ “ఇదొక విభిన్నమైన కథ. అడ్వకేట్ పాత్రలో సాయిరాం శంకర్, పోలీసు పాత్రలో సముద్రఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో ఉత్కంఠభరితంగా తీసుకెళ్ళే క్రైం, మిస్టరీ కథనాలతో ఆద్యంతం కట్టిపడేస్తుంది. రాహుల్ రాజ్, గోపి సుందర్ పాటలు - స్కోర్ అద్భుతంగా వచ్చాయి. చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని ఫిబ్రవరి 7న గ్రాండ్ రిలీజ్ చేయడానికి సిద్ధమవుతున్నాం”అని అన్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన ‘బ్లాక్ వారెంట్’..




మొత్తం మీద ఇవాళ ‘బ్లాక్ వారెంట్’ వెబ్ సిరీస్‌ను ఎంతోమంది నెట్‌ఫ్లిక్స్‌లో చూశారు. ‘బ్లాక్ వారెంట్’ వెబ్ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇవాళ (జనవరి 10) విడుదల అయింది. జైలు కేంద్రంగా సాగే ఈ కథలో బాలీవుడ్ ఐకాన్ దివంగత శశి కపూర్ మనవడు జహాన్ కపూర్ ప్రధాన పాత్రను పోషించారు. దీనికి విక్రమాదిత్య మోత్వానీ దర్శకత్వం వహించారు. సిధాంత్ గుప్తా, అనురాగ్ ఠాకూర్, పరంవీర్ సింగ్ చీమా కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ జర్నలిస్ట్ సునేత్రా చౌదరి, తిహార్ జైలు మాజీ సూపరింటెండెంట్ సునీల్ గుప్తాలు కలిసి రాసిన ‘బ్లాక్ వారెంట్ : కన్ఫెషన్స్ ఆఫ్ ఎ తిహార్ జైలర్’ పుస్తకం ఆధారంగా ఈ వెబ్ సిరీస్‌ను తీశారు. వాస్తవిక గాథలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. వాటినే కళ్లకు కట్టేలా ‘బ్లాక్ వారెంట్’ వెబ్ సిరీస్‌లో చిత్రీకరించారు. దీనికి సంబంధించిన ట్రైలర్‌ను జనవరి 3న విడుదల చేశారు. మొత్తం మీద ఇవాళ ‘బ్లాక్ వారెంట్’ వెబ్ సిరీస్‌ను ఎంతోమంది నెట్‌ఫ్లిక్స్‌లో చూశారు. వీరిలో పలువురు సోషల్ మీడియా వేదికగా తమదైన శైలిలో రివ్యూలు రాస్తున్నారు. వారి ప్రకారం.. బ్లాక్ వారెంట్ వెబ్ సిరీస్ పార్ట్ 1లో సునీల్ గుప్తా తిహార్ జైలులో పనిచేసిన తొలి నాలుగేళ్లలో జరిగిన సంఘటనల సమాచారం ఉంది. జైలులో ఉండే విధి విధానాలు, ఖైదీల సంక్షేమం కోసం అమలు చేసే సంస్కరణలు వంటి అంశాలను ఇందులో తెరకెక్కించినట్లు తెలిసింది. డైనమిక్ యంగ్ జైలర్ హోదాలో సునీల్ గుప్తా పాత్రలో జహాన్ కపూర్ చాలా బాగా నటించారనే టాక్ వినిపిస్తోంది. జైలులో ఖైదీల మధ్య జరిగే రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు, ఖైదీల మధ్య జరిగే ఘర్షణలు వంటి అంశాలు బ్లాక్ వారెంట్ వెబ్ సిరీస్‌లలో సవివరంగా చూపించబోతున్నారు. కరడుగట్టిన నేరస్తులను చూసిన తిహార్ జైలుతో ముడిపడిన స్టోరీ అంటే సహజంగానే అందరికీ ఆసక్తి కలుగుతుంది. అందుకే దీని వెబ్ సిరీస్‌లకు కూడా మంచి ఆదరణ లభించే అవకాశాలు ఉన్నాయి.

# ‘డాకు మహారాజ్’ ఘన విజయం సాధిస్తుంది



అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించబోతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో 'డాకు మహారాజ్'ను నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా ఆదివారం 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం శుక్రవారం రాత్రి హైదరాబాద్ లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా 'డాకు మహారాజ్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయనే పేరు వచ్చింది. ఇక ఇప్పుడు రిలీజ్ ట్రైలర్ అంతకుమించి అనేలా ఉంది. ‘వాడి ఒంటి మీద పదహారు కత్తి పోట్లు, ఒక బుల్లెట్ గాయం.. అయినా కిందపడకుండా అంత మందిని నరకాడం అతను మనిషి కాదు, వైల్డ్ యానిమల్‘ అనే డైలాగ్ తో బాలకృష్ణ పాత్ర ఎంత శక్తివంతంగా ఉండబోతుందో తెలిపారు. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలతో అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రాన్ని రూపొందించారని రిలీజ్ ట్రైలర్‌తో మరోసారి స్పష్టమైంది. ప్రీ రిలీజ్ వేడుకలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ “అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి.



# క్రీడలు



## రోహిత్ ముంగిట అరుదైన రికార్డు.. వన్డేల్లో మరో 134 రన్స్ చేస్తే చాలు!

**మరో 134 రన్స్ చేస్తే అత్యంత వేగంగా 11వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా అవతరణ**

**ఇప్పటివరకు 257 ఇన్నింగ్స్‌లలో 10,866 పరుగులు చేసిన రోహిత్**

**ఈ జాబితాలో 222 ఇన్నింగ్స్‌లలో ఈ ఫీట్ సాధించి టాప్‌లో ఉన్న కోహ్లీ**

**ఆ తర్వాతి స్థానంలో సచిన్ టెండూల్కర్ (276 ఇన్నింగ్స్)**

వన్డేల్లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరో అరుదైన రికార్డు ముంగిట ఉన్నాడు. హిట్‌మ్యాన్ మరో 134 రన్స్ చేస్తే... అత్యంత వేగంగా 11 వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా నిలవనున్నాడు. ప్రస్తుతం ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (222 ఇన్నింగ్స్) టాప్‌లో ఉండగా... సచిన్ టెండూల్కర్ (276 ఇన్నింగ్స్), రికీ పాంటింగ్ (286 ఇన్నింగ్స్), సౌరవ్ గంగూలీ (288 ఇన్నింగ్స్), జాక్ కలిస్ (293 ఇన్నింగ్స్) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఇక రోహిత్ ఇప్పటివరకు 257 ఇన్నింగ్స్‌లలో 10,866 పరుగులు చేశాడు. మరో 19 ఇన్నింగ్స్‌ల లోపే 134 రన్స్ చేసి, ఈ మైలురాయిని చేరుకుంటే మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానంలో నిలుస్తాడు. కాగా, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత్ వన్డే ఫార్మాట్‌లో ఆడనుంది. ఆసక్తికరంగా విరాట్ తన 11వేల పరుగుల మైలురాయిని టీమిండియా కెప్టెన్‌గా ఉన్న సమయంలోనే పూర్తి చేశాడు. ప్రస్తుతం వన్డే జట్టుకు నాయకత్వం వహిస్తూ రోహిత్ కూడా ఈ ఫీట్‌ను సాధించే అవకాశం ఉంది. ఇక 2007లో రోహిత్ వన్డే ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు. కానీ, హిట్‌మ్యాన్ ఆ తర్వాత 6 సంవత్సరాలు జట్టులో స్థిరమైన చోటు సంపాదించలేకపోయాడు.

ఈ క్రమంలో ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2013 ప్రారంభంలో 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం దక్కడం రోహిత్‌కు ఒక వరంగా మారింది. దాంతో అతను జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. ఏకంగా టీమిండియాకు సారథిగా ఎదిగాడు.

## రాణించిన తేజల్, రావల్



ఐర్లాండ్ మహిళలతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఘన విజయం సాధించింది. సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 238పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని స్మృతి మంధాన సేన 34.3ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 239 పరుగుల లక్ష్యాన్ని.. మరో 15.3 ఓవర్లు మిగిలుండగానే ఛేదించింది. ప్రతీక రావల్ (89బీ 10ఫోర్లు, సిక్సర్), తేజల్ (53నాటౌట్‌బీ ఫోర్లు) అర్ధ శతకాలతో చెలరేగారు. కెప్టెన్ స్మృతి మంధాన(41) కీలక ఇన్నింగ్స్ ఆడింది. హర్లీన్ డియోల్(20) ఫర్వాలేదనిపించింది. ఐర్లాండ్ బౌలర్లలో మాగైర్‌కు మూడు, ఫ్రెయా ఒక వికెట్ తీసింది. అంతకుముందు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఓపెనర్ గాబీ లూయిస్(92), లే%ఎ% పాల్(59) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో ప్రియా మిశ్రాకు రెండు, టిటాస్ సద్ధు, సయాలి, దీప్తి శర్మ తలో వికెట్ తీశారు. రెండో వన్డే ఆదివారం జరగనుండగా.. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రతిక రావల్‌కు దక్కింది. ఐర్లాండ్ మహిళలతో జరిగిన తొలి వన్డేలో 41 పరుగులు కొట్టిన టీమిండియా కెప్టెన్ స్మృతి మంధాన ఓ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో వేగంగా నాలుగు వేల పరుగుల మార్క్‌ను అందుకున్న భారత క్రీడాకారిణిగా రికార్డుపుటల్లోకెక్కింది. వ్యక్తిగత స్కోరు 41పరుగుల వద్ద ఫ్రేయా సార్జెంట్ బౌలింగ్‌లో ఓర్లా ప్రెండర్‌గాస్ట్ చేతికి క్యాచ్ ఇచ్చి అవుటైంది. ఈ సిరీస్‌కు రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ దూరం కాగా.. స్మృతి సారథ్య బాధ్యతలు చేపట్టింది. తొలుత మిథాలీ రాజ్(112ఇన్నింగ్స్) ఈ ఘనత సాధించగా.. మంధాన(85ఇన్నింగ్స్)లోనే ఈ ఫీట్‌ను అందుకుంది.

## వాలీబాల్ ఛాంప్ తమిళనాడు

స్థానిక పి బి సిద్ధార్థ కళాశాల మైదానంలో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌గా తమిళనాడు నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో తమిళనాడు 3-0(25-11, 25-22, 25-9)తో కర్ణాటకపై ఘన విజయం సాధించింది. తమిళనాడు జట్టులో భారత జట్టు క్రీడాకారిణిలు పవిత్ర, ప్రతిభ, సాధనలు నెట్‌పై అద్భుతమైన షాట్లు కొట్టి కర్ణాటక జట్టుకు కోలుకోలేని దెబ్బకొట్టారు. తమిళనాడు ఆల్‌రౌండ్ ఆటతీరు ప్రదర్శించి సునాయాసంగా టైటిల్‌ను చేజిక్కించుకుంది. కర్ణాటక జట్టు రన్నరప్‌గా నిలిచింది. తొలుత తతీయ స్థానానికి జరిగిన పోటీలో హర్యానా 3-0(25-22, 26-24, 25-13)తో కేరళను చిత్తుచేసింది. తొలి రెండు సెట్లలో కేరళజట్టు హర్యానాకు గట్టి పోటీనిచ్చింది. మూడో సెట్‌లో హర్యానా విజృంభించి అద్భుతమైన షాట్లతో కేరళను మట్టికరిపించి తతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి భానుమూర్తి రాజు, వాలీబాల్ అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఏ వి రమణారావు, శాప్ మాజీ చైర్మన్ పి అంకమ్మ చౌదరి, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి కె వి రాధాకృష్ణ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి. రవికాంత పాల్గొన్నారు.



## జడ్డూకు చోటు దక్కేనా!



భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాది ప్రత్యేక స్థానం. బౌలింగ్, బ్యాటింగే కాకుండా అద్భుతమైన ఫీల్డర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తను కేవలం సుదీర్ఘ ఫార్మాట్‌కే పరిమితమయ్యేలా కనిపిస్తున్నాడు. ఎందుకంటే ఇప్పటికే జడ్డూ టీ20లకు వీడ్కోలు పలకగా.. తాజాగా వన్డేల్లోనూ అతడిని కొనసాగించడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నెలలో ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీసలతో పాటు ఫిబ్రవరి 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును ప్రకటించాల్సి ఉంది. అంతేకాకుండా 2027 వరల్డ్‌కప్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లకు స్థానం కల్పించాలి. ఈనేపథ్యంలో జడ్డూకు చోటు దక్కడం కష్టమేనన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత 50 ఓవర్ల ఫార్మాట్‌లో అతను జట్టుకు ఆడింది లేదు. అలాగే ఆల్‌రౌండర్ విభాగంలో జడ్డూకు అక్షర్, సుందర్, దూబే, రియాన్ పరాగ్ గట్టి పోటీ ఇస్తున్నారు. హార్దిక్‌కు ఎలాగూ బెర్త్ ఖాయమే. దీనికి తోడు ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలోనూ జడేజా ఆకట్టుకోలేకపోయాడు. అతను ఆడిన మూడు టెస్టుల్లో తీసింది నాలుగు వికెట్లే. బ్యాటింగ్‌లో మాత్రం ఓ అర్ధసెంచరీ చేశాడు. అందుకే భవిష్యత్ టోర్నీల్లో జడ్డూ లేకుండానే ముందుకు వెళ్లాలని సెలెక్టర్లు భావిస్తున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. అయితే ఇంగ్లండ్‌తో ఆడబోయే టెస్టు సిరీస్‌లో మాత్రం జడేజా స్థానానికి ఢోకా ఉండకపోవచ్చు. కాగా, మిడిలార్డర్‌లో అనుభవజ్ఞుడైన ఆటగాడు లేకపోవడం అతడికి కలిసొచ్చే అంశం. మరోవైపు అదృష్టం బాగుంటే అతను చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడే అవకాశం లేకపోలేదన్నది కొందరి అభిప్రాయం. ఎందుకంటే ఈ మెగా టోర్నీలో భారత్ ఆడే మ్యాచ్‌లు దుబాయ్‌లో జరుగనున్నాయి. అక్కడి పిచ్‌లు ఎక్కువగా స్పిన్నర్లకే అనుకూలిస్తుంటాయి. దీంతో అపార అనుభవం కలిగిన వెటరన్ జడేజా జట్టులో ఉంటే సహాయకంగా ఉంటుందని సెలెక్టర్లు భావిస్తే మాత్రం అతను కూడా దుబాయ్ విమానం ఎక్కే ఆస్కారం ఉంది.

## క్రికెట్ అన్ని ఫార్మాట్లకు వరుణ్ ఆరోన్ గుడ్‌బై



జార్ఖండ్‌కు చెందిన టీమిండియా పేసర్ వరుణ్ ఆరోన్(35) అంతర్జా తీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. క్రికెట్ అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్లు ఇన్‌స్ట్రాలో వెల్లడించాడు. 2025 విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో జార్ఖండ్ మ్యాచ్‌లు పూర్తయిన అనంతరం వరుణ్ తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ”గత 20ఏళ్లు క్రికెట్ ప్రపంచంగా జీవించా.. అపారమైన అనుభవం, కృతజ్ఞతతో స్వచ్ఛందంగా అన్ని ఫార్మాట్లనుంచి వైదొలుగుతున్నా..” అని పోస్ట్ చేశాడు. 2010-11 విజరు హజారే ట్రోఫీతో వెలుగులోకి వచ్చిన వరణ్.. గంటకు 150కి.మీ. వేగంతో బంతులు సంధించాడు. టీమిండియా తరఫున 9టెస్టులు, 9వన్డేల్లో 29 వికెట్లు తీశాడు. 2015 నవంబర్‌లో దక్షిణాఫ్రికాపై బెంగళూరులో చివరిసారిగా మ్యాచ్ ఆడాడు. లిస్ట్-ఎ క్రికెట్‌లో 88మ్యాచుల్లో 26.47 సగటుతో 141 వికెట్లు పడగొట్టాడు. 95 టి20ల్లో 93 వికెట్లు సాధించాడు. ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) ఢిల్లీ డేర్‌డెవిల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.

## 2022లో నాపై విషప్రయోగం జరిగింది

టెన్నిస్ స్టార్ నోవాక్ జకోవిచ్ సంచలన ఆరోపణ చేశాడు. 2022లో తనపై విషప్రయోగం జరిగినట్లు తాజా ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి ముందు జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ జకో ఈ వ్యాఖ్యలు చేశాడు. 2022లో మెల్‌బోర్న్‌లోని ఓ హొటల్‌లో తనకు విషపూరిత ఆహారం ఇచ్చినట్లు, సీసం, పాదరసం కలిసి ఉన్న ఆహారాన్ని ఇచ్చినట్లు తెలిపాడు. కోవిడ్ వ్యాక్సిన్ వేసుకోని కారణంగా.. ఆ ఏడాది ఆస్ట్రేలియా నుంచి తాను వైదొలగాల్సి వచ్చిందని, అలాగే వీసాను రద్దు చేసి ఆ టోర్నీ ఆడకుండా వెనక్కి పంపించేశారంటూ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జకోవిచ్.. ఈ ఏడాది జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొంటున్నాడు. ఆదివారం నుంచి ఆ టోర్నీ జరగనుంది. 11వ సారి అతను ఈ టోర్నీలో పాల్గొంటున్నాడు. 2022 ఆస్ట్రేలియా వివాదం తన కెరీర్‌ను ఇబ్బంది పెట్టినా.. ఆస్ట్రేలియా ప్రజల పట్ల తనకు ఎటువంటి ద్వేషభావం లేదన్నాడు. తానేమీ వ్యాక్సిన్‌ను అనుకూలం, వ్యతిరేకం కూడా కాదని, కానీ శరీరానికి తగినట్లుగా వాటిని తీసుకునే హక్కు తనకు ఉందని, ఆ అంశంలో మరొకరి ప్రోద్బలం అవసరం లేదని తెలిపాడు.



# రోడ్డు మరమ్మత్తులకు ధన్యవాదములు తెలిపిన బీ.ఆర్.ఎస్.



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 11 జనవరి 2025** మణికొండ భారత రాష్ట్ర సమితి నాయకుల తరఫున గత 6 నెలలుగా మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని పైప్ లైన్ రోడ్డులో గల లాలమ్మ గార్డెన్, హుడా కాలనీ కూడలిలో రహదారి గుండా వెళ్లే వాహనదారులు ఎంతో ఇబ్బందిలకు గురవుతున్నారని ఫిర్యాదులపై ఫిర్యాదులు మునిసిపల్ మరియు జలమండలి అధికారులకు ఇవ్వడం జరిగినను స్పందన లేనందు వలన ఈ విషయమై పార్టీ పెద్దల దృష్టికి బుద్దోలు బాబు, మాల్యాద్రి నాయుడు,అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, శ్రీనివాస్ చారి తదితరుల తీసుకెళ్ళడం, అందుకు స్పందించిన మణికొండ భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆద్వర్యంలో పార్టీ నేతలు కలసి కట్టుగా జలమండలి అధికారులను కలసి సమస్య తీవ్రతను తెలియ చేసినందు వలన ఎట్టకేలకు జలమండలి 18 వ డివిజన్ అధికారులు చొరవతీసుకొని రోడ్డు మరమ్మత్తులు చేసి స్థానిక ప్రజలకు, వాహన దారులకు ఊరట గల్పించిన సందర్భముగా జలమండలి అధికారులకు మరియు ఈ విషయమై పూర్తి సహకారాన్నందించిన ప్రింట్ మీడియా వారికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపిన మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు.

# గట్టుప్పల్ లో తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడలు







**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 11 జనవరి 2025** స్వామి వివేకానంద 162 జయంతి సందర్భముగా 12 జనవరి 2025 ఆదివారం రోజున జడ్.పీ.హెచ్. స్కూల్ గట్టుప్పల్, నల్లగొండ జిల్లా ఆవరణలో లైట్ అండ్ లైఫ్ యూత్ అసోసియేషన్ – గట్టుప్పల్ వారి ఆద్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడల టోర్నమెంట్లో జరుపు బడుతున్నాయని అందులో జిల్లాల వారీగా మొత్తంగా 16 జట్లు పాల్గొంటున్నాయనీ అందులో మణికొండ బాల్ బాడ్మింటన్ సభ్యులు కూడా పాల్గొంటున్నారని ముఖ్య సలహాదారుడు అందె లక్ష్మణ్ రావు తెలియ చేసినారు, అందుకు గాను కెప్టెన్ గా శ్రీనివాసరావు, జట్టు సభ్యులుగా రమేషు, గోపి, ప్రశాంత్, నవీన్, హసీం, సీతారామరాజు, హరినాద్ రెడ్డి, రామ్ రెడ్డి మరియు శశిధర్ లు పాల్గొంటున్నారని వారందరు సమయ పాలనతో కలసి కట్టుగా ఐక్యమత్యంగా ఆటాడి బహుమతి గెలుచుకునీ రావాలని వీ.ఆర్.4 సహయోగ్ చారిటబుల్ ట్రస్టు కోశాధికారి దిలీప్ కక్కడ్ మనసార కోరుకోవడం జరిగినది.

## మణికొండలో సంక్రాంతి ముగ్గుల పోటీల సంబరాలు









**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 11 జనవరి 2025** భారత రాష్ట్ర సమితి మణికొండ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి ఆద్వర్యంలో సుమనళినీ, అంశుల సహకారంతో సంక్రాంతి ముగ్గుల పోటీలు సరదాగా సంబరాలతో సంతోశముగా ఆట పాటలతో కూడిన చలోక్తులతో 11-01-2025 శనివారం రోజన కే.పీ.ఆర్ కాలనీ రోడ్డు నంబర్ 7 లో నిర్వించబడెనని తెలుపుతూ, ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజేతులను ఎంపిక చేసిన న్యాయ నిర్ణేత రిటైర్డ్ ప్రొఫెసర్ సుధా మాధవి, ముఖ్య అతిథీగా భారత రాష్ట్ర సమితి రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొనీ గెలుపొందిన మొదటి బహుమతి రమ్యా కి 5000/- రెండవ బహుమతి లతాకి 3000/- మూడవ బహుమతి సంధ్యాకి 2000/- కంసోలేషన్ ప్రైజెస్ విజయ, వనజలకు అందజేసినారు, ఈ సందర్భంగా స్థానిక బీ.ఆర్.ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళతో పాటు సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగినది.

# లక్షెట్టిపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

### ఆర్టీసీ బస్సులు నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టండి
### అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు
### ఎస్సై పి సతీష్ కు వినతిపత్రం అందజేత



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 11** :పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని,అంబేద్కర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు కోరారు.శనివారం అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సై పి సతీష్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ...పట్టణంలో ప్రధాన కూడళ్ళయిన అంబేద్కర్ చౌరస్తా,గాంధీ చౌక్,పాత బస్టాండ్ ఏరియాల్లో నిత్యం వాహనాల రద్దీ కొనసాగుతుందని, వారసంతల రోజు ప్రజలు, వాహనాల రద్దీ మరీ ఎక్కువగా ఉంటుందన్నారు.ఈ ట్రాఫిక్ ను నియంత్రించాలని కోరారు. భారీ వాహనాలు రోడ్డుపై నిలిపి లోడింగ్,అన్ లోడింగ్ చేయడంతో వాహన దారులకు ఇబ్బందిగా మారిందన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు నడిరోడ్డుపై ఆగడం వల్ల వెనక నుండి వచ్చే వారికీ ఇబ్బందిగా ఉందన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం భారీ ట్రాఫిక్ ఉంటుందని, వెంటనే ఆర్టీసీ బస్సులు దూరంగా ఆపాలని కోరారు.నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఐను కోరారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ...నిబంధనల మేరకే వారసంత కొనసాగేలా చర్యలు చేపడుతామని, ఇద్దరు పోలీసులను నియమిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దమ్మ నారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిప్పకుర్తి నారాయణ,జిల్లా నాయకులు మాలెం చిన్నన్న, సీనియర్ నాయకులు భూపెల్లి మల్లేష్,జక్కుల రాజలింగు, మినుముల జనార్దన్, మండల గౌరవ సలహాదారు లింగంపల్లి వెంకటేష్,ఉపాధ్యక్షులు భైరం లింగన్న,వేల్పుల ప్రేమ్ సాగర్, మహేందర్,పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, ఉపాధ్యక్షులు లింగంపల్లి సుధాకర్,కండె మొగిలి, అడ్లూరి శివకుమార్,మంచాల కుమార్,చాతరాజు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సంచార జాతుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు ఒడ్డే ఓబన్న

### జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పురుషోత్తం నాయక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 11 :సంచార జాతుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు ఒడ్డే ఓబన్న అని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పురుషోత్తం నాయక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడ్డే ఓబన్న 218 వ జయంతి కార్యక్రమంలో పాల్గొని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నేరటి రాజేశ్వరి,కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్,వడ్డెర కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ... మహనీయుల చరిత్రను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.ఒడ్డే ఓబన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమలో రేనాడు ప్రాంతంలో 1816 సంవత్సరం జనవరి 11వ తేదీన జన్మించి, 18 వ శతాబ్దంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా సంచార జాతులకు నాయకత్వం వహించాడని,గెరిల్లా యుద్ధ పద్ధతిలో పోరాడాడని, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దౌర్జన్యాలను ఎదుర్కొని తన జాతులను కాపాడుకున్న మహనీయుడు అని కొనియాడారు.ప్రభుత్వం ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గుణదల మేరీ మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాము

### ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)
### కలెక్టర్ కార్యాలయంలో గుణదల చర్చ్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం
### సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సిపి రాజశేఖర్ బాబు



విజయవాడ : గుణదల మేరీమాత ఉత్సవాలు దేశంలో తమిళనాడు నాగపట్నంలో, విజయవాడ లో మాత్రమే జరుగుతాయని...ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జరిగే ఈ ఉత్సవాలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడతాము. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. గుణదల మేరీమాత ఉత్సవాల సందర్భంగా చర్చ్ కౌన్సిల్ సభ్యులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య హాల్ నందు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ , సిపి రాజశేఖర్ బాబులతోపాటు ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించుకున్నారు. పది లక్షల మంది పైగా భక్తులు వస్తారని కాబట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో చర్చ్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎన్.విజయరాజు మాట్లాడుతూ కొండపైకి వచ్చే రహదారిలో ఆక్రమణలు ఎక్కువగా వున్నాయని వాటిని తొలగించాలని, అలాగే నిత్యం విజయవాడ బస్టాండ్ నుంచి, రైల్వే స్టేషన్ నుంచి గుణదల చర్చికి మినీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా వున్నాయని వారిని ఆరికట్టడానికి ఆలయ ప్రాంగణంలో పోలీస్ అవుట్ పోస్ట్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అడిగారు. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గుణదల మేరీమాత ఉత్సవాలకు సంబంధించి ఇలాంటి రివ్యూ మీటింగ్ చర్చ్ కౌన్సిల్ సభ్యులతో జరగటం ఇదే మొదటి సారి అన్నారు. ప్రభుత్వ పరంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్నివిధాలు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రస్తుతానికి తాత్కలిక పనులు చేపట్టి...ఉత్సవాల అనంతరం పర్మినెంట్ పనుల దృష్టి సారిస్తామన్నారు. కలెక్టర్ లక్ష్మి శా మాట్లాడుతూ మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుణదల చర్చి ప్రెసిడెంట్ నువ్వుల విజయబాబు, వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి జోసెప్ బాట్టిస్తా, కోశాధికారి గోలి విజయానంద్ జోసెప్ , సభ్యులు జి.రవి కుమార్, పిల్లి చిరస్తు దాసు, సేవ అబ్రహం, దాసరి సిల్వ ప్రసాద్, బండి జయరాజు, జి. బాల బాబుజీ, సి.అరుణ కుమారి, జి.యేసు దీవెనమ్మ లతోపాటు ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ,టిడిపి దళిత నాయకులు నందిపాటి దేవానంద్, ఇత్తడి విక్టర్ చార్లెస్, ఊర్ల మోహనరావు, చాట్ల రాజశేఖర్, పరిసపోగు రాజేష్, సంకె విశ్వనాధం పాల్గొన్నారు..

# అంగరంగ వైభవంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 11:మందమర్రి పట్టణంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ మైదానంలో శ్రీ వచ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల విజేతలకు మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ శివనీతి రాజశేఖర్ లు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీమణి శ్రీమతి రజని, సబ్ ఇన్స్పెక్టర్ సతీమణి శ్రీమతి హారిక ప్రియ, ప్రభుత్వ ఉపాధ్యాయిని శ్రీమతి కే. యశోదలక్ష్మి లు వ్యవహరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సిఐ దంపతులను ఎస్సై దంపతులను ఘనంగా సత్కరించారు.



ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు రాజయోగి షాపింగ్ మాల్ యజమాని రాజు అందించారు. పట్టు, ఫ్యాన్సి, కోటా చీరలు, కన్సోలేషన్ 5 బహుమతులను పెట్రోల్ బంక్ యజమాని కొంపెల్లి రమేష్ లు అందించగా పార్టిసిపేట్ గిఫ్ట్ లను జి – మార్ట్ సూపర్ స్టోర్ యజమాని గంప ఆంజనేయులు అండ్ బ్రదర్స్ లు అందించారు. సంక్రాంతి సంబరాలతో (గొబ్బెమ్మలు,పులగం పాయసం, భోగిమంటలు,పతంగలు, బెలూన్లు,చక్కటి ముగ్గులు) వేసిన మహిళలు అందరినీ ఆహ్లాదపరిచారు. ఈసందర్భంగా కుమారి లహరిప్రియ చేసిన నృత్యం అలరించింది. ఈకార్యక్రమంలో శ్రీవచ సేవా సంస్థ అధ్యక్షులు ఉప్పలంచి చంద్రకాంత్, దాసరి శ్రీకాంత్, మాచర్ల వెంకటస్వామి, స్థానిక కాంగ్రెస్ నాయకులు రాచర్ల గణేష్, మాయ రమేష్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు



ప్రజాబలం చెన్నూర్ నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 11పని ప్రదేశంలో రక్షణ మరియు ఆరోగ్యం, ఘర్షణ వాతావరణ నిర్మూలనకై మెరుగైన చర్చలు చేయడం తదితర అంశాలపై విజయవాడలో జపనీస్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్, ఐఎన్టియుసి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంశెట్టి నరేందర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పని ప్రదేశాల్లో రక్షణ యొక్క ప్రాముఖ్యత ఉద్యోగుల యొక్క ఆరోగ్యంపై శ్రద్ధ ఘర్షనల వాతావరణంలో చర్చల ద్వారా యాజమాన్యంతో కార్మికుల డిమాండ్లపై ఎలా కార్మిక సంఘం పని చేయాలనే అంశాలతో పాటు ఉద్యోగులపై మానసిక, శారీరక, ఒత్తిడుల నివారణ, వేధింపుల అరికట్టడంలో కార్మిక సంఘం బాధ్యత, దేశ అభివృద్ధిలో కార్మిక రంగం ప్రాముఖ్యత గురించి కూడా తెలుసుకోవడం జరిగిందన్నారు. జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంతో విలువైన శిక్షణను ఇచ్చారని, గ్రూప్ డిస్కషన్ విభాగంలో అత్యుత్తమ ప్రేసెంటేషన్ కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో అత్యున్నత ప్రతిభ సర్టిఫికెట్ను జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ అధ్యక్షుడు యసునోబు ఆహిర సాన్, ఐఎన్టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ మెంబర్ సత్యజిత్ రెడ్డి చేతుల మీదుగా పొందినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తనకు కల్పించినందుకు ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవరెడ్డికి, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సెక్రటరీ జనరల్, ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో ఆప్ ఎంఎల్ఎ గుర్ప్రీత్ గోగీ మృతి





ఛండీగఢ్ జనవరి 11 పంజాబ్‌లోని లుథియానా వెస్ట్ ఎంఎల్ఎ గుర్ప్రీత్ గోగీ బస్సీ (58) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? ఆప్ ఎంఎల్ఎ గుర్ప్రీత్ గోగీకి శుక్రవారం అర్ధరాత్రి బుల్లెట్ తగలడంతో కుటుంబ సభ్యులు దయానంద్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గోగీ చనిపోయారని వెల్లడించారు. ఎంఎల్ఎ తలలో రెండు బుల్లెట్లు ఉన్నాయని వైద్యులు పేర్కొన్నారు. తుపాకీ ప్రమాదవశాత్తు పేలిందని ఎంఎల్ఎ కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని డిసిపి కుల్దీప్ సింగ్ చాహల్ తెలిపారు. ఆత్మహత్య చేసుకొని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. గుర్ప్రీత్ 2021లో ఆప్‌లో చేరి లుథియానా వెస్ట్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎంఎల్ఏగా విజయం సాధించారు. లూథియానాలో శుక్రవారం స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వన్, ఎంపి సంత్ బాబా బల్బీర్ సింగ్ సీచెవాల్‌తో కలిసి బుద్దానుల్లా స్వచ్ఛత కార్యక్రమంలో గోగీ పాల్గొన్నారు.

## ధరణి పేరుతో బిఆర్ఎస్ నాయకులు కొంపలు ముంచారు

## కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి ..బండి సంజయ్ డిమాండ్



సిరిసిల్ల జనవరి 11 ధరణి పేరుతో బిఆర్ఎస్ నాయకులు కొంపలు ముంచారని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపణలు చేశారు. కబ్జా భూములను స్వాధీనం చేసుకొని దివ్యాంగులకు కాలనీ కట్టాలని డిమాండ్ చేశారు. రాజన్నసిరిసిల్ల పర్యటనలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇష్టాను రీతిన మాట్లాడితే సమాజం గుర్తించదని, పదవి ప్రజలు పెట్టిన భిక్ష అని బండి సంజయ్ తెలిపారు. ధరణితో ఓ కుటుంబం లాభపడిందని, కబ్జా భూములు స్వాధీనం చేసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేయొద్దని ఆయన కోరారు. ఈ విషయంలో మా సహకారం ఉంటుందని బండి స్పష్టం చేశారు.

# ఆదివాసీ గిరిజనులను అని విధాలా ఆదుకుంటాం: మంత్రి ఉత్తమ్



నల్లగొండ జనవరి 11 : ఆదివాసీ గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివాసీ గిరిజనులను అని విధాలా ఆదుకుంటామన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్‌లో జరిగిన ఆదివాసీ గిరిజనుల సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగించారు. బడ్జెట్‌లో ఆదివాసీలకు పది శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కెసిఆర్ సర్కార్ పదేళ్లలో ఆదివాసీ గిరిజనులను పట్టించుకోలేదని విమర్శలు గుప్పించారు. గ్రామ పంచాయితీలకు గత సర్కార్ మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ప్రతీ తండాలో స్కూల్, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. మంత్రులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆదివాసీ గిరిజనుల సభకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంఎల్ఎ జైవీర్‌లు హాజరయ్యారు.

## అబ్దుల్లాపూర్ మెట్ ఓఆర్ఆర్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

## రెండు మార్గాల ద్వారా వెళ్లాలని పోలీసులు సూచనలు



హైదరాబాద్ జనవరి 11 సంక్రాంతి సందర్భంగా నగర ప్రజలు ఒక్క సారిగా పల్లె బాట పట్టడంతో శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అబ్దుల్లాపూర్ మెట్ ఓఆర్ఆర్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అబ్దుల్లాపూర్ మెట్ నుంచి కొత్తగూడెం వరకు నెమ్మదిగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. విజయవాడ జాతీయరహదారిపైప ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రిస్తున్నారు. విజయవాడ జాతీయ రహదారిలో పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీని తగ్గించేందుకు మరో రెండు మార్గాల ద్వారా వెళ్లాలని పోలీసులు సూచనలు చేస్తున్నారు.అద్దంకి నార్కట్‌పల్లి రహదారికి బదులుగా సాగర్ మీదుగా మాచర్ల రహదారి ఎంచుకోవాలని సూచించారు. ఎల్‌బి నగర్ నుంచి వెళ్లే వాహనాలు బిఎన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మీదుగా సాగర్‌కు దారి ఉంటుందన్నారు. ఓఆర్ఆర్ నుంచి వెళ్లే బొంగులూరు ఎగ్జిట్ నుంచి సాగర్‌కు ప్రత్యామ్నాయ రహదారి, విజయవాడ ప్రధాన రహదారికి ప్రత్యామ్నాయంగా ఘట్‌కేసర్, భువనగిరి, చిట్యాల రహదారి ఎంచుకోవాలని పోలీసులు సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా చిట్యాల వెళ్లాలని సూచిస్తున్నారు. ఒఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్ వద్ద ఎగ్జిట్ అయి భువనగిరి మీదుగా చిట్యాల వెళ్లవచ్చన్నారు.దీంతోపాటు రైల్వేస్టేషన్‌లు, ఎంజిబిఎస్, జేబిఎస్ బస్టాండ్‌లు సైతం ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. రైళ్లలో రిజర్వేషన్‌లు దొరక్కపోవడంతో జనరల్ బోగీల్లోనైనా వెళ్లాలన్న తాపత్రయంతో ప్రయాణికులు భారీగా రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్నారు. రైళ్లో రిజర్వేషన్‌లు దొరకని ప్రయాణికులు బస్సుల్లోనూ వెళ్లడానికి భారీగా ఇమ్లిబన్‌కు తరలివస్తుండడంతో ఆ ప్రాంతమంతా ప్రయాణికుల రాకతో సందడిగా మారింది.

## ఏపీలో త్వరలో వాట్సప్ ద్వారా ప్రభుత్వ సేవలు సీఎస్

అమరావతి, ఏపీ రాష్ట్రంలో వాట్సప్ ద్వారా త్వరలో 150 రకాల పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ఆర్టీజీఎస్, కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వివిధ శాఖలు తమ పనితీరు మెరుగుపరచుకోవడానికి వీలుగా ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారాన్ని అందించాలని తెలిపారు. ప్రభుత్వంలోని ప్రతి శాఖతోనూ ఆర్టీజీఎస్ సమన్వయం చేసుకోవాలని సీఎస్ ఆదేశించారు.

## లాల్ బహుదూర్ శాస్త్రికి నివాళలర్పించిన టిడిపి నాయకులు,కార్యకర్తలు

చాగలమర్రి స్వతంత్ర సమరయోధులు లాల్ బహదూర్ శాస్త్రి 125 వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన చాగలమర్రి లో తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్ల నాగరాజు నివాసంలో టిడిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ రెండవ ప్రధానమంత్రి , భారతదేశ స్వాతంత్ర్యోద్యమం లో ప్రముఖ పాత్రధారి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు. అతను 1920లలో భారత స్వాతంత్ర్యోద్యమంలో తన స్నేహితుడు నితిన్ ఎస్లావత్ తో కలసి చేరాడు. మహాత్మా గాంధీ ప్రభావంతో అతను మొదట మహాత్మా గాంధీకి, తరువాత జవహర్లాల్ నెహ్రూ కు నమ్మకస్తుడైన అనుచరుడయ్యాడు. 1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అతను భారతదేశ ప్రభుత్వంలోచేరి జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వంలో మొదట రైల్వే మంత్రిగా (1951?56), తరువాత హోంమంత్రిగా భాద్యతలను కూడా చేపట్టాడు. శాస్త్రి నెహ్రూకి విధేయుడు. అలాగే నెహ్రూ, శాస్త్రికి ఎంతో ఇష్టమైనవాడు అయినప్పటికీ పార్టీలో గట్టి ప్రతిపక్షాన్ని ఎదుర్కొన్నాడు. కానీ నెహ్రూతో సాన్నిహిత్యం కారణంగా అతను తరువాత కాలంలో ప్రధానమంత్రి కాగలిగాడు. అతను 1965 ఇండో–పాకిస్థాన్ యుద్ధం కాలంలో దేశాన్ని నడిపించాడు. అతని నినాదం “జై జవాన్ జై కిసాన్” యుద్ధ సమయంలో బాగా ప్రాచుర్యంలోనికి వచ్చి ప్రస్తుత కాలం వరకు ప్రజల హృదయాల్లో గుర్తుండి పోయేలా నించిపోయారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి,టైలర్ చోటు, మహబూబ్ బాషా,బాల దస్తగిరి, కశినేని ఓబులేసు, అబ్దుల్లా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com